PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 88 | విజయవాడ, బుధవారం 29 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 29 October 2025 | Rs

అమెరికాకు తలొగ్గిన మోడీ

- రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నిలిపివేత
- యుఎస్ నుంచి రికార్డ్ దిగుమతులు
- ట్రంప్ ఒత్తిడితోనే కేంద్రం నిర్ణయం : ప్రకాశ్‌కరత్

3

కుర్రాళ్ల సత్తాకు పరీక్ష

8

నేడు ఆస్ట్రేలియాతో తొలి టి20 - మధ్యాహ్నం 1.45ని.లకు

అల్లకల్లోలం

విశాఖ తీరంలో ఈదురుగాలుల బీభత్సం

- తీరాన్ని తాకిన మొంథా
- కోస్తా అంతా భారీ వర్షాలు
- ఉవ్వెత్తున ఎగిసిన రాకాసి అలలు
- ఈదురుగాలుల హోరు-అంధకారంలో తీరప్రాంత గ్రామాలు
- జాతీయరహదారిపై వాహనాల నిలిపివేత
- మరో రెండు రోజులు తుపాన్ ప్రభావం
- 31వ తేది వరకు విద్యాసంస్థలకు సెలవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండు, మూడు రోజులుగా తీరప్రాంతాన్ని వణికించిన మొంథా తుపాన్ తీరాన్ని తాకింది. మంగళవారం రాత్రి 7:45 గంటల ప్రాంతంలో కాకినాడ-మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తుపాన్ తీరాన్ని తాకినట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. మంగళవారం అర్ధరాత్రికిగాని, బుధవారం తెల్లవారుజామున గానీ పూర్తిగా తీరాన్ని దాటుతుందని భావిస్తున్నారు. తుపాన్ పూర్తిగా తీరాన్ని దాటిన తరువాత కూడా మరో రెండు రోజుల పాటు ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తుపాన్ తీరాన్ని తాకిన సమయంలో దాదాపుగా కోస్తా ప్రాంతమంతా పెద్ద ఎత్తున ఈదురుగాలులతో పాటు కుంభవృష్టి కురిసింది. సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడ్డాయి. ఉప్పాడ, విశాఖ, ప్రకాశంతోపాటు నెల్లూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రాకాసి అలలు విరుచుకుపడినట్లు వార్తలు వచ్చాయి. ఈదురుగాలుల ధాటికి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. శిథిలావస్థలో ఉన్న కొన్ని స్తంభాలను అధికారులే ముందు జాగ్రత్త చర్యగా తొలగించారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో తీరప్రాంతంలోని అనేక గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఈ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు కనీసం రెండు రోజుల సమయం పడుతుందని సమాచారం. ఈదురుగాలుల జోరు కొనసాగుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా జాతీయ రహదారిపై భారీ వాహనాలను అధికారులు నిలిపివేశారు. తుపాన్ తీరాన్ని తాకడానికి ఒకటి, రెండు గంటల ముందే రాష్ట్ర ప్రభుత్వం నుండి ఈ మేరకు ఆదేశాలు అందాయి. దీంతో దాదాపుగా తీర ప్రాంతంలోని అన్ని జిల్లాల్లోనూ భారీ వాహనాలను అడ్డుకున్నారు. దీంతో అనేకచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జాతీయ రహదారిపై కిలోమీటర్ల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. ఈదురుగాలుల తీవ్రత తగ్గిన తరువాత బుధవారం ఉదయం వీటికి అనుమతి లభించే అవకాశం ఉంది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అన్ని విద్యాసంస్థలకు ఈ నెల 31వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. తుపాన్ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల పరిధిలోని 403 మండలాలపై ఉందని అధికార వర్గాలు తెలిపాయి. తీరం దాటిన తరువాత ఉమ్మడి విశాఖ, ఉమ్మడి గోదావరి జిల్లాలు, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభావం అధికంగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఆ జిల్లాల అధికారులను పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 38 వేల హెక్టార్లలో పంటనష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనావేశారు. 1.38 లక్షల హెక్టార్లలో ఉద్యానపంటలు కూడా ప్రభావితమైనట్లు అంచనావేశారు.

వేగంగా నష్టం అంచనాలు : సిఎం ఆదేశం

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో చోటుచేసుకున్న నష్టాలపై అంచనాలను వేగంగా రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, హోం శాఖమంత్రి అనిత, ఐటి మంత్రి లోకేష్‌తో కలిసి మంగళవారం ఆయన పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనికోసం తుపాన్ ప్రభావిత ప్రాంతాలకు ఆరుగురు సభ్యులతో బృందాన్ని పంపాలన్నారు. నివేదికను వెంటనే కేంద్రానికి పంపాల్సి ఉందన్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. రహదారులు, చెరువులకు గండ్లుపడితే పునరుద్ధరించాలని అన్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లోని గర్భిణుల సమాచారంపై ఆరాతీసిన సిఎం సురక్షిత ప్రదేశాలకు తరలించాలని నిర్ధేశించారు.



తీరం దాటుతున్న తుపాను.. ఐఎండి చిత్రం

ఉలవపాడులో 12.6 సెంటీమీటర్లు నమోదు

తుపాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీవర్షపాతం నమోదైంది. మంగళవారం సాయంత్రం 5గంటలకు నెల్లూరుజిల్లా ఉలవపాడులో 12.6 సెంటీమీటర్లు, సింగరాయకొండలో 10.5 సెంటీ మీటర్లు, కావలిలో 12.2 సెంటీమీటర్లు, దగదర్తిలో 12,బి.కోడూరులో 6, కళింగపట్నం 7, విశాఖ సెంటీమీటర్లు 2, తుని సెంటీ మీటర్లు 2 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది.

600 మందిని కాపాడారు..

చేపల వేటకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన 600మంది 60 ట్రాలర్లతో ఒడిషాలోని ఛత్రపురం వద్ద సముద్రంలో చిక్కుకున్నారు. ఈ విషయం తెలియడంలో అక్కడి ప్రభుత్వం వెంటనే స్పందించింది. సహాయ బృందాలను పంపి ఆ 600 మందిని ట్రాలీలతో పాటు సమాపంలోని గోపాల్‌పూర్ ఓడరేవుకు తరలించింది.

విద్యార్థినులకు కరెంటు షాక్..

ఈదురుగాలులు, వర్షం ధాటికి విద్యుత్ వైర్లు తెగడంతో పాటు, షార్ట్ సర్క్యూట్ కూడా కావడంతో విజయనగరం జిల్లా గుర్ల కెజిబివిలో పలువురు విద్యార్థినులు కరెంటుషాక్‌కు గురయ్యారు. ఈ సంఘటన జరిగినప్పుడు 30 మంది దాకా విద్యార్థినులు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఐదుగురు స్పృహ తప్పడంతో వారిని నెల్లిమర్ల ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు.

వాగులో చిక్కుకున్న బస్సు..

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ వద్ద ఆర్‌టిసి బస్సు వాగులో చిక్కుకుంది. బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులను స్థానికులు కాపాడారు.

విశాఖ ఎంవిపి కాలనీలో కారుపై విరిగిపడ్డ చెట్టు

కాకినాడ జిల్లా ఉప్పాడలో సముద్రపు అలల ఉధృతి

8వ పిఆర్‌సి నియామకం

- కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- జస్టిస్ రంజన దేశాయ్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ
- 18 నెలల్లో కేంద్రానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు సంబంధించి ఎనిమిదవ వేతన సంఘ నియామకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 1.19 కోట్ల మంది ఉద్యోగులు, పింఛనర్ల వేతనాలు, పింఛన్ల సవరణకు ఈ సంఘం ప్రతిపాదనలు చేయనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన మంగళవారం నాడిక్కడ కేంద్ర మంత్రివర్గం భేటీ అయ్యింది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్‌ఎంసి)లో కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులతో మాట్లాడారు. ప్రధానంగా 8వ వేతన సంఘం (పే కమిషన్) నిబంధనలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని, కమిషన్‌లో ఒక చైర్‌పర్సన్, ఒక సభ్యుడు (పార్ట్ టైమ్), ఒక సభ్య-కార్యదర్శి ఉంటారని తెలిపారు. సంఘం చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ వ్యవహరిస్తారని, పార్ట్ టైమ్ సభ్యులుగా ప్రొఫెసర్ పులక్ ఘోష్, సభ్య కార్యదర్శిగా పంకజ్ జైన్ నియమితులైనట్లు పేర్కొన్నారు. ఈ కమిటీ 18 నెలల్లోపు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేస్తుందన్నారు. దీనివల్ల కేంద్ర పరిధిలోని 50 లక్షల మంది ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనర్లకు లబ్ది చేకూరనున్నట్లు వెల్లడించారు. కాగా... ప్రస్తుత 7వ వేతన సవరణ సంఘం కాల పరిమితి వచ్చే ఏడాదితో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త వేతన సవరణ అమలు కోసం 2025 జనవరిలో 8వ వేతన సంఘం ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై పలువురు కేంద్ర మంత్రులు, మంత్రిత్వ విభాగాల సిబ్బందితో సమీక్షలు నిర్వహించి.. అనంతరం ముగ్గురు సభ్యులతో ఈ కమిషన్‌ను నియమించింది.

జస్టిస్ రంజన దేశాయ్

వెనిజులాలో ముగ్గురు అమెరికా గూఢచారుల అరెస్టు

కారకాస్ : వెనిజులాలో వామపక్ష ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని అమెరికా నిత్యం కుట్రలకు పాల్పడుతూనేవుంది. ఈ క్రమంలో చొరబడిన ముగ్గురు అమెరికా గూఢచారులను వెనిజులా భద్రతాధికారులు అరెస్టు చేశారు. కరేబియన్ సముద్రంలో ట్రినిడాడ్-టొబాగోతో సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ముగ్గురూ వెనిజులా రహస్య సమాచారాన్ని అమెరికాకు చేరవేశారు. ఈ వివరాలను వెనిజులా హోం మంత్రి డియోస్డాడో కాబెల్లో రోండన్ బుధవారం వెల్లడించారు. వీరికి అమెరికా నిఘా సంస్థ సిఐఎతో సంబంధాలు ఉన్నాయని, వీరి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, సిఐఎ కార్యాచరణ మాన్యువల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వెనిజులాపై దురాక్రమణను సమర్థించే సంఘటనలను అనుమతించమని స్పష్టం చేశారు. కరేబియన్ జలాల్లో ఉన్న అమెరికా యుద్ధనౌకపై దాడి చేసి, వెనిజులాపై దురాక్రమణలను సమర్థించుకోవడానికి కుట్ర జరిగిందని, ఇందుకు సంబంధించిన సమాచారం తమ వద్ద ఉందని మంత్రి కాబెల్లో తెలిపారు. ఇలాంటి సంఘటనలు దేశీయ, విదేశీ వ్యక్తుల ద్వారా వెనిజులాను అస్థిరపరిచేందుకు జరుగుతున్న ప్రయత్నాలను నిర్ధారిస్తున్నాయని చెప్పారు. పౌర, సైనిక దళాల మధ్య సమన్వయంతో దేశ భద్రతను రక్షించడానికి ప్రభుత్వం నిరంతర నిబద్ధతతో ఉందని స్పష్టం చేశారు. 'వెనిజులా ప్రజలకు హాని జరగకుండా నిరోధించడానికి మేం ప్రతిరోజూ పని చేస్తాం' అని చెప్పారు.

జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై లోతైన అధ్యయనం

- సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై లోతైన అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఈ అంశంపై ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం ఆయనతో మంగళవారం నాడు సమావేశమైంది. ఈ ఈ సమావేశానికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాల పర్యటన సందర్భంగా తమకు అందిన వినతులను, ప్రతిపాదనలను కమిటీ సభ్యులు సిఎంకు అందచేశారు. అనంతరం ఆయనమాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని, ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కలగాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలన్నారు. రెవిన్యూ డివిజన్ల పునర్ వ్యవస్థీకరణను ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. పోలవరం పూర్తయిన తర్వాత ముంపు మండలాల ప్రజలు ఏ రెవెన్యూ , ఏ నియోజకవర్గంలో ఉంటారనే దానిపైనా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ జరపాలని ఆయన సూచించారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆయన సానుకూలంగా స్పందించారు.



భేటీలో చర్చకు వచ్చిన అంశాలు,

తిరుపతి జిల్లాను విభజించి శ్రీసిటీ లేదా వెంకటగిరిని కొత్త జిల్లాగా ఏర్పాటు చేయడం, గుంటూరు పట్టణంపై ఒత్తిడిని తగ్గించేందుకు నరసరావుపేట జిల్లాగా ఏర్పాటు, కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లాపునర్ విభజన చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై మంత్రుల క మిటీ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లుసమాచారం. అల్లూరిసీతారామరాజుజిల్లా మళ్లీ పునర్ విభజన అవసరమా లేదా అనే అంశంపై సబ్ కమిటీ మరోసారిపరిశీలించాలని భేటీలో నిర్ణయించినట్లు సమాచారం. మార్కాపురం జిల్లాను కొత్తగా ఏర్పాటు చేసే సమయంలో ఒంగోలు, మార్కాపురం ప్రాంతాల్లో భౌండరీలను నిర్ణయించడం, పలమనేరు, మదనపల్లెలో ఏదో ఒకటి జిల్లా కేంద్రం ఏర్పాటుపై చర్చజరిగినట్లు తెలిసింది.ఈ భేటీలో మంత్రులు అనగానిసత్యప్రసాద్, పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, వంగలపూడి అనిత పాల్గొన్నారు.

10 లక్షల మందికి ఎఐ టెక్నాలజీలో శిక్షణ

- దార్శనిక లక్ష్యాలతో కేరళ రీకోడ్ సదస్సు

7లో

ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్

- సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యంగా మహాగట్బంధన్ మేనిఫెస్టో

7లో

చలికి గజ..గజ

అయినా తప్పని చన్నీటి స్నానాలు

విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు

'అల్లూరి' జిల్లా గిరిజన వసతి గృహాల దుస్థితి!

సమస్యల కొలువుతో విద్యార్థుల ఇక్కట్లు

ప్రజాశక్తి-పాడేరు/పాడేరు టౌన్/అరకులోయ/హుకుంపేట/డుంబ్రిగుడ

మొంథా తుపాన్‌తో రాష్ట్రంతా వాతావరణం ఎంత చల్లగా మారిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీనికి తోడు, విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు చల్లగాలిని ఏ మాత్రం ఆపలేకపోతున్నాయి. దీంతో చలికి గజ..గజ వణుకుతూ ఒక మూలకు ముడుచుకోవాల్సిందే! ఇది చాలదన్నట్లు ఇది చాలదన్నట్లు ఎప్పుడో బిగించిన సోలార్ హీటర్లు చెడిపోవడంతో తప్పని చన్నీటి స్నానాలు! ... ఇది అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులో తలారి సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహం దుస్థితి! జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ, టిడబ్ల్యు డిడి కార్యాలయాలకు అర కిలోమీటరు, పాడేరు మండల ఎటిడబ్ల్యు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంది. ఈ హాస్టల్‌లో 496 మంది విద్యార్థులు ఉన్నారు.! వీరికి తాగేందుకు పరిశుభ్రమైన నీరు లేదు. హాస్టల్ రూముల్లో సరిపడా విద్యుత్ సదుపాయం, లైటింగ్ లేవు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. హాస్టల్ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉంది. దోమలు ముసురుకుంటున్నాయి.

ఈ హా జిల్లా కేంద్రంలోని హాస్టల్ పరిస్థితే ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లోని వసతి గృహాల పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా పలు హాస్టళ్లను పరిశీలించిన ప్రజాశక్తి బృందానికి దాదాపుగా అన్ని చోట్ల ఇటువంటి పరిస్థితులే కనిపించాయి. పాడేరు ఐటిడిఎ పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, గిరిజన సంక్షేమ ఆశ్రమాలు 150 నడుస్తున్నాయి. గురుకులాలు 31 ఉన్నాయి. వీటిలో చాలా సంక్షేమ వసతి గృహాల్లో పలు సమస్యలు తిష్టవేశాయి. పారిశుధ్యం లోపించింది. అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు ఉన్నాయి. తలుపులు, కిటికీలు, రక్షణ గోడలు లేని భవనాలే అధికంగా దర్శనమిస్తున్నాయి. దోమల బెడద అధికంగా ఉంది. పలుచోట్ల తాగునీరు, సరైన వసతి సదుపాయాలు కరువయ్యాయి. సోలార్ వాటర్ హీటర్లు మూలకు చేరడంతో విద్యార్థులకు చన్నీళ్లే దిక్కవుతున్నాయి. గిరిజన విద్యార్థుల సంక్షేమంపై టిడిపి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

నేలమీదే చదువులు.. అక్కడే పడక

హుకుంపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం పాఠశాల (బాలురు-2)కు సొంత భవనం లేదు. ఇక్కడి విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో ఆశ్రయమిచ్చారు. ఇక్కడ 320 మంది విద్యార్థులు ఉండగా, వారికి కేవలం నాలుగు గదులు మాత్రమే కేటాయించారు. వాటిలోనే పగటి పూట చదువులు సాగుతున్నాయి.

రాత్రిపూట చాలీచాలని చోటులో విద్యార్థులు ఇరుక్కుని నిద్రపోతున్నారు. రాత్రిపూట తేళ్లు, పాములు వస్తున్నాయని చెబుతున్నారు. వంట గది, వసతి, తరగతులు అన్నీ ఒకే భవనంలో నడుస్తుండడంతో పరిశుభ్రత కరువైంది. 2018-19లో సర్వశిక్ష అభియాన్ నిధులతో కొత్త భవనం మంజూరైనప్పటికీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఇక్కడి విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. 'తొందరగా పాఠశాల భవనం ఏర్పాటు చేసి విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి కల్పించాల్సి ఉంది. విద్యార్థులు

మిగతా 7లో

సొంత భవనం లేక హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో తాత్కాలికంగా కేటాయించిన గదుల్లో ఇరుకిరుకుగా పడుకున్న విద్యార్థులు

ఆదివాసీలపై కేసులా?

- గిరిజనులను కలెక్టర్ బెదిరించడం దారుణం : సురేంద్ర

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణ ఒప్పందాలకు సంబంధించిన 2, 13, 51 జిఒలను రద్దు చేయాలని పోరాడుతున్న ఆదివాసీలపై క్రిమినల్ కేసులు పెడతామని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ బెదిరించడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన విశాఖ నగరంలోని కంచరపాలెంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీ గ్రామాలు, భూములు, అడవులు నష్టపోవని అధికారులు చేస్తోన్న తప్పుడు ప్రచారాలను అందరూ వ్యతిరేకించాలని కోరారు. చిట్టంవలస, గుజ్జెలి వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలతో నాలుగు మండలాల పరిధిలోని 15 పంచాయతీల్లో 145 ఆదివాసీ గ్రామాలు జలసమాధి కానున్నాయని వివరించారు. ఈ ప్రాజెక్టులతో ఉపాధి వస్తుందని బూటకపు ప్రచారం చేయడం దారుణమన్నారు. సీలేరు, మాచ్‌ఖండ్, డొంకరాయి, మోతుగూడెం విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాల్లో స్థానిక ఆదివాసీలకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నెడ్ క్యాప్ ప్రభుత్వ సంస్థ కూడా ఐదో షెడ్యూల్ ప్రాంతంలో భూమి పొందడం నిషేధమన్నారు. సమత కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వ సంస్థ కూడా గిరిజనేతర సంస్థగానే వస్తుందని తెలిపారు. నవయుగ సంస్థకు నెడ్ క్యాప్ బినామీ సంస్థ అని పేర్కొన్నారు. చిట్టంవలస, గుజ్జెలి హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణంలో పది వేల ఎకరాల అటవీ, అటవీయేతర భూములకు నష్టం వాటిల్లనున్న విషయాన్ని కలెక్టర్ దాచిపెడుతున్నారన్నారు. ఆదివాసీల పట్టా భూముల్లో వారి అనుమతి లేకుండా నవయుగ, అదాని ఏజెంట్లు చట్టవిరుద్ధంగా డ్రోన్ సర్వేలు, భూమిలో సర్వే రాళ్లు పాతుతుండగా వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చెయ్యకుండా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కలెక్టర్ బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఆయన గిరిజన చట్టాలకు రక్షకునిగా ఉండాలిగానీ నవయుగ, అదాని ప్రైవేటు సంస్థలకు సేవకునిగా ఉండరాదని సురేంద్ర హితవుపలికారు. సోమవారం పాడేరు ఐటిడిఎలో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ చెప్పినవన్నీ అసత్యాలేనని, ఆదివాసీలపై బెదిరింపులు తగవని అన్నారు. తక్షణమే ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణ జిఒలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.చిన్నంనాయుడు, కె.చిట్టిబాబు, ఎస్.దామోదర్ పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లా తుమ్మపాలలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఆరిలోవ కొండవాలు ప్రాంతంలో కిందకు పెచ్చులు పెచ్చులుగా జారిపడిన రోడ్డు

విశాఖ వన్‌టౌన్ ఏరియాలో ఇంట్లోకి చేరిన నీటిని తోడుతున్న మహిళ

కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మాకనపాలెంలో తాడిచెట్టు పడి మృతి చెందిన వీరవేణి

పునరావాస కేంద్రాల్లో ఆకలి కేకలు

- 11 గంటలైనా అందని ఆహారం
- మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు
- అరకొర సౌకర్యాల నడుమ తుపాను బాధితులకు ఆశ్రయం

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను దూసుకొస్తోన్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు ఆదేశించారే తప్ప పునరావాస కేంద్రాల్లోని వారికి కల్పించాల్సిన సౌకర్యాలను మరచిపోయారు. తాగునీరు, అల్పాహారం, దుప్పట్లు, చిన్నారులకు పాల ప్యాకెట్ వంటికి కల్పించకుండా ఆకలిదప్పికలకు గురిచేశారు. మహిళలకు మరుగుదొడ్ల సదుపాయం కూడా కల్పించలేదు.

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పునరావాస కేంద్రంలో సుమారు 400 మంది మత్స్యకార కుటుంబాలు తలదాచుకున్నాయి. వీరికి మంగళవారం ఉదయం 11 గంటలు దాటినా తాగునీరు, అల్పాహారం, పాలు, బిస్కెట్లు ఏవీ అందలేదు. దీంతో మహిళలు, పిల్లలు ఆకలితో అలమటించారు. చివరికి అధికారులు కొంతమందికి ఉప్మా అందించారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చాలా ఆలస్యంగా చేశారు. మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బిడ్డల కోసం ఒక్క పాల పాకెట్ కూడా ఎవ్వరూ ఇవ్వలేదని ఓ తల్లి వాపోయింది.

అనకాపల్లి జిల్లా ముత్యాలమ్మపాలెం పునరావాస కేంద్రంలో ఆహారం కోసం అధికారి చుట్టూ చేరి నిలదీస్తున్న మహిళలు

కాకినాడ జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో భోజనం మినహా మిగిలిన సౌకర్యాలు ఏమీ లేవని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీర ప్రాంతంలో నివాసం ఉంటున్న తమను పునరావాస కేంద్రాలకు తరలించినప్పటికీ నిద్రించేందుకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించలేదని ఉప్పాడ గ్రామానికి చెందిన మహిళలు నాగమణి, శ్రీదేవి, సత్యవతి, సూర్యావతి తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 271 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలోకి ఇప్పటి వరకూ 13 వేల మందిని తరలించారు. కొన్ని పునరావాస కేంద్రాలు నిర్వాసితులతో కిక్కిరిశాయి. వీరు పడుకునేందుకు ఎలాంటి ఏర్పాట్లూ లేవు. కూర్చొనేందుకు గ్రీన్‌మ్యాట్‌లను మాత్రమే వేశారు. రావులపాలెంలో 18 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. ఇక్కడ విద్యుత్ సదుపాయం లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కొవ్వొత్తుల వెలుతురులోనే బాలింతలు చిన్నారులతో ఇబ్బందులకు గురవుతున్నారు. విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని తీర ప్రాంతంలో 11 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ కేంద్రాలకు ఎవ్వరినీ తరలించ లేదు. పూసపాటిరేగ మండలంలోని పునరావాస కేంద్రాల్లో డ్యూటీ చేస్తున్న అధికారులకు, సిబ్బందికి ఎటువంటి భోజన, తాగునీటి మరుగుదొడ్ల సౌకర్యం లేదని వాపోతున్నారు. ఇందుకు సంబంధించి ఎటువంటి నిధులు మంజూరు కాలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

సహాయక చర్యల్లో పాల్గొనండి

- సిపిఎం కార్యకర్తలకు వి.శ్రీనివాసరావు పిలుపు
- ప్రభుత్వ సిబ్బంది సేవలు అభినందనీయం
- విజయవాడలో పునరావాస కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి- విజయవాడ సిటీ

తుపాను సహాయక చర్యల్లో సిపిఎం శ్రేణులు పాల్గొనాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రకృతి విపత్తుల సమయంలో తమ కుటుంబాలను సైతం వదిలి ప్రభుత్వ సిబ్బంది అందిస్తోన్న సేవలు అభినందనీయమైనవని అన్నారు. ముఖ్యంగా పారామెడికల్, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్, సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు, పోలీసులు అందిస్తోన్న సేవలు శ్లాఘనీయమన్నారు. మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో విజయవాడ కొత్తపేట తెల్లప్రోలు రాజా హైస్కూల్, సితార సెంటర్ కొండబడిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, విఎంసిలో పార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మంగళవారం సందర్శించారు. పునరావాస కేంద్రాల్లో అందుతున్న సేవలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తుపాన్లు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కుటుంబీకులను సైతం వదిలి వివిధ శాఖల సిబ్బంది అత్యవసర సేవలందిస్తున్నారన్నారు. ముంచుకొస్తున్న మొంథా తుపాను ముప్పు నుంచి ప్రజలను కాపాడాలని ప్రభుత్వానికి సూచించారు. కొండ ప్రాంత ప్రజలతోపాటు లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస శిబిరాలకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. పునరావాస కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. తుపాను అనంతరం కొండ ప్రాంతవాసులకు శాశ్వత ప్రాతిపదికన పక్కా గృహాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పార్టీ శ్రేణులు కూడా సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యాధరపురం లేబర్ కాలనీ లేబర్‌వాసులను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆకస్మికంగా ఖాళీ చేయాలనడం అన్యాయమన్నారు. లేబర్ కాలనీ, కొండ ప్రాంతాల నివాసితులకు వామపక్షాల హయాంలో తప్ప ఆ తర్వాత ఎటువంటి సౌకర్యాలూ కల్పించలేదని తెలిపారు. లేబర్ కాలనీవాసుల పక్షాన పోరాడతామన్నారు.

విజయవాడ సితార సెంటరు పునరావాస కేంద్రంలో సౌకర్యాల గురించి బాధితులను అడిగిన తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు డి.కాశీనాథ్, ఫ్లోర్ లీడర్ బి.సత్యబాబు

ప్రజలకు అండగా ప్రజా సంఘాల కార్యాలయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండనున్నట్లు ప్రజా సంఘాలు వెల్లడించాయి. మొంథా తుపాను నేపథ్యంలో విజయవాడ క్రీస్తురాజుపురంలోని పూలే అంబేద్కర్ భవన్‌లో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, పిఎన్ఎం రాష్ట్ర కార్యాలయాల్లో తుపాను బాధితులకు పునరావాస కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంఘం రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. ప్రజా సంఘాలు ప్రజల సమస్యలపై పోరాటాలే కాదు, ప్రజలకు ఏ కష్టం వచ్చినా తమవంతుగా అండగా ఉండటం అభినందనీయమన్నారు. గతంలో కరోనా సమయంలో, బుడమేరు వరదల సమయంలో అనేక రూపాల్లో సేవా, శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న పేర్కొన్నారు. తుపాను కారణంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు తమ కార్యాలయాన్ని పునరావాస కేంద్రంగా మార్చామని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తమ కార్యాలయాలను పునరావాస కేంద్రాలుగా వినియోగించుకోవచ్చని ప్రజానాట్య మండలి (పిఎన్ఎం) రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ వెల్లడించారు. ఇప్పటికే ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, ఇప్పుడు తుపాను వల్ల మరిన్ని కష్టాలు వచ్చే అవకాశం ఉన్నందున వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి క్రాంతి కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి కృష్ణ, సిఐటియు నాయకులు నాగేశ్వరరావు, మురహరిరావు, లాల్ ఖాన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి

- ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను ప్రభావం అధికంగా ఉన్న తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు చౌకధరల దుకాణాల నుంచి తక్షణమే అందజేయాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. 10 రోజుల నుంచి తీర ప్రాంతంలో గాలులు, వర్షాలు తీవ్ర స్థాయిలో కొనసాగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు పనులకు, చేపల వేటకు వెళ్లకపోవడం వల్ల లోతట్టు ప్రాంత ప్రజల జీవితాలు మరింత దుర్భరంగా మారాయని, రోజువారీ కూలీపై ఆధారపడి జీవించే కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని పేర్కొన్నారు. తీర ప్రాంత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు కలుగజేసుకుని తక్షణమే ఆయా కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులు తదితర సామగ్రిని అందజేయాలని కోరారు.

కనీస సౌకర్యాలు కల్పించండి

- పుసరావాస కేంద్రాలను పరిశీలించిన సిపిఎం, వ్యకాస నాయకులు
- గుంటూరులో యుటిఎఫ్ ఆధ్వర్యంలో వంద మందికి దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను ప్రభావంతో పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఆయా కేంద్రాలను నాయకులు పరిశీలించి, అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలంలోని పునరావాస కేంద్రాలను ఎమ్మెల్సీ గోపిమూర్తి సందర్శించి బాధితులతో మాట్లాడారు. రాత్రి వేళల్లో పడుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి, సూర్యారావుపేటలో మత్స్యకార కాలనీల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సిపిఎం బృందం పరిశీలించింది. సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ.. సూర్యారావుపేటలో నిర్మించిన తుపాన్ షెల్టర్ బిల్డింగ్ అందుబాటులో లేకపోవడంతో వారిని హైస్కూల్లో చిన్న చిన్న గదుల్లో పునరావాసం ఏర్పాటు చేశారన్నారు. వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే అధికారులు, పాలకులు హడావుడి చేస్తున్నారు తప్ప, తరువాత పట్టించుకోవడం లేదన్నారు. విజయవాడ కొండ ప్రాంతాలైన క్రీస్తురాజుపురం, మొగల్రాజుపురంలలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు పర్యటించారు. కొండ చరియలు విరిగిపడిన క్రీస్తురాజుపురం సున్నపుబట్టీల సెంటర్ ప్రాంతాన్ని పరిశీలించారు. జమ్మిచెట్టు సెంటర్ బిఎస్ఆర్‌కె ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు.

గుంటూరు స్థంబాలగరువులోని పునరావాస శిబిరంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలో ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహన్ రావు కాలనీలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి .వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈమని అప్పారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు అప్పలస్వామి, సిఐటియు మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నగరంలో పునరావాస కేంద్రాలను సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు జి రమణ సందర్శించారు. గుంటూరులోని స్థంబాల గరువులోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలోని దాదాపు వంద మందికి దుప్పట్లను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అందజేశారు. అధికారులకు సిపిఎం శ్రేణులు సహకరించాలని సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. విశాఖ నగరంలోని జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు నేతృత్వాన ఆ పార్టీ బృందం పర్యటించింది. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో నీట మునిగిన పంటలను సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. నీట మునిగిన ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను నేతలు పరిశీలించి అక్కడే నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపారు.

సూరాడపేటలో కూలిన మత్స్యకార గృహాలు

సూరాడపేటలో మత్స్యకార గృహాలను తాకుతున్న సముద్ర కెరటాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి(కాకినాడ జిల్లా)

ఎగసిపడుతున్న సముద్రపు అలల ధాటికి కాకినాడ జిల్లా సూరాడపేటలో నాలుగు మత్స్యకార గృహాలు ధ్వంసమయ్యాయి. తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఉప్పాడ, కొనపాపపేట, సూరాడపేట, మాయాపట్నం అమీనాబాద్, కొమరగిరి, నేమాం, సుబ్బంపేట గ్రామాలు సముద్ర కోతకు గురవుతున్నాయి. ప్రస్తుతం ఉప్పాడ తీరంలో రోడ్డుకి గండి పడడంతో ఇళ్లల్లో నివాసం ఉంటున్న మత్స్యకారుల్లో ఆందోళన ఎక్కువైంది. ఈ గ్రామాల ప్రజలను స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. అలల ఉధృతికి కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుకు రక్షణగా వేసిన పెద్ద పెద్ద బండ రాళ్లు సైతం అలల తాకిడికి ఎగిరిపడ్డాయి.

విజయవాడ రైల్వే డివిజన్‌లో హెల్ప్ డెస్క్‌లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొంథా తుపాను నేపథ్యంలో విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని పలు ప్రధాన స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రయాణికులకు సంబంధించిన ఏదైనా సమాచారం కావాలనుకునే వారు హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. విజయవాడ 0866 2575165, గూడూరు 08624 250795, నెల్లూరు 90633 47961, ఒంగోలు 7815909489, బాపట్ల 7815909329, తెనాలి 7815909463, ఏలూరు 7569305268, రాజమండ్రి 8331987657, సామర్లకోట 7382383188, తుని 7815909479, అనకాపల్లి 7569305669, భీమవరం 7815909402, గుడివాడ 7815909462 నెంబర్లను సంప్రదించొచ్చు. అదే విధంగా మొంథా నేపథ్యంలో డివిజన్ పరిధిలో 115 రైళ్లు రద్దయ్యాయి.

తీరం అతలాకుతలం

- పలుచోట్ల ముందుకొచ్చిన సముద్రం
- వర్షం, ఈదురుగాలులతో జనజీవనంపై తీవ్ర పభావం
- వేలాది ఎకరాల్లో పంటలకు భారీ నష్టం
- పలుచోట్ల విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నీటిమునిగిన లోతట్టు ప్రాంతాలు
- కోనసీమ జిల్లాలో 102 గుడిసెలు, తాటాకిళ్లు ధ్వంసం
- తాడిచెట్టు కూలి మహిళ మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని తీర ప్రాంతం అతలాకుతలంగా మారింది. రాకాసి అలలు ఎసిగిపడ్డాయి. పలుచోట్ల సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షానికి ఈదురు గాలులు కూడా తోడయ్యాయి. తీరప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు, చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. మొంథా తుపాను ముఖ్యంగా కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. జనజీవనం స్తంభించింది. పలు ప్రాంతాల్లో రవాణా నిలిచిపోయింది. ముందు జాగ్రత్త చర్యగా బీచులను మూసివేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తాడిచెట్టు కూలి మహిళ మృతి చెందారు. కాకినాడ జిల్లా తుని నుంచి కాకినాడ వరకూ జాతీయ రహదారుల్లో రాకపోకలను నిలిపేశారు. యు.కొత్తపల్లి మండలంలో ఉప్పాడ నుంచి ఓడలరేవు వరకూ తీరంలో భయానక వాతావరణం నెలకొంది. ఉప్పాడ తీర ప్రాంతంలో అలల తాకిడి బీచ్ రోడ్డు ధ్వంసమైంది. రోడ్డు రక్షణ కోసం వేసిన పెద్ద పెద్ద బండ రాళ్లు సైతం రాకాసి అలల ఉధృతికి లేచిపడుతున్నాయి. ఉప్పాడ తీరంలో రోడ్డుకి గండిపడడంతో ఇళ్లల్లో నివాసం ఉంటున్న మత్స్యకారుల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. గండివల్లపల్లిపేట గ్రామంలోకి సముద్రపు నీరు వచ్చే ప్రమాదం ఉంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ 102 వరకూ పూరి గుడిసెలు, తాటాకిళ్లు ధ్వంసమయ్యాయి. 73కుపైగా విద్యుత్ స్తంభాలు కూలాయి. పదుల సంఖ్యలో కొబ్బరి చెట్లు నేలకూలాయి. వీటిని ఎప్పటికప్పుడు ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ భిందాలు యంత్రాలతో తొలగిస్తున్నాయి. 216వ నెంబరు జాతీయ రహదారిపై వృక్షాలు కూలడంతో రాకపోకలను రాత్రి ఏడు గంటల నుంచి నిలిపేశారు. ఆర్‌టిసి సర్వీసులను రద్దు చేశారు. మామిడికుదురు మండలం మాకనపాలెంలో ఈదురుగాలులకు తాడిచెట్టు విరిగిపడి గూడపల్లి వీరవేణి (56) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే మండలం నగరం గ్రామంలో తాడిచెట్టు కూలడంతో మందపాటి ప్రవీణ్ (15) తీవ్రంగా గాయపడ్డారు. మొగలి కుదురులో ప్రయాణిస్తున్న కారుపై కొబ్బరి చెట్టు పడింది. అందులోని ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు.

ప్రకాశం జిల్లా, శింగరాయకొండలో జలమయమైన పోలీస్‌స్టేషన్

పశ్చిమగోదావరి జిల్లాలో 3,481 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ఈదురుగాలులకు వరి పొలాలు నేలనంటాయి. ఏలూరు జిల్లాలో ప్రమాదం పొంచి ఉన్న 120 చెరువులను గుర్తించి ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో ఉదయం 11 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో సముద్రం 50 మీటర్లు ముందుకొచ్చింది.

కృష్ణా జిల్లా కోడూరు మండలంలోని తీర ప్రాంతంలో వంద మీటర్లకుపైగా సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. మంగినపూడి, హంసలదీవి బీచ్‌ల వద్ద సముద్రం 50 మీటర్లకు ముందుకు వచ్చింది. అవనిగడ్డ మండలం వేకనూరు వద్ద అవనిగడ్డ-నాగాయలంక ప్రధాన రహదారిపై భారీ వృక్షం విరిగిపడిపోవడంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ ప్రయాణికులు లేక బోసిపోయింది. మునేరు, బుడమేరు పరిస్థితిపై డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేశారు.

ఫిషింగ్ హార్బర్ మూసివేత, వైజాగ్ పోర్టులో ఒకటో నెంబర్ జెండా ఎగరవేత

విశాఖ నగరంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 92వ వార్డు జనతా కాలనీలో ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. ఎవిఎన్ కళాశాల రోడ్డులో గోడ కూలి ఆటోపై పడడంతో అది పూర్తిగా ధ్వంసమైంది. కొండవాలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. అయితే, ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విశాఖలోని బీచ్‌లను, ఫిషింగ్ హార్బర్‌ను మూసివేశారు. వైజాగ్ పోర్టులో ఒకటో నెంబర్ జెండాను ఎగరవేశారు. ఆనందపురం మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నీటమునిగింది. పూల తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అనకాపల్లి జిల్లాలో సుమారు 950 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో భారీ వర్షం కురిసింది. గెడ్డలు పొంగి ప్రవహించాయి. రంపచోడవరం ఏజెన్సీలోనూ వర్షం బీభత్సం సృష్టించింది. శ్రీకాకుళం జిల్లా రాజపురంలో 46.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోనూ, ఒడిశాలోనూ కురుస్తోన్న వర్షాలకు వంశధారలో స్వల్పంగా వరద ప్రవాహం పెరుగుతోంది. బాహుదా ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీకాకుళం రూరల్ మండలం పిజి.పేటలో సముద్రం కోతకు గురైంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరులో ఇసుక దిబ్బలపై ఎండబెట్టిన సుమారు రూ.15 లక్షల విలువైన 30 టన్నులకుపైగా ఎండు చేపలు వర్షానికి తడిచిపోవడంతో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. పలాస మండలం కంబిరిగాం వంతెనపై నుంచి మూడు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం గోవిందపురంలో బొప్పాయి తోటలు నేలకొరిగాయి. మడ్డువలస, ఆండ్ర రిజరాయర్లలోకి వరద నీరు ఎక్కువగా రావడంతో గేట్లు ఎత్తివేశారు.

పిడుగురాళ్ల, వినుకొండ ప్రాంతంలో కుండపోత

గుంటూరు జిల్లా పిడుగురాళ్ల, వినుకొండ ప్రాంతంలో కుండపోత వర్షం కురిసింది. గుంటూరు, తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లిలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. రాత్రి ఎనిమిది గంటల తర్వాత గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గాలి వాన ఉధృతి బాగా పెరిగింది. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. జనం ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోయారు. వరి, మిర్చి, పత్తి నీట మునిగాయి. బొప్పాయి, అరటి తోటల్లో నీరు చేరింది. చీరాల, వాడరేవు తీరంలో సముద్రం పది అడుగులు ముందుకు వచ్చింది. బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలో కొమ్మినేనివారిపాలెం వద్దగల కల్వర్టు కుంగింది. కారంచేడు మండలం కేశవరపాడు-తిమిడిపాడు ఆర్ అండ్ బి రహదారి 50 అడుగుల మేర ధ్వంసమైంది. ఆ మార్గంలో వాహనాలను అధికారులు దారి మళ్లించారు. ప్రకాశం జిల్లా శింగరాయకొండ పోలీస్‌స్టేషన్ లోపలికి వర్షపు నీరు వచ్చి చేరింది. నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లోకి భారీ వర్షాలు కురిశాయి. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఏకధాటిగా చినుకులు పడుతూనే ఉన్నాయి. టమోటా, వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. తిరుపతి జిల్లాలో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. తిరుమలలోని బాలాజీ నగర్ ఓ ఇంటి వద్ద భారీ చెట్టు విరిగి పడబంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చిత్తూరు జిల్లాలో మోస్తారు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుండి మంగళవారం రాత్రి వరకు వర్షాలు కురిశాయి. ఆదోని పట్టణంలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 29 నుంచి సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేయగా, సుమారు ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాలుకు రూ.8,110 కనీస మద్దతు ధర అందేలా రాష్ట్ర వ్యాప్తంగా సిసిఐ ద్వారా 30 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో ప్రస్తుతం కొనుగోలు చేస్తూ రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లో తుపాను తగ్గిన అనంతరం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పత్తిని అమ్మాలనుకునే రైతులు ముందుగా రైతుసేవా కేంద్రాల ద్వారా తమ వివరాలను సిఎం యాప్‌లో విఎఎ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కపాస్ కిసాన్ యాప్‌లో విఎఎ ద్వారా అమ్ముకోవాలనుకున్న రోజున స్లాట్ బుక్ చేసుకుని స్లాట్ ప్రకారం సిసిఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి యాప్‌లో సూచించిన కోనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు అన్ని దశల్లోనూ రైతులకు సహకరించాలని ఆదేశించామన్నారు.

10 నుంచి గృహ గణన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనాభా లెక్కలు (2027) సేకరణలో భాగంగా వచ్చే నెల 10 నుంచి 30వ తేదీ వరకూ రాష్ట్రంలో హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జనాభా లెక్కల చట్టంలో ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, ఎంపిక చేయబడిన ప్రాంతాల్లోని గృహాల జాబితా, గృహ గణన చేపట్టనున్నారు. నవంబరు ఒకటి నుంచి ఏడో తేదీ వరకూ స్వీయ గణన కోసం ఎంపిక ఉంటుంది.

గన్నవరం విమానాశ్రయంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం):

గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఎయిర్‌పోర్టులోని కస్టమ్స్ అధికారుల గదిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో సాఫ్ట్‌వేర్ బాక్సులు, ఇమ్మిగ్రేషన్ గదిలోని ఎసి, కస్టమ్స్ అధికారుల వస్తువులు దగ్ధమయ్యాయి. ఎయిర్‌పోర్టు సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఈ సంఘటన ఎలాంటి ప్రభావాన్ని చూపలేదని, ప్రయాణికుల సదుపాయాలతో సహా అన్ని సేవలు సాధారణంగా కొనసాగుతున్నాయని ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు.

అమెజాన్‌లో 30 వేల మంది ఉద్యోగులపై వేటు..!

వాషింగ్టన్ : దిగ్గజ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ తమ వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించే పనిలో పడింది. దాదాపు 30,000 కార్పొరేట్ ఉద్యోగాలను తొలగించనున్నట్లు వెల్లడించింది. ఆర్టిఫిషియల్ ఇంటెజెన్స్‌పై భారీగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ఈ ఉద్వాసనలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. వినియోగదారుల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త విధానంతో ముందుకెళుతున్నామని అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెతత్ గలెట్టి ఉద్యోగులకు రాసిన సందేశంలో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బ్యూరోక్రసీని తగ్గించి, అనవసర లేయర్లను తొలగిస్తున్నామన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి త్వరలోనే సమాచారం ఇస్తామని ఆ సంస్థ పేర్కొంది.

విఓఎల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రూపాదేవి, ధనలక్ష్మి

ముగిసిన ఐదవ రాష్ట్ర మహాసభ

ఎన్నికైన నూతన రాష్ట్ర కమిటీ సభ్యులు



సిహెచ్ రూపాదేవి

కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎపి విఓఎల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్ రూపాదేవి, కె.ధనలక్ష్మి ఎన్నికయ్యారు. రాష్ట్ర కోశాధికారిగా తిరుపతయ్య, ఉపాధ్యక్షులుగా నిర్మలమ్మ, కృష్ణమ్మ, ఉమాదేవి, రెడ్డప్పరెడ్డి, సోమన్న, రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా వెంకట లక్ష్మి, స్వరూప, సుభాషిణి, ప్రకాష్, మహేష్‌తోపాటు బాపట్ల జిల్లా నుండి ఒకరిని కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. మరో 43 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

నంద్యాలలోని జెకె ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎపి విఓఎల సంఘం రాష్ట్ర ఐదవ మహాసభ మంగళవారం ముగిసింది. రెండో రోజు జరిగిన ప్రతినిధుల సభలో కె.ధనలక్ష్మి మాట్లాడుతూ.. రాబోయే కాలంలో విఓఎల సమస్యలపై, కనీస వేతనం పెంపునకు, హెచ్ఆర్ పాలసీ అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇతర సమస్యలపై పీడీ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలకు, 2026 ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తలపెట్టిన చలో విజయవాడకు విఓఎలను సిద్ధం చేయాలని సంఘం నేతలకు సూచించారు.

డిసెంబర్ 31 నుంచి జనవరి నాలుగు వరకు వైజాగ్‌లో సిఐటియు అఖిల భారత మహాసభలు జరగనున్నాయని, చివరి రోజు జరిగే ర్యాలీలో విఓఎలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని తీర్మానం

విఓఎల అక్రమ తొలగింపులను, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ పలు తీర్మానాలను చేశారు. విఓఎలకు కనీస వేతనం ఇవ్వాలని. పెండింగ్ బకాయి వేతనాలు చెల్లించాలని, ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, 5జి మొబైల్స్, సిమ్ కార్డ్స్ ఇవ్వాలని, రెండు సంవత్సరాల స్త్రీ నిధి ఇన్సెంటివ్స్ ఇవ్వాలని, విఓఎలకు రూ.పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ తదితర అంశాలపై తీర్మానాలు వీటిలో ఉన్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

శాసనసభ్యుల కమిటీ బృందం

వినతులు స్వీకరిస్తున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుల కమిటీ బృందం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల ఆంధ్ర శాసన కమిటీ కృషి చేస్తోందని కమిటీ అధ్యక్షులు కుమార రాజా తెలిపారు. అనంతపురం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆయా సంఘాల నాయకులు, ప్రజల నుండి మంగళవారం వివిధ ఫిర్యాదులను ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, శాసనసభ్యులు ఎంఎస్ రాజు, బోనెల విజయచంద్ర, రోషన్ కుమార్‌తో కలిసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార రాజా మాట్లాడుతూ జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల సమస్యలు పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా శాసనసభ కమిటీ బృందం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వినతులకు సంబంధించి ఆయా శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అనంతపురం ఆర్‌డిఓ కేశవ నాయుడు పలువురు నాయకులు కమిటీ బృందానికి పుష్పగుచ్ఛాలను, మొక్కలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి : విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని కుమార్ రాజా స్పష్టం చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో శాసనసభ కమిటీ బృందం సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే వినతులు స్వీకరించి వాటిని మినిట్స్ రూపంలో రికార్డ్ చేసి శాసనసభకు అందజేస్తున్నామని వివరించారు. సంక్షేమ పథకాల అమలు, పెండింగ్లో ఉన్న అట్రాసిటీ కేసుల స్థితి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ స్థితి తదితర అంశాలపై నివేదికలను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్, ఎస్‌పి పి జగదీష్, డిఆర్ఓ ఎ మలోల, తాడిపత్రి ఎఎస్‌పి రోహిత్ కుమార్ చౌదరి, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్‌డిఓలు, డిఎస్‌పిలు, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌సి, ఎస్‌టి సంఘాలకు చెందిన ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1,200 మంది ఎంపిహెచ్‌ఎలకు ఉపశమనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కారుణ్య కారణాలపై తిరిగి నియామకమైన 1,200 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (ఎంపిహెచ్ఎ)కు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. 2003లో ఇంటర్మీడియట్, డిప్లమో అర్హతతో సుమారు 2,300 ఖాళీలను నోటిఫై చేసింది. అర్హతను తరువాత పదో తరగతి, డిప్లమోగా మార్చారు. దీనివల్ల హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. మునుపటి అర్హత కింద నియామకాలను తాత్కాలిక ఉత్తర్వుతో సమర్థించింది. ఈ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఇప్పటికే నియామకమైన వారిని కొనసాగించాలని అనుమతించింది. అయితే, 2012లో సుప్రీంకోర్టు అప్పీళ్లను తోసిపుచ్చింది. పదో తరగతి, డిప్లమో అర్హతను ధ్రువీకరించింది. ఫలితంగా ఇంటర్మీడియట్, డిప్లమో పొందిన వారిని తొలగించింది.

తదనంతరం, రాష్ట్ర ప్రభుత్వం 1,200 మంది ఉద్యోగులు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అంగీకరించి, 2013లో కారుణ్య నియామకాల కింద వారిని కాంట్రాక్టు ప్రాతిపదికన తిరిగి నియమించుకోవాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. దీనితో సుప్రీంకోర్టు ముందు మరో అప్పీల్ దాఖలైంది.

పునఃనియామకం 2003 నియామకంతో సంబంధం లేకుండా, పూర్తిగా కారుణ్య ఆధారంగా జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడాన్ని గమనించిన సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాన్ని పక్కనపెట్టింది. తద్వారా 1,200 మంది ఉద్యోగులను సర్వీసును కొనసాగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది.

పరిశ్రమల్లో ఉద్యోగాలేవీ!

- నియోజకవర్గానికి ఏటా 1500 లక్ష్యం
- అధికారిక లెక్కల ప్రకారమే ఇచ్చినవి 396

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

భారీ ఎత్తున పరిశ్రమలు వస్తాయి... లక్షల్లో ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి అంటూ ప్రభుత్వం ఊదరగొడుతున్నప్పటికీ... క్షేత్ర స్థాయిలో మాత్రం ఆశించిన విధంగా ఫలితాలు కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధన దిశగా కనిపించడం లేదు. అధికారులు చెబుతున్న గణాంకాలు కూడా వాస్తవాలకు దగ్గరగా లేవనే తెలుస్తోంది. జిల్లాల వారీగా ఉద్యోగాల కల్పనకు పారిశ్రామికవేత్తలతో ప్రభుత్వం నిర్వహించిన మేళాలు కూడా సత్ఫలితాలు ఇవ్వడం లేదు.

రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాబ్ మేళాలను నిర్వహిస్తోంది. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి వారి సమక్షంలోనే ఈ మేళాలను నిర్వహించి అర్హులకు ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఇప్పటివరకు 1,304 మేళాలను నిర్వహించింది. ఇందులో 7,920 పరిశ్రమలకు చెందిన వారు పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో అంతా చిన్న మధ్యతరగతి పరిశ్రమలేనని అధికారులు అంటున్నారు. ఈ మొత్తం పరిశ్రమల ద్వారా 69.363 మందికి ఉపాధి కలిగినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. వాస్తవానికి ఏటా ప్రతి నియోజకవర్గానికి 1,500 మందికి చొప్పున ఉపాధి కల్పించాలన్నది ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అంటే రాష్ట్రం మొత్తం మీద 2.62 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాల్సి ఉంది. అయితే తాజా లెక్కలమేరకు ఒక్కో నియోజకవర్గానికి సగటున కేవలం 396 మందికి మాత్రమే ఉపాధి లభించినట్లు తేలింది. అత్యధికంగా అనంతపురంలో 4,861 మందికి ఉపాధి కల్పించగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేవలం 486 మందికే ఉద్యోగాలు లభించినట్లు లెక్కలు చెబుతున్నాయి. మొత్తం మీద చూస్తే నాలుగు వేల మందికన్నా ఎక్కువ మందికి ఉద్యోగాలు లభించిన జిల్లాలు కేవలం ఆరే ఉండగా, 1500 మందికన్నా తక్కువ ఉద్యోగావకాశాలు కల్పించిన జిల్లాలు ఏడు మాత్రమే ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

మేళాలకు రాని పెద్ద పరిశ్రమలు

ప్రభుత్వం నిర్వహించే మేళాలలకు చిన్న, మధ్య స్థాయి పరిశ్రమల ప్రతినిధులే తప్ప పెద్ద పరిశ్రమల ప్రతినిధులు మాత్రం హాజరు కావడం లేదని అంటున్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలనే కాకుండా రాష్ట్రం బయట ఉన్న వారికి కూడా ఆహ్వానిస్తున్నప్పటికీ వారి నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదని సమాచారం. అలాగే ఇప్పటివరకు ఉద్యోగావకాశాలు పొందిన వారిలో కేవలం చిన్న ఉద్యోగులు, కార్మికులకు పెద్దగా ఉపాధి లభించడం లేదని, కేవలం వృత్తి నైపుణ్యం ఉన్న కొంతమందికే ఉద్యోగాలు లభిస్తున్నట్లు చెబుతున్నారు.

కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలి

- ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైద్య కళాశాలలకు ఈ ఏడాది నుంచి మంజూరైన 106 పిజి సీట్లు కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు మంగళవారం లేఖ రాశారు. కొత్తగా మంజూరైన 106 పిజి సీట్లలో 60 సీట్లు 5 ప్రభుత్వ వైద్య కళాశాలలకు రావడం సంతోషకరమైన విషయంగా పేర్కొన్నారు. ఈ కళాశాలల్లో అమలవుతున్న సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతిని కొనసాగిస్తే ఇందులో సగం సీట్లను రూ.కోట్లకు అమ్ముకుంటారని తెలిపారు. ఇలా జరిగితే సాధారణ ప్రజలకు ఈ సీట్లు అందుబాటులో ఉండవనే విషయం తెలిసిందేనన్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతికి సంబంధించిన ఉత్తర్వులు 107, 108లను రద్దు చేసి ప్రభుత్వ వైద్య కళాశాలలకు మంజూరైన పిజి సీట్లన్నీ కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని కోరారు. పిపిపి పద్ధతుల్లో పూర్తి చేయబోతున్న 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని, వైద్యులవ్వాలనే పేద విద్యార్థుల ఆశలను, రాజ్యాంగం పరంగా కల్పించబడిన రిజర్వేషన్ ప్రాథమిక హక్కును దెబ్బతీసే పిపిపి విధానాన్ని వెనక్కు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

చూస్తూ వెళ్లిపోయారు..!

- బైక్ రోడ్డుపై ఉండగా ఆ దారిలోనే 19 వాహనాలు
- ఒక్కరు స్పందించినా ఘోర ప్రమాదం తప్పేది
- పోలీసుల విచారణలో పలు విషయాలు వెలుగులోకి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు బస్సు ప్రమాదానికి ముందే రహదారిపై ద్విచక్ర వాహనం పడిపోయినప్పుడు అదే దారిలో 19 వాహనాలు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వారిలో ఒక్కరు స్పందించినా ఘోర ప్రమాదం తప్పేది. ఈ ప్రమాద స్థలానికి సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సిసిటివి ఫుటేజీల ఆధారంగా పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. మృతి చెందిన ద్విచక్ర వాహనదారుడు శివశంకర్, అతని స్నేహితుడు ఎర్రిస్వామి... బంక్‌లో పెట్రోల్ కొట్టించుకుని వెళ్లిన తరువాత అదే దారిలో వెళ్లిన వాహనాలను గుర్తించి ఆయా డ్రైవర్లను పోలీసులు విచారిస్తున్నారు. బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన తర్వాత పది నిమిషాలకు కావేరి ట్రావెల్స్ బస్సు ఆ బైక్‌ను ఈడ్చుకువెళ్లడంతోనే ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఆ పది నిమిషాల్లో అదే దారిలో 19 వాహనాలు వెళ్లినట్లు పోలీసులు నిర్ధారించారు. డివైడర్ పక్కన పడి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఓ వాహనం కాస్త దూరం ఈడ్చుకుంటూ వెళ్లినట్లు గుర్తించారు. రోడ్డుపై పడిపోయిన ద్విచక్ర వాహనాన్ని చూశానని, బస్సు ఆపితే వెనక నుండి మరో వాహనం ఢీకొనే ప్రమాదం ఉందనుకుని వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాయని రాయదుర్గం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు డ్రైవర్ పోలీసులకు వెల్లడించారు. రోడ్డు పక్కన మృతదేహం పడి ఉండటాన్ని గమనించామని, ఆపితే కేసులో ఇరుక్కుంటామని ఆపకుండా వెళ్లిపోయామని కొందరు వాహన డ్రైవర్లు పోలీసుల ముందు ఒప్పుకున్నారు. ప్రమాదానికి ముందు వెళ్లిన వాహనాలను గుర్తించామని, ఆయా డ్రైవర్లను విచారిస్తున్నామని, పలు సిసి టివి ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నామని కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ తెలిపారు. ముందు వెళ్లిన 19 వాహనాలూ బైక్‌ను తప్పించి వెళితే కావేరీ బస్సు డ్రైవర్ మాత్రం ఎందుకు తప్పించలేకపోయాడన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. డ్రైవర్ అలసటలో ఉన్నాడా? లేక మొబైల్‌లో మాట్లాడుతున్నాడా? వంటి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘోర ప్రమాదం జరిగిందని పోలీసులు విచారణలో తేల్చారు. దీనికి సంబంధించిన ఛార్జిషీటును కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. నేడో, రేపో నిందితులను కోర్టు ముందు హాజరుపరిచే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అమెరికాకు తలొగ్గిన మోడీ

- రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేత
- యుఎస్ నుంచి రికార్డ్ దిగుమతులు
- ట్రంప్ ఒత్తిడితోనే కేంద్రం నిర్ణయం : ప్రకాశ్‌కరత్

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలకు ప్రధాని నరేంద్ర మోడీ తలొగ్గారు. రష్యా నుంచి చౌకగా లభించే చమురు కాకుండా యుఎస్ నుంచి దిగుమతులను పెంచారు. ట్రంప్ బెదిరింపులకు బయపడి రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేశారు. ట్రంప్ ఆదేశాల మేరకు రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదు. తాత్కాలికంగా చమురు కొనుగోలును నిలిపివేశాయి. స్పాట్ మార్కెట్ల నుంచి కొనుగోళ్లతో ఆ లోటును భర్తీ చేసుకుంటున్నామని రిఫైనరీలకు చెందిన కీలక వ్యక్తులు వెల్లడించారు. అమెరికాకు సహకరిస్తామన్న ప్రధాని మోడీ హామీ మేరకు భారత రిఫైనరీలు అమెరికా కంపెనీల నుంచి చమురు బుకింగ్ పెంచుకున్నట్లు వాణిజ్య, ప్రభుత్వ వర్గాల సమాచారం.

రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అమెరికా నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేస్తే పెనాల్టీ ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికా విధించిన ఆంక్షలకు భారత్ తలొగ్గి రష్యన్ చమురు దిగుమతులను భారీగా తగ్గించింది.

రష్యన్ చమురు ప్రధాన కొనుగోలుదారుగా ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ సైతం రోస్నెఫ్ట్‌తో ఉన్న 25 సంవత్సరాల ఒప్పందం (రోజుకు 5 లక్షల బ్యారెల్స్) కింద కొనుగోళ్లను ఆపేస్తుంది. కొత్త ఆర్డర్లు పెట్టడం లేదని ఆ వర్గాలు వెల్లడించాయి. రిఫైనరీ ఉత్పత్తుల దిగుమతులపై ఇయు మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపింది. అమెరికా, బ్రిటన్, ఇయు ప్రకటించిన ఆంక్షల ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని పేర్కొంది. ఆంక్షల అమలు, నియంత్రణ చట్టాలకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్), హిందుస్తాన్ పెట్రోలియం (హెచ్‌పిసిఎల్) వంటి ప్రభుత్వ సంస్థలు తమ రష్యన్ చమురు కొనుగోలు ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేశాయి.

రికార్డ్ స్థాయిలో యుఎస్ చమురు దిగుమతి

ట్రంప్ బెదిరింపులకు భయపడి అమెరికా నుంచి భారత్ భారీగా చమురు దిగుమతులను పెంచేసింది. బిజెపి సర్కార్ ఆదేశాల మేరకు అమెరికాకు అనుకూల సంకేతాలను అందించేందుకే భారత రిఫైనరీలు ఆ దేశ కంపెనీల నుంచి చమురు కొనుగోలును పెంచుకున్నాయి. అక్టోబర్ 27 నాటికి రోజుకు 5.4 లక్షల బ్యారెల్స్ చమురును దిగుమతి నమోదయ్యింది. ఫలితంగా 2022 తర్వాత యుఎస్ నుంచి చమురు కొనుగోళ్లు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఈ నెల ముగింపు నాటికి ఇది సుమారు 5.75 లక్షల బ్యారెల్స్‌కు చేరనుందని అంచనా. ఈ ఏడాది ప్రారంభంలో యుఎస్ నుంచి దిగుమతులు సగటున 3 లక్షల బ్యారెల్స్‌గా ఉంది. ఇప్పుడు దాదాపు రెట్టింపు అయ్యింది. ప్రస్తుతం రష్యా నుంచే ఎక్కువగా ముడిచమురు దిగుమతి అవుతుండగా ఇరాక్, సౌదీ అరేబియా రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి.

ట్రంప్ ఆంక్షల మేరకే : సిపిఐ(ఎం) మాజీ జనరల్ సెక్రటరీ ప్రకాశ్‌కరత్

ట్రంప్ ఆంక్షలతోనే మోడీ సర్కార్ రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకుంటుందని సిపిఐ(ఎం) మాజీ జనరల్ సెక్రటరీ ప్రకాశ్‌కరత్ అన్నారు. కేంద్రం ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు కొత్త ఆర్డర్లను నిలిపివేశాయన్నారు. ప్రయివేటు రంగంలోని రిలయన్స్ కూడా కొనుగోళ్లను నిలిపివేస్తోన్నట్లు ప్రకటించిందన్నారు. దేశ సార్వభౌమాధికారాన్ని మోడీ యుఎస్‌కు కట్టబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు, వెండి ఆభరణాలను మీడియాకు చూపుతున్న ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తదితరులు

అద్విక చీటింగ్ కేసులో ప్రధాన నిందితుల అరెస్టు

- రూ.100 కోట్ల విలువైన చరాస్తులు స్వాధీనం

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ కేంద్రంగా నాలుగు నెలల క్రితం వెలుగులోకి వచ్చిన అద్విక ట్రేడింగ్ మార్కెటింగ్ కంపెనీ మోసం కేసులో ప్రధాన నిందితులైన భార్యభర్తలను, వారికి సహకరించిన ఇద్దరు కీలక ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు మంగళవారం నగరంలోని తన ఛాంబర్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం... జూన్ 26న బాధితుడు గణేష్‌చంద్ర, అతడి కుటుంబ సభ్యులు మాచవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అద్విక ట్రేడింగ్ కంపెనీ వ్యవస్థాపకులు తాడేపల్లి ఆదిత్య మాటలు నమ్మి రూ.53 లక్షలు డిపాజిట్ చేసినట్లు గణేష్‌చంద్ర తెలిపారు. తనకు తిరిగి రూ.13 లక్షలు ఇచ్చి కంపెనీ మూసివేశారని, న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. ఈ కేసులో వేలమంది బాధితులు ఉండడం.. నష్టపోయిన మొత్తం రూ.140 కోట్ల వరకు ఉండడంతో లోతైన దర్యాప్తు కోసం విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు ప్రత్యేక బృందాలను నియమించారు. సంస్థ ఎండి ఆదిత్య, ఆయన భార్య సుజాతను, ఏజెంట్లు బాలకష్ణమూర్తి, నాగలక్ష్మిదేవిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో బాధితులు 1,355 మంది వరకు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులకు సంబంధించి సుమారు రూ.100 కోట్ల విలువైన చరాస్తులు, రూ.23 లక్షల నగదు, 580 గ్రాముల బంగారు ఆభరణాలు, 8.3 కిలోల వెండి వస్తువులు, టాటా సఫారి కారు, కంప్యూటర్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రూ.3,000 తగ్గిన బంగారం

ముంబయి : ఆల్‌టైం రికార్డ్ గరిష్టాలను తాకిన బంగారం ధరలు క్రమంగా దిగివస్తోన్నాయి. మంగళవారం 10 గ్రాముల బంగారం ధర రూ.1.18 లక్షలకు, కిలో వెండి ధర రూ.1,41 లక్షలు చొప్పున పలికాయి. అమెరికా, చైనా మధ్య వాణిజ్య చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయనే రిపోర్టులకు తోడు డాలర్‌కు డిమాండ్ పెరగడం పసిడి ధరల తగ్గుదలకు దోహదం చేశాయని బులియన్ వర్గాలు తెలిపాయి. ఇండియన్ బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబిజెఎ) సమాచారం ప్రకారం.. 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.3,034 తగ్గి రూ.1,18,043గా నమోదయ్యింది. 22 క్యారెట్ల స్వచ్ఛత పసిడి ధర రూ.1,10,907 నుంచి రూ.1,08,127కు, 18 క్యారెట్ల ధర రూ.90,809 నుంచి రూ.88,532కు దిగివచ్చింది. అదే విధంగా కిలో వెండి ధర రూ.3,135 పతనమై రూ.1,41,896గా పలికింది. ఇంతక్రితం సెషన్‌లో కిలో వెండి ధర రూ.1,45,031గా ఉంది. ఇటీవల కిలో వెండి ధర రికార్డ్ స్థాయిలో రూ.1,70,000గా నమోదయిన విషయం తెలిసిందే.

మహిళా సాధికారతకు కలిసి పనిచేద్దాం

- ఎన్‌జిఒ మహిళా ఉద్యోగులతో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళా సాధికారతకు కలిసి పనిచేద్దామని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. ఎన్‌జిఒ సంఘాల మహిళా ప్రతినిధులు మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయానికి మంగళవారం వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహిళల కోసం తీసుకోవాల్సిన పలు అంశాలపై పరస్పరం చర్చించారు. దీనిపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలకు ప్రత్యేక వాష్ రూములు ఉండాలన్నారు. పిహెచ్‌సిల్లో మహిళా నర్సులకు నైట్ డ్యూటీల్లో ఎదురవుతున్న ఇబ్బందులను ఛైర్‌పర్సన్‌కు వివరించారు. త్వరలోనే చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు రూపకల్పన చేస్తామని వారికి శైలజ తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఎం రాజ్యలక్ష్మి, బి జానకి, లలితాంబ, నాగమల్లేశ్వరి, సులోచన, విజయలక్ష్మి, ఆర్ సూయజ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

40 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు : డిఎఫ్ఒ వినీత్

ప్రజాశక్తి-వేంపల్లె(కడప జిల్లా)

కడప జిల్లా వేంపల్లె అటవీ రెంజ్ పరిధిలోని బోలగొందిచెరువు బీట్ పరిధిలోని గొరివికనుమ అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను అటవీ శాఖాధికారులు అరెస్టు చేశారు. ఈ వివరాలను విలేకరుల సమావేశంలో జిల్లా డిఎఫ్ఒ వినీత్ కుమార్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గొరివికనుమ అటవీ ప్రాంతంలో అక్రమ ఎర్రచందనం రవాణా సమాచారం అందడంతో బోలగొందిచెరువు బీట్‌లో కూబింగ్ చేపట్టారు. ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగా మార్చి రవాణా చేసేందుకు శ్రీ సత్యసాయి జిల్లాలోని తలుపుల మండలానికి చెందిన వ్యక్తులు సిద్ధం చేస్తుండగా 40 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని వేములగొందికి చెందిన పోతలపల్లె మల్లికొండ, కాయలపల్లెకు చెందిన వీరాంజనేయులు, చిన్నవారిపల్లెకు చెందిన చెన్నకేశవులను అరెస్టు చేశారు. కాయలపల్లెకు చెందిన కలువపల్లె మనోహర్ నాయుడు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టామని డిఎఫ్ఒ తెలిపారు.

రొయ్యల ఎగుమతులు 75 శాతం పతనం

- టారిఫ్‌లతో యుఎస్‌కు సరఫరాలో అమాంతం క్షీణత
- ఎగుమతిదారుల్లో ఆందోళన

న్యూఢిల్లీ : అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు రొయ్య రైతు, ఎగుమతిదారులను బెంబేలెత్తిస్తున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది సెప్టెంబర్‌లో అమెరికాకు రొయ్యల ఎగుమతులు ఏకంగా 75 శాతం పతనమయ్యాయని ఎగుమతిదారులు అంచనా వేస్తున్నారు. సెప్టెంబర్ ఎగుమతుల డేటాను ఇంకా అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

మొత్తం భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో అమెరికా 35 శాతం వాటా కలిగి ఉంది. "ఆగస్టు 27 నుంచి యుఎస్ భారత రొయ్యల రవాణాపై సుమారు 60 శాతం సుంకాలు విధించిన తర్వాత.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ అర్ధభాగంలో రొయ్యల ఎగుమతులు తగ్గుతున్నాయని అంచనా." అని జిటిఆర్ఐ సహ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ అన్నారు. యుఎస్ ఆగస్టు 7న భారతీయ వస్తువులపై 25 శాతం టారిఫ్‌లను ప్రకటించింది. ఆ తర్వాత రష్యా చమురు దిగుమతులను సాకుగా చూపి అదనంగా 25 శాతం సుంకాలను వేసింది. ఈ టారిఫ్‌లకు ముందు భారత్ ఎగుమతులపై కేవలం 10 శాతం యాంటీ డంపింగ్ మరియు కౌంటర్‌వైలింగ్ సుంకాలు మాత్రమే ఉండేవి.

2024-25లో రూ.62,408 కోట్ల (7.45 బిలియన్ డాలర్లు) విలువ చేసే సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు జరిగేవి. ఇందులో 35 శాతం వాటా (2.8 బిలియన్లు) అమెరికాకే సరఫరా అయ్యేవి. గతేడాదితో పోల్చితే 2025-26 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 17 శాతం పెరిగి 3.97 బిలియన్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ రొయ్యల ఎగుమతి పరిమాణం 15-18 శాతం మేర తగ్గుతుందని రేటింగ్ సంస్థ క్రిసిల్ రేటింగ్స్ ఇటీవల పేర్కొంది. భారతీయ సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులు నష్టాలను భర్తీ చేయడానికి ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్, ఆగ్నేయ మధ్యప్రాచ్య ప్రాంతాలు వంటి ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషిస్తున్నారని ఒక అధికారి తెలిపారు.

సంపాదకీయం

అప్రజాస్వామికం!

తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నట్లు భారత ఎన్నికల సంఘం ఏకపక్షంగా ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరం. ఎన్నికల ప్రక్రియకు రెండు నెలల ముందు హడావిడిగా బీహార్‌లో చేపట్టిన ఎస్‌ఐఆర్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో అత్యున్నత న్యాయస్థానం విచారిస్తున్న ప్రస్తుత దశలో 51 కోట్ల మందిపైగా ఓటర్ల భవితవ్యాన్ని నిగ్గుతేల్చే ఎస్‌ఐఆర్‌ను హడావిడిగా చేపట్టడం ప్రజాస్వామ్యం పట్ల ధిక్కార ధోరణే. స్థానిక సంస్థలకు, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఎస్‌ఐఆర్ చేపట్టవద్దని కేరళ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని సైతం పక్కనపెట్టడం ఇసి పారదర్శకతనే ప్రశ్నార్థకం చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇంకా జారీ చేయలేదనడం అడ్డగోలుగా వ్యవహరించడమే. రాష్ట్రాల పట్ల, స్థానిక సంస్థల పట్ల ఎంతమాత్రమూ గౌరవం లేకపోవడమే!

ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేయడం అత్యవసరం. ప్రజలు తమ ఉపాధి, విద్య, ఉద్యోగం తదితర అవసరాల కోసం తమకు అనువైన ప్రాంతాలకు మారుతూ ఉండటం, కొంతమంది చనిపోవడం, 18 ఏళ్లు నిండినవారు కొత్తగా నమోదు కావడం సహజం. ఓటర్ల జాబితా ఆధునీకరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా, రాజకీయ పక్షపాత రహితంగా, అనుమానాలకు తావివ్వని విధంగానూ ఉండాలి. ఎన్నికల సంఘం విశ్వసనీయత అత్యంత ప్రధానం. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికలు భారత రాజ్యాంగ మౌలిక వ్యవస్థలో భాగం. వాటిని నిర్వహించే ఎన్నికల కమిషన్ నియామక వ్యవస్థను భ్రష్టుపట్టించిన ఘనత కేంద్రంలోని మోడీ ప్రభుత్వానిదే. ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకాలను చేపట్టే విధానాన్ని మార్పు చేసింది. సిజెఐని తొలగించి, ఆ స్థానంలో సీనియర్ కేబినెట్ మంత్రిని సభ్యుడిగా చేర్చింది. ఈ విధానం సరికాదని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో అధికార పార్టీకి అనుచితమైన అధికారం ఉండకూడదని ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును పక్కనపెడుతూ పార్లమెంటులో ఏకపక్షంగా చట్టం చేసింది. ఆ తరువాత సిఇసి 2002–2004 మధ్య ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్‌ఐఆర్ చేపట్టాలన్న నిర్ణయంసహా ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై ఇసి తీరు అనుమానాలకు తావిస్తోంది. లోక్‌సభ ప్రతిపక్ష నేత మీడియా సమావేశం ఏర్పాటు చేసి, ఓట్ల చోరీ జరిగిందంటూ చేసిన విమర్శలను పరిగణనలోకి తీసుకుని సరిచేయాల్సిన బాధ్యత ఇసిది. అందుకు భిన్నంగా ప్రతిపక్ష నేత తన ఆరోపణలన్నీ నిజమేనని అఫిడవిట్ దాఖలు చేయాలని లేదా క్షమాపణ చెప్పాలని చేసిన ప్రకటన, సిఇసి వ్యవహరించిన తీరు బెదిరించేలా ఉండటం, పాలక పార్టీ అధికార ప్రతినిధిని తలపించడం ఆక్షేపణీయం. బీహార్ ఎస్‌ఐఆర్ ఎన్నికలకు రెండు నెలల ముందు చేపట్టడం, ఆధారంగా తీసుకున్న గుర్తింపు కార్డుల జాబితాను సుప్రీంకోర్టుసైతం ప్రశ్నించింది. రెండు శాతం మందికి ఉండే పాస్‌పోర్టును గుర్తింపు పత్రంగా అంగీకరించి, 87 శాతం మంది వద్ద ఉండే ఆధార్‌ను, స్వయంగా ఎన్నికల కమిషన్ ఇచ్చిన గుర్తింపు కార్డుగా అంగీకరించకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. తొలగించిన జాబితాను ఇసి ప్రకటించాల్సి వచ్చింది. బీహార్ ఎస్‌ఐఆర్ తుది జాబితాలో ప్రధానంగా నష్టపోయింది పేదలే. తొలగించిన 65 లక్షల మందిలో అత్యధికులు మహిళలు, ముస్లింలు, ఎస్‌సి, ఎస్‌టి తదితర అణగారిన తరగతులే. 16 లక్షల మంది తొలగింపుతో మహిళా ఓటర్ల శాతం పురుషులతో పోలిస్తే... వెయ్యికి 907 నుంచి 892కి పడిపోయింది. బీహార్ ఎస్‌ఐఆర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వని ప్రస్తుత పరిస్థితుల్లో తాజాగా దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్ చేపట్టడం ఓటర్ల జాబితాలను తారుమారు చేయాలన్న పాలక పార్టీ దుష్ట పథకానికి వత్తాసు పలకడమే. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల అభ్యంతరాలను పక్కన పెట్టడం ఫెడరలిజానికి గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు.

మహనీయుల మాట



పెట్టుబడిదారీ విధానం తన గొయ్యిని తానే తవ్వుకుంటుంది.
- కారల్ మార్క్స్

ట్రంప్ ఆసియా పర్యటన - వాణిజ్య ఒప్పందాలు

అంతర్జాతీయం

మంగళవారం నాడు అమెరికా, జపాన్ మధ్య వాణిజ్య, విలువైన ఖనిజాల ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు ట్రంప్, జపాన్ ప్రథమ మహిళా ప్రధాని తకాయిచి టోక్యోలో సంతకాలు చేశారు. వివరాలు పూర్తిగా వెల్లడి కాలేదు. అమెరికాలో 550 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ అంగీకరించగా ప్రతిగా దాని వస్తువులపై 15 శాతం దిగుమతి పన్ను విధించేందుకు అమెరికా అంగీకరించింది. ట్రంప్‌కు కావాల్సినన్ని పొగడ్తలు తప్ప అమెరికాకు పెద్దగా ఒరిగిందేమీ లేదని డెమోక్రటిక్ పార్టీ మద్దతుదారైన న్యూయార్క్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యానించింది. ఈ ఒప్పందాలను రెండు దేశాల మధ్య సంబంధాలలో "నూతన స్వర్ణయుగం" అని వర్ణించారు. అదిరింపులు బెదిరింపుల మధ్య జులై లోనే పెట్టుబడులు, పన్నుల గురించి ఒక అవగాహన కుదిరినట్లు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. అయితే మంగళవారం నాడు సంతకాలు జరగటానికి ముందు చివరి క్షణం వరకు అనేక అనుమానాలు షికారు చేశాయి. పశ్చిమాసియాలో శాంతి, థాయ్‌లాండ్–కంపూచియా మధ్య వివాదాన్ని పరిష్కరించటంలో ట్రంప్ పాత్రను తకాయిచి ఆకాశానికి ఎత్తారు. వారి చర్చల తరువాతే టోక్యోలోని అక్సాకా పాలెస్‌లో జరిగిన స్వాగత కార్యక్రమానికి ట్రంప్ హాజరయ్యాడు. ఈ ఒప్పందం గురించి ప్రశంసలు, విమర్శలు గతంలోనే వెల్లడయ్యాయి. జపాన్ నుంచి అమెరికా ఇప్పటి వరకు లక్ష కోట్ల డాలర్ల మేర రుణాలుగా తీసుకుంది. అమెరికా డాలర్ల కోసం ప్రతి దేశాన్నీ బెదిరిస్తున్నది. అయితే తాజాగా కుదిరిన ఒప్పందం గురించి గతంలోనే ట్రంప్ మీద విమర్శలు వచ్చాయి. ఆ ఒప్పందంలో తరువాత ఎలాంటి మార్పులూ చేసినట్లు ఎవరూ ప్రకటించలేదు గనుక గత విమర్శలేమిటో ఒకసారి చూద్దాం. ఐదు వందల యాభై బిలియన్ డాలర్ల మొత్తాన్ని ప్రభుత్వానికి ఇస్తే తమ ఇష్టం వచ్చినట్లు వినియోగించుకుంటామని, దాని మీద వచ్చే లాభాలలో 90 శాతం తమకే అని ట్రంప్ వత్తిడి చేశాడు. అయితే ఆ మొత్తంలో కేవలం రెండు శాతం మాత్రమే పెట్టుబడిగా ఉంటుందని, మిగిలిన మొత్తం రుణాలు, రుణ హామీల వంటి ఇతర రూపాల్లో ఉంటుందని జపాన్ ప్రతినిధి వర్గనేత రోయెసీ అకజావా టీవీలో బహిరంగంగా చెప్పాడు. కొంత మంది అమెరికన్లకు జపాన్‌ను విక్రయించారని విమర్శిస్తున్నారని, లాభాల్లో 90 శాతానికి అంగీకరించినందున నష్టం పెద్దగా ఉండదని, దీనికి ప్రతిగా అమెరికా తగ్గించే పన్నుల వలన 68 బిలియన్ డాలర్ల మేర జపాన్‌కు లబ్ధి కలుగుతుందని కూడా చెప్పాడు. బహుశా ఈ కారణంతోనే మంగళవారం నాడు ఒప్పందంపై సంతకాల తరువాత న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రతికూలంగా వ్యాఖ్యానించిందని చెప్పవచ్చు. తమ దేశంలో పెట్టుబడులకు, పన్నులు విధింపుకు లంకె పెట్టటం ఒక్క జపాన్ విషయంలోనే కాదు. ఇప్పటికే ఐరోపా యూనియన్‌తో 600 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడితేనే 15 శాతం పన్నులు విధిస్తామని లేకుంటే ఎక్కువ అని ట్రంప్ బెదిరించాడు.

ఎం. కోటేశ్వరరావు

> ట్రంప్ ఆసియా పర్యటనలో వివిధ దేశాలతో ఒప్పందాలను కుదుర్చుకొనేందుకు కొన్ని షరతులను రుద్దినట్లుగా కనిపిస్తోంది. చిన్న చిన్న దేశాలలో ఎంత దొరికితే అంత అన్నట్లుగా విలువైన ఖనిజాల గురించి ఒప్పందాలు చేసుకున్నాడు. మలేషియా వస్తువుల మీద 19 శాతం పన్నుల విధింపు అమల్లో ఉందని చెబుతూనే కొన్ని మినహాయింపులు ఇచ్చాడు. దీనికి ప్రతిగా అమెరికా వస్తువులు, గ్యాస్, వ్యవసాయ ఉత్పత్తులను మలేషియా కొనుగోలు చేయనుంది. అమెరికా కంపెనీ బోయింగ్ నుంచి 30 విమానాలను కొనుగోలు చేస్తామని, మరో 30 గురించి ఆలోచిస్తామని చెప్పింది. ఇవిగాక అమెరికాలో 70 బిలియన్ డాలర్లు పెట్టుబడులుగా పెట్టేందుకు అంగీకరించింది. అయితే కీలకమైన సెమీ కండక్టర్లను ఉత్పత్తి చేస్తున్న మలేషియా అమెరికా షరతులకు తలొగ్గలేదు.

వాణిజ్యం చేయటం, లాభాలు పిండుకోవటంలో అమెరికా, జపాన్ ఎవరికి ఎవరూ తీసిపోరు గనుక పరస్పర లబ్ధి లేకుండా అంగీకరించే అవకాశం ఉండదని చెప్పవచ్చు. ముందే చెప్పుకున్నట్లు ఒక లక్ష కోట్ల డాలర్లు అమెరికాకు అప్పు ఇవ్వటమేగాక మరో రెండు లక్షల కోట్ల డాలర్ల మేర ఇప్పటికే జపాన్ పెట్టుబడులు పెట్టింది. ఈ విషయంలో బ్రిటన్ రెండవ స్థానంలో ఉంటే చైనా మూడవదిగా ఉంది. అమెరికాలో ఉన్న జపాన్ కంపెనీలైన సోనీ, టొయోటా వంటి బహుళజాతి కంపెనీలు, ద్రవ్య పెట్టుబడి సంస్థలు అక్కడ పెట్టుబడులు పెట్టి లాభాలు సంపాదిస్తున్నాయి, వచ్చిన లాభాలను తిరిగి అక్కడే పెట్టుబడులుగా పెడుతున్నాయి. తాజా ఒప్పందంలో అమెరికా కార్లకు ద్వారాలు తెరిచేందుకు జపాన్ అంగీకరించినట్లు చెబుతున్నారు. గతంలో కార్లంటే అమెరికా, ఇప్పుడు జపాన్ ఆ స్థానాన్ని ఆక్రమించింది, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాలూ తక్కువ తినలేదు, విద్యుత్ కార్ల రంగంలో చైనా సవాలు విసురుతోంది. అందువలన ట్రంప్ విధించే పదిహేను శాతం దిగుమతి పన్నుతో అమెరికా కంపెనీల యజమానులు కొంత కాలం పాటు ఊరట పొందవచ్చు తప్ప తరువాత పోటీకి అనుగుణంగా తయారుగాకపోతే అంతే సంగతులు.

ట్రంప్ ఆసియా పర్యటనలో వివిధ దేశాలతో ఒప్పందాలను కుదుర్చుకొనేందుకు కొన్ని షరతులను రుద్దినట్లుగా కనిపిస్తోంది. చిన్న చిన్న దేశాలలో ఎంత దొరికితే అంత అన్నట్లుగా విలువైన ఖనిజాల గురించి ఒప్పందాలు చేసుకున్నాడు. మలేషియా వస్తువుల మీద 19 శాతం పన్నుల విధింపు అమల్లో ఉందని చెబుతూనే కొన్ని మినహాయింపులు ఇచ్చాడు. దీనికి ప్రతిగా అమెరికా వస్తువులు, గ్యాస్, వ్యవసాయ ఉత్పత్తులను మలేషియా కొనుగోలు చేయనుంది. అమెరికా కంపెనీ బోయింగ్ నుంచి 30 విమానాలను కొనుగోలు చేస్తామని, మరో 30 గురించి ఆలోచిస్తామని చెప్పింది. ఇవిగాక అమెరికాలో 70 బిలియన్ డాలర్లు పెట్టుబడులుగా పెట్టేందుకు అంగీకరించింది. అయితే కీలకమైన సెమీ కండక్టర్లను ఉత్పత్తి చేస్తున్న మలేషియా అమెరికా షరతులకు తలొగ్గలేదు. కంపూచియాతో కుదిరిన ఒప్పందం ప్రకారం అమెరికా వస్తువుల దిగుమతిపై ఎలాంటి పన్ను ఉండదు. విలువైన ఖనిజాల శుద్ధి వంటి ప్రక్రియకు అమెరికా పెట్టుబడులను అనుమతిస్తుంది. వియత్నాంపై విధించిన 46 శాతం పన్నులను 20 శాతానికి తగ్గించేందుకు అమెరికా దిగివచ్చింది. దీనికి ప్రతిగా ఎనిమిది బిలియన్ డాలర్లతో 50 బోయింగ్ విమానాలను కొనుగోలు చేస్తుంది. వీటితో పాటు అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను కూడా దిగుమతి చేసుకుంటుంది. చైనా నుంచి దిగుమతి చేసుకున్న విడి భాగాలతో తయారు చేసి అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై పన్ను వివాదం కొనసాగుతూనే ఉంది. ఒక నిర్దిష్ట నిర్వచనం లేదు. థాయ్‌లాండ్ వస్తువులపై 19 శాతం పన్నుల నుంచి అనేక వస్తువులకు మినహాయింపు ఇస్తారు. ఎనభై విమానాలను థాయ్ కొనుగోలు చేస్తుంది.

డోనాల్డ్ ట్రంప్ కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఆసియన్ ప్లస్ 3 (ఎపిటి) సమావేశాలకు, తరువాత దక్షిణ కొరియాలో జరిగే మరో సభలో పాల్గొనేందుకు వస్తూ...అనేక దేశాలతో విలువైన లోహాలు, ఇతర ఒప్పందాలు కుదుర్చుకోనున్నాడు. పది ఆగ్నేయాసియా దేశాలతో కూడిన ఆసియన్ కూటమిలో తాజాగా తైమూర్–లెస్తే చేరింది. ఇవిగాక చైనా, జపాన్, దక్షిణ కొరియా అనుబంధంగా ఉన్న కారణంగా ఆసియన్ ప్లస్ మూడు అని పిలుస్తున్నారు. ధనిక దేశాలు అనుసరిస్తున్న రక్షణాత్మక విధానాల నుంచి తట్టుకోవాలంటే ఈ కూటమి దేశాల మధ్య సహకారాన్ని విస్తరించుకోవాలని చైనా ప్రధాని లీ క్వియాంగ్ కోరాడు. గత కొద్ది సంవత్సరాలుగా తూర్పు ఆసియా వేగంగా వృద్ధి చెందుతున్నది. ఇదే సమయంలో కొన్ని సమస్యలను కూడా ఎదుర్కొంటున్నది. ఈ సమావేశాలకు తమ మంత్రి ద్వారా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రభూ సుబియాంతో ఒక సందేశం పంపాడు. ఆర్‌సిఇపి తో సమన్వయం చేసుకొని దాన్నొక వేదికగా ఆసియన్ దేశాలు వినియోగించుకోవాలని కోరాడు. ఏకపక్ష వైఖరితో వ్యవహరిస్తున్న దేశాలను ఐక్యంగా ఎదుర్కోవాలని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జేయి మయుంగ్ కోరాడు. రక్షణాత్మక చర్యలతో పాటు సరఫరా గొలుసుల సమస్యలను కూడా ఎదుర్కొంటున్నట్లు చెప్పాడు. పెరుగుతున్న రక్షణాత్మక ధోరణులు, సరఫరా వ్యవస్థల్లో వస్తున్న మార్పులు ఆసియన్ దేశాలకు హెచ్చరికలు పంపుతున్నాయని, వాటిని చూసి నిర్ఘాంతపోయి అచేతనంగా ఉండరాదని మలేషియా ప్రధాని అన్వర్ చెప్పాడు. ఇప్పుడున్న భాగస్వామ్యాన్ని మరింతగా మెరుగు పరుస్తూ కొత్త భాగస్వామ్యాల కోసం ధైర్యంగా వ్యవహరించాలన్నాడు. వర్తమాన సంవత్సరంలో జనవరి నుంచి సెప్టెంబరు వరకు తొమ్మిది నెలల కాలంలో చైనా, ఆసియన్ దేశాల మధ్య వాణిజ్య లావాదేవీలు 782 బిలియన్ డాలర్ల మేర జరిగాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 9.6 శాతం ఎక్కువ. కౌలాలంపూర్ సమావేశంలో చైనా–ఆసియన్ దేశాల స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతం 3.0 ఒప్పందం కుదిరింది. అమెరికా పన్నులకు అందరం బాధితులమే అని, దాని రక్షణాత్మక వైఖరిని వ్యతిరేకించాలని ఆసియన్ దేశాలన్నింటా ఏకీభావం కనిపించింది. అయితే వివిధ కారణాలతో అనేక దేశాలు అమెరికాతో నేరుగా ఒప్పందాలు చేసుకుంటున్నప్పటికీ ఒక్కటిగా ఉండకపోతే నష్టమనే భావన ఏర్పడింది.

గత ఏడాది లావోస్‌లో జరిగిన 27వ సమావేశం పెరుగుతున్న ప్రాంతీయ సహకారం గురించి చర్చించింది. దాన్ని మరింతగా ముందుకు తీసుకుపోయేందుకు కౌలాలంపూర్ సమావేశం దృష్టి సారించింది. ఇది అనివార్యమైన పరిణామం. అన్ని దేశాల మీద ట్రంప్ పన్నుల దాడి మొదలు పెట్టిన పూర్వరంగంలో దానికి గురయ్యే దేశాలకు ఇంతకు మించి మరొక మార్గం లేదు.

వ్యాఖ్య

ఐ.వెంకటేశ్వరరావు

డిఏ బకాయిలు చెల్లించేదెవరు?

డిఏ బకాయిలు ఉద్యోగి రిటైర్మెంట్ నాటి పాలకుడు చెల్లిస్తే ఈ ప్రభుత్వం చెల్లించినట్లా? ప్రభుత్వాలకు ఇప్పుడు లేని ఆదాయం అప్పుడు వస్తుందా? పెరుగుతుందా? ఇప్పుడు చెల్లింపులు భారమైతే అన్ని బకాయిలు కలిపి అప్పటి ప్రభుత్వాలకు భారం కాదా? ఈ పోస్టు డేటెట్ చెక్కులు, వీలునామాలకు విలువ, గ్యారంటీ ఉంటుందా?

జనవరి 2024 డిఏకు సంబంధించి ఈ అక్టోబరు 20న ప్రభుత్వం ఇచ్చిన జీవోలు 60, 61 విషయమై ఉద్యోగులు, పెన్షనర్ల నుండి అనేక అసంతృప్తులు, ప్రశ్నలు వస్తున్నాయి. నాలుగు డిఏలు బకాయిలు పడి, ఒక్క డిఏ (జనవరి 2024) ప్రకటించి...అక్టోబరు 2025 నాటికి వెనకటి 21 నెలల బకాయిలను ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత, ఇప్పటికే రిటైర్ అయినవారికి 2027–28 ఆర్థిక సంవత్సరంలో 12 వాయిదాలతో చెల్లిస్తామని చెప్పడం...ఉద్యమాల ఒత్తిడి ద్వారా ఒక్క డిఏ అయినా సాధించుకున్నామనే ఆనందం ఉత్తర్వులు చూశాక, మోసం తెలిశాక ఆనందం ఆవిరైపోయింది. ఒక్క డిఏ లోనే ఇన్ని మెలికలు ఉంటే భవిష్యత్ డిఏలు, పిఆర్‌సిల పట్ల ఉద్యోగులలో మరింత భయం, ఆందోళన పెరిగింది.

గత ప్రభుత్వం 2018 జులై 1 నుండి 2022 జనవరి 1 వరకు బకాయి పడిన 8 డిఏలలో (మూడు డిఏలు కరోనాలో మాఫీ చేసి) పిఆర్‌సి అమలు సందర్భంగా ఐదు డిఏల ఆర్థిక లాభం పిఆర్‌సి పెరుగుదలగా చూపించింది. అప్పటి నుండి పాలకుల రాజకీయ అవసరాలను బట్టి ఏ డిఏ ఎప్పుడు ప్రకటిస్తారో? ఎప్పటినుండి చెల్లిస్తారో, ఎన్ని వాయిదాలలో చెల్లిస్తారో, ఏ డిఏ రావాలో ఎప్పుడు కలుస్తుందో తెలియని పరిస్థితి వచ్చింది. జీవో లలో పేర్కొన్నట్లు కూడా బకాయిలు చెల్లించలేదు. ఒక్కొక్క డిఏ నాలుగు వాయిదాలలో, ఎప్పుడెప్పుడో చెల్లించే ట్రెండ్ మొదలైంది.

2024 ఫిబ్రవరిలో గత ప్రభుత్వం జెఏసి సంఘాల సమావేశంలో 34 వేల కోట్ల రూపాయల పిఆర్‌సి అరియర్లు, డిఏ అరియర్లు, సరెండర్ లీవులు, పి.ఎఫ్, ఉద్యోగ విరమణ, జిఐఎస్, మెడికల్ తదితర బకాయిలు ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయి పడినట్లు లెక్కలు చెప్పింది. ఎన్నికల ముందు కొన్ని బకాయిలు చెల్లించి మిగిలిన బకాయిలు చెల్లింపు రాబోయే ప్రభుత్వాలపై నెట్టివేసింది.

ప్రస్తుత ప్రభుత్వం 2024 జనవరి నుండి 2025 జులై వరకు చెల్లించాల్సిన నాలుగు డిఏలకు గాను, పిఆర్‌సి ఇతర సమస్యలకు సంబంధించి మంత్రుల కమిటీ వేసి జెఏసి సంఘాలతో చర్చించి ముఖ్యమంత్రి సమక్షంలో డిఏ ప్రకటన చేసింది. ఉద్యోగుల ఆర్థిక డిమాండ్లు పరిష్కరించాలని మనసులో ఉన్నా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణమంటూ లెక్కలు చెప్పి ముఖ్యమంత్రి దీపావళి కానుకగా ఒక్క డిఏ ప్రకటించారు. 'కానుక' అనేది ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకుల సంప్రదాయ భాషగా మారిపోయింది.

ధరల పెరుగుదల సూచీకి అనుగుణంగా రావాల్సిన డిఏ పాలకపక్ష మీడియాల్లో 'బోనాంజా'గా ప్రచారమవుతున్నది. 'కానుక' అనేది ఇచ్చేవారి ఇష్టాయిష్టాలు, అభిమానాలపై ఆధారపడి ఉంటుంది. ఇంత ఇవ్వాలనే నియమ నిబంధనలు ఉండవు. కాని డిఏకు సంబంధించి ప్రతి 6 నెలలకు చెల్లించాలనే నిబంధన ఉంది. అందువల్ల ముఖ్యమంత్రి డిఏ నిబంధనలు వదిలేసి తన ఇష్టప్రకారంగా డిఏ కానుకగా ప్రకటించారు.

అయితే డిఏ ప్రకటనలో ప్రభుత్వ మాయ ఉత్తర్వులు వస్తేగాని అర్థంకాలేదు. ప్రభుత్వం సంఘాలతోగాని, మీడియా ప్రకటన చేసినప్పుడుగాని ఈ విషయం గోప్యంగా ఉంచింది. గత ప్రభుత్వం ఒక డిఏ ఆర్థిక బకాయిల చెల్లింపునకు ఒక ఆర్థిక సంవత్సరాన్ని నాలుగు భాగాలుగా చేస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగ విరమణ చేసిన వారికి రెండేళ్ళ తర్వాత 2027–28లో 12 భాగాలుగా చెల్లిస్తామని, ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాతనే చెల్లిస్తామని మరింత మోసపూరిత ఉత్తర్వులు ఇచ్చింది.

పిఆర్‌సి అయినా, డిఏలు అయినా ధరల సూచీని బట్టి రాబట్టే పోరాటాలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం డిఏ చెల్లింపులో బకాయిలను ఉద్యోగ విరమణ తరువాత చెల్లిస్తామనే ప్రమాదకరమైన ట్రెండ్‌ను రాష్ట్ర జెఏసిలు ప్రతిఘటించాలి. డిఏ ఉత్తర్వుల సవరణకై పట్టుపట్టాలి. ఉద్యోగుల ఇతర డిమాండ్ల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సి ఉంది.

/ వ్యాసకర్త యుటియఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, ఎ.పి జెఏసి పూర్వ సెక్రెటరీ జనరల్ /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

పోయిన ప్రాణాలకు బాధ్యత ఎవరిది?

విశ్లేషణ

కర్నూలు జిల్లాలో అక్టోబర్ 24న జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు సజీవ దహనం కావడం దారుణం. బాధితుల కష్టాన్ని, నష్టాన్ని మాటల్లో వర్ణించలేం.

బస్సులో పార్సిల్స్‌లో సెల్ ఫోన్లు ఉన్నాయని, అవి పేలుడుకు దోహదపడ్డాయని ప్రాథమిక నివేదిక. ప్రయాణికులను మాత్రమే చేరవేయాల్సిన బస్సులో వాణిజ్య సరుకులు, అందునా పేలుడుకు అవకాశమున్న వాటిని బస్సులో అనుమతించారు. బస్సు కింది భాగానికి ఏవీ వెళ్లకుండా నిరోధించడానికి సేఫ్టీ గార్డ్ ఉండాలని అగ్నిమాపక నిపుణులు తెలియజేస్తున్నారు. కానీ ప్రమాదానికి గురైన బస్సుకి అలాంటి సేఫ్టీ గార్డ్ లేని కారణంగా ద్విచక్ర వాహనం బస్సు కిందకి దూసుకు వెళ్లి ప్రమాదానికి కారణమైందనీ ప్రాథమిక నివేదికలోనీ మరొక అంశం. ప్రమాదానికి గురైన బస్సు కేవలం కూర్చోటానికి మాత్రమే అవకాశం ఉండే బస్సుగా పర్మిట్ తీసుకున్నట్లు రవాణా అధికారులు కూడా ధ్రువీకరించారు. కానీ దానిని స్లీపర్ బస్సుగా మార్చడానికి అనుమతి పొందారా లేదా అనేది తమకు తెలియదని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తెలిపినట్లుగా పత్రికల్లో వచ్చింది. ఏసీ బస్సులన్నింటికీ అద్దాలు ముందు వెనకకు జరపడానికి వీలు లేకుండా బిగించబడి ఉంటాయి. ప్రమాదకర పరిస్థితులలో అద్దాలను పగలగొట్టి ప్రయాణికులు బయటకు రావడానికి అనువుగా సుత్తి లాంటి పరికరాలు బస్సు లోపల అమర్చి, ప్రయాణికులకు ప్రమాదకర పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియజేయాలి. కానీ ప్రమాదానికి గురైన బస్సులో అలాంటి పరికరాలు లేవని, ఫలితంగా ప్రయాణికులు వెంటనే అద్దాలు పగలగొట్టుకుని బయటకు రాలేకపోయారని వార్తల్లో వచ్చింది. అదే సందర్భంలో ఆ మార్గంలో వెళ్తున్న ఒక యువకుల బృందం ఆగి ఉన్న బస్సులో పొగలు రావడం చూసి వారి కారును ఆపి, రాయితో అద్దాలు పగలగొట్టి కొంతమంది ప్రయాణికులు బయటకు వచ్చేందుకు సహాయపడ్డారని కూడా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ యువకుల బృందం సమయస్ఫూర్తిగా వ్యవహరించిన తీరు అభినందనీయం. లగేజి క్యాబిన్ మీద ఉన్న బెర్తులలో పడుకున్న ప్రయాణికులే ఎక్కువ మంది చనిపోయినట్లుగా కూడా వార్తల్లో వచ్చింది.

జె. దివాకర్

ప్రపంచీకరణ నేపథ్యంలో 'ప్రైవేటు యాజమాన్యాల మీద ఆంక్షలు విధించడం, తనిఖీలు చేయడం పనికి రాదు. వారికి స్వేచ్ఛ ఇవ్వాలి' అనేది ప్రభుత్వ నీతిగా మారింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరున ప్రభుత్వాలు తాము నిర్వహించాల్సిన, ప్రజలకు బాధ్యత వహించాల్సిన కర్తవ్యాలను సమాధి చేయడం నేడు మనం చూస్తున్నాం. వాస్తవంగా 19 మంది సజీవ దహనానికి కారణమైన కావేరి ట్రావెల్స్ బస్సు యజమానిని హత్యా నేరం కింద అరెస్టు చేసి జైలుకు పంపాలి. కానీ నేటి వరకు అది జరగలేదు. ఎఫ్ఐఆర్‌లో కనీసం యజమాని పేరు కూడా పేర్కొనకపోవడం గమనార్హం.

> ప్రపంచీకరణ నేపథ్యంలో 'ప్రైవేటు యాజమాన్యాల మీద ఆంక్షలు విధించడం, తనిఖీలు చేయడం పనికి రాదు. వారికి స్వేచ్ఛ ఇవ్వాలి' అనేది ప్రభుత్వ నీతిగా మారింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరున ప్రభుత్వాలు తాము నిర్వహించాల్సిన, ప్రజలకు బాధ్యత వహించాల్సిన కర్తవ్యాలను సమాధి చేయడం నేడు మనం చూస్తున్నాం. వాస్తవంగా 19 మంది సజీవ దహనానికి కారణమైన కావేరి ట్రావెల్స్ బస్సు యజమానిని హత్యా నేరం కింద అరెస్టు చేసి జైలుకు పంపాలి. కానీ నేటి వరకు అది జరగలేదు. ఎఫ్ఐఆర్‌లో కనీసం యజమాని పేరు కూడా పేర్కొనకపోవడం గమనార్హం.

• కేంద్ర ప్రభుత్వం 2019 సంవత్సరంలో మోటారు వాహనాల చట్టానికి సవరణ చేసింది. • ఆ సవరణ ప్రధాన లక్ష్యం దేశంలోని మొత్తం రోడ్డు రవాణా (ఆటో, టాక్సీ, బస్సు, లారీ వగైరా అన్నింటినీ) పెద్ద కార్పోరేట్ కంపెనీలకు అప్పగించటం. ఈ లక్ష్యంతోనే కొత్తగా "అగ్రిగేటర్" అనే సెక్షన్‌ను చట్టంలో చేర్చారు. • టూరిస్ట్, కాంట్రాక్ట్ క్యారేజీ పర్మిట్ నిబంధనలను రద్దుచేసి అన్నిటినీ కలిపి "ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్"గా చట్టంలో మరొక సవరణ చేశారు. • అలాగే ఆర్టీసీ లకు సమాధి కట్టి, ప్రైవేట్ వారిని ప్రోత్సహించేందుకు కొన్ని సెక్షన్లు అదనంగా చేర్చారు. • తదనంతరం 2021లో ఒకే దేశం ఒకే చట్టం నినాదంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం "నేషనల్ పర్మిట్ సిస్టం" ప్రవేశపెట్టింది. • నేషనల్ పర్మిట్ విధానం ప్రకారం ప్రైవేట్ బస్సు యజమానులు కేంద్ర ప్రభుత్వానికి మూడు లక్షల రూపాయల పన్ను చెల్లించి నేషనల్ పర్మిట్ తీసుకోవచ్చు. • విడివిడిగా ప్రయాణికులను ఎక్కడి నుండి ఎక్కడికైనా రవాణా చేయవచ్చు. • నేషనల్ పర్మిట్ తీసుకున్న బస్సు యజమాని ఆ వాహనం ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారం ఆ రాష్ట్రానికి మోటార్ వాహనాల పన్ను చెల్లించాలి. దాంతో ప్రైవేట్ బస్సు యజమానులు ఎం.వి.టాక్స్ ఎక్కడ తక్కువ ఉంటే ఆ రాష్ట్రంలో బస్సును రిజిస్టర్ చేసుకొని, ఎక్కువ ఆదాయం వచ్చే రాష్ట్రాలలోని ప్రధాన మార్గాలలో విచ్చలవిడిగా బస్సులను తిప్పుతున్నారు. బస్సు తిరిగే రాష్ట్రంలో పన్ను చెల్లించడం లేదు కాబట్టి, పర్మిట్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది కాబట్టి, నిబంధనలు తనిఖీలు మాకు సంబంధం లేదని ఆయా రాష్ట్రాలలోని అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. • బస్సు ప్రమాదం జరిగిన సందర్భంగా మంటలు వేగంగా చేలరేగి మరింత ఎక్కువ ప్రమాదానికి కారణం లగేజీ క్యారియర్ లో 400 సెల్ ఫోన్లను అనుమతించడమే. • మండే స్వభావంగల బ్యాటరీల వల్ల తీవ్ర నష్టం జరిగింది. ప్రయాణికుల వద్ద మండే స్వభావం ఉన్న ఏ లగేజ్‌ని కూడా అనుమతించకూడదనే నిబంధన ఉన్నది. కానీ లాభాలే పరమావధిగా యజమానులు యథేచ్ఛగా ఉల్లంఘించి వీటిని అనుమతించిన ఫలితంగా జరిగిన ప్రమాదంలో ప్రాణ నష్టం గరిష్ట స్థాయికి చేరుకున్నది. • డ్రైవర్లు 8 గంటలకు మించి పని చేయడానికి అనుమతించకూడదని, ప్రతి ఐదు గంటల డ్రైవింగ్ తర్వాత అరగంట విశ్రాంతి ఉండాలని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ చట్టం 1961 నిర్దేశిస్తున్నది. • దీనికి కూడా కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచి పని గంటలు పెంచే విధంగా లేబర్ కోడ్స్ రూపొందించింది. • అనుభవం, అర్హత లేని డ్రైవర్లకు బస్సులను అప్పజెప్పి ప్రజల ప్రాణాలను గాలిలో దీపం లాగా వదిలేశారు. • డ్రైవర్లకు తగిన శిక్షణ ఉండదు. • వేగ నియంత్రణ నిబంధనను తుంగలో తొక్కి వాయు వేగంతో ప్రైవేటు బస్సులు రోడ్లపై వెళ్తుంటాయి. • వెహికల్ కండిషన్ పట్ల ఎలాంటి శ్రద్ధ ఉండదు. • ప్రస్తుత ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ప్రవేట్ బస్సు తనిఖీలో 16 ఈ చలాన్లు, 23120 జరిమానా పెండింగ్‌లో ఉండడం అనేది వీరి అక్రమ పద్ధతులకు పరాకాష్ట అని నిరూపించబడింది. ప్రభుత్వ విధానాల్లో వచ్చిన మార్పులను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ బస్సు యజమానులు నిబంధనలను పాతర పెట్టి ప్రయాణికుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. వెరసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేడు జరుగుతున్న బస్సు ప్రమాదాలు, ప్రయాణికుల మరణాలకు ప్రధాన ముద్దాయిలు. విధానపరమైన మార్పుల కోసం ప్రజా ఉద్యమాలు సాగించాలి. ఆ ఒత్తిడితోనే పాలకులు దారికొస్తారు.

/ వ్యాసకర్త ఎ.పి.ఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పూర్వ కోశాధికారి

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో కేశవ ప్రతిభ

ప్రజాశక్తి- కశింకోట (అనకాపల్లి జిల్లా)

గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బొడ్డేడ కేశవ అండర్ 17 బాలుర విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎన్‌జెవి.ప్రసాద్ తెలిపారు. కేశవను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వి.ప్రభాకర్, పి.కమల తదితరులు అభినందించారు.

ఫారం నెం.3
(రెగ్యులేషన్ 15(1) (ఎ)/16(3) చూచండి)

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ విశాఖపట్నం

గ్రౌండ్ & ఎఎంపి; 1వ అంతస్తు, 31-31-21, సాయిబాబా స్ట్రీట్, నారాయణ్ భవన్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020

కేసు నెం: ఓ.ఏ.నెం.507 ఆఫ్ 2025

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్, 1993లోని రూల్ 5 యొక్క సబ్-రూల్ (2ఏ)తో చదవగల చట్టంలోని సెక్షన్ 19 యొక్క ఉప-సెక్షన్ (4) క్రింద సమన్లు

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
మరియు
శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్ & ఇతరులు

వీరికి,
డి1 శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్ జి విఘ్నేశ్వరరావు,
డోర్ నెం.3-6-32/19/4/5, పాటూరు, మూర్తి యుపిపాఠశాల ఎదురుగా, చౌసమ్మ టెంపుల్ రోడ్, నరసరావుపేట, గుంటూరు-522601
డి2 జి. విఘ్నేశ్వరరావు,
డోర్ నెం.3-6-32/19/4/5, పాటూరు, మూర్తి యుపి స్కూల్ ఎదురుగా, చౌసమ్మ టెంపుల్ రోడ్, నరసరావుపేట, గుంటూరు-522601
డి3 జి.మల్లీశ్వరి, భర్త విఘ్నేశ్వరరావు,
డోర్ నెం. 3-6-32/19/4/5, పాటూరు, మూర్తి యుపి స్కూల్ ఎదురుగా, చౌసమ్మ టెంపుల్ రోడ్, నరసరావుపేట, గుంటూరు-522601

పత్రికా ప్రచురణ ద్వారా సమన్లు

ఏదైతే, 31.10.2025న గౌరవ ప్రిసైడింగ్ ఆఫీసర్/ రిజిస్ట్రార్ సమయంలో ఓఏ 509/2025 జాబితా చేయబడింది.
ఏదైతే, చట్టంలోని సెక్షన్ 19(4) కింద సదరు దరఖాస్తుపై సమన్లు/ నోటీసు జారీచేయడానికి ఈ గౌరవ ట్రిబ్యునల్ అనుమతి స్తున్నందుకు (ఓఏ) **రూ.30,97,219.85/-** డెట్స్ రికవరీ కోసం మీపై దాఖలుచేసిన దరఖాస్తుతో పాటు పత్రాల కాపీలు మొదలైనవి జతచేయబడ్డాయి).
చట్టంలోని సెక్షన్ 19లోని సబ్-సెక్షన్ (4) ప్రకారం, మీరు, ప్రతివాదులు ఈ క్రింది విధంగా నిర్దేశించబడ్డారు.
(i) ప్రార్థించిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో సమన్లు అందిన ముప్పై రోజులలోపు కారణం చూపడం.
(ii) ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమసంఖ్య 3ఏ ప్రకారం దరఖాస్తుదారు పేర్కొన్న ఆస్తులు మరియు అసెట్స్ కాకుండా ఇతర ఆస్తులు లేదా అసెట్స్ వివరాలను బహిర్గతం చేయడం.
(iii) ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఏ ప్రకారం బహిర్గతం చేయబడిన సెక్యూర్డ్ ఆస్తులు లేదా అటువంటి ఇతర ఆస్తులు మరియు ఆస్తులతో వ్యవహరించడం లేదా డిస్పోజల్ నుండి మీరు నిరోధించబడ్డారు, ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సంబంధించిన దరఖాస్తు విచారణ మరియు డిస్పోజల్ పెండింగ్‌లో ఉంది.
(iv) ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమసంఖ్య 3ఏ క్రింద వ్యాపారం యొక్క సాధారణ కోర్సులో తప్ప, సెక్యూరిటీ ఇంట్రెస్ట్‌నుసృష్టించిన మరియు/లేదా ఇతర ఆస్తులు మరియు క్రింద పేర్కొన్న లేదా బహిర్గతం చేసిన ఆస్తులను మీరు విక్రయం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయకూడదు.
(v) సాధారణ వ్యాపారంలో సెక్యూర్డ్ అసెట్స్ లేదా ఇతరఅసెట్స్ మరియు ఆస్తుల విక్రయం ద్వారా వచ్చిన అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయానికి మీరు ఖాతాకు అందుబాటులో ఉంటారు మరియు అటువంటి ఆస్తులపై సెక్యూరిటీని కలిగిఉన్నబ్యాంకు లేదా ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్ వద్దనిర్వహించబడే ఖాతాలో అటువంటి విక్రయ ఆదాయాన్ని డిపాజిట్ చేయాలి.
దరఖాస్తుదారునికి అందించిన దాని కాపీతో వ్రాతపూర్వక ప్రకటనను దాఖలు చేయాలని మరియు **31.10.2025 ఉదయం: 10:30 గంటలకు** ప్రిసైడింగ్ ఆఫీసర్/రిజిస్ట్రార్ ముందు హాజరు కావాలని కూడామిమ్మల్ని ఆదేశించారు, లేనియెడల దరఖాస్తు విచారించి మరియు మీకు పరోక్షంగా తీర్మానించబడును.
తేది: **17.10.2025**న ట్రిబ్యునల్ సీలు వేసి మరియు నా సాహస్తాలతో ఇవ్వబడినది.

SEAL

జారీచేయడానికి అధికారం ఉన్న అధికారి సంతకం

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

కాటూరు రోడ్డు ఉయ్యూరు బ్రాంచి (63960)
కాటూరు రోడ్డు, ఉయ్యూరు, కృష్ణాజిల్లా, ఏపి-521165.
E-mail: ubin0563960@unionbankofindia.bank

ఈ వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 సదుపాయము క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకపు ప్రకటన.

ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **కాటూరు రోడ్డు ఉయ్యూరు బ్రాంచి (63960)** కు తనఖా/ఛార్జ్ చేయబడిన, దిగువ వివరించబడిన స్థిరాస్తులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు. దిగువ స్థిరాస్తులను ఈ-వేలం అమ్మకం **"ఎక్కడ ఏది ఉన్నదో, అది ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఖర్చులు/ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే ఈ-వేలం అమ్మకం ద్వారా **ది.14-11-2025**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేదీ: ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు.

ఇ వేలం తేది మరియు సమయం : 14-11-2025, మ॥ 12.00 గం. నుండి సా॥ 05.00 గం. వరకు (10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపులతో)

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: 1. మెస్సర్స్ శ్రీ లక్ష్మీ గోవిందం డెయిరీ, ప్రొ. శ్రీమతి చింతలపాటి శ్రీ లక్ష్మీ పద్మావతి, భర్త: చింతలపాటి హనుమంత రావు, బొడ్డు రాయి దగ్గర, శివాలయం వీధి, పెనమకూరు, తోట్లవల్లూరు (మండలం), ఉయ్యూరు, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. పిన్ కోడ్: 521165. **2. శ్రీమతి చింతలపాటి శ్రీ లక్ష్మీ పద్మావతి,** భర్త: చింతలపాటి హనుమంత రావు, బొడ్డు రాయి దగ్గర, శివాలయం వీధి, పెనమకూరు, తోట్లవల్లూరు (మండలం), ఉయ్యూరు, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. పిన్ కోడ్: 521165. **హామీదారు: 1. శ్రీ చింతలపాటి ఈశ్వర నాగ వెంకట సాయి కృష్ణ,** తండ్రి: చింతలపాటి హనుమంత రావు, డి.నెం. 3-86, బొడ్డు రాయి దగ్గర, శివాలయం వీధి, పెనమకూరు, తోట్లవల్లూరు (మండలం), ఉయ్యూరు, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. పిన్ కోడ్: 521165.
బకాయి మొత్తం: డిమాండ్ నోటీసు తేది **23.11.2022** ప్రకారం **రూ. 8,09,859/-** (అక్షరాల ఎనిమిది లక్షల తొమ్మిది వేల ఎనిమిది వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు దానిపై అదనపు వడ్డీ, ఖర్చులు/చార్జీలతో సహా.

స్థిరాస్తి వివరములు
ఏపి, కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, పెనమకూరు గ్రామం, 3వ వార్డు, ఆర్.ఎస్.నెం.311/2, సమీప డి.నెం.3-86లో గల 280 చ.గ.ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం శ్రీ చింతపాటి ఈశ్వర నాగ వెంకట సాయి కృష్ణ గారికి చెందినది. హద్దులు: **తూర్పు:** జాయింట్ బజార్, **దక్షిణం:** అంబటిపూడి సాంబశివ శర్మ నుండి కొనుగోలు చేసిన హక్కుదారుని స్థలం, **పడమర:** అబ్బూరి లక్ష్మీ సత్యనారాయణ మరియు ఇతరుల స్థలం, **ఉత్తరం:** అంబటిపూడి వెంకట శివయ్య మరియు ఇతరుల స్థలం.

రిజర్వు ధర (రూ.) : రూ. 3,90,000/-, ధరావత్తు ధర (రూ.) : రూ. 39,000/-, బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://baanknet.com** మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్: **https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేదీ నందు బ్రాంచి హెడ్ మొబైల్ నెం. 9912340464, మెయిల్ ఐడి: ubin0563960@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు.

తేది: 15-10-2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: ఉయ్యూరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు:
ఋణగ్రహీతలు: 1ఎ. మెస్సర్స్ శ్రీ మణికంఠ టొబాకో, రిజిస్టర్డ్ ఆఫీస్: డోర్ నెం. 32-7-2, 3వ అంతస్తు, మహేంద్ర ఎన్‌క్లేవ్, చందూరి సరస్వతి వీధి, శిఖామణి సెంటర్, మొగల్రాజపురం, విజయవాడ, ఏపి-520010. **1బి. మెస్సర్స్ శ్రీ మణికంఠ టొబాకో,** గోడౌన్, ప్లాట్ నెం. 234, ఫేజ్- 1 & 2, ఆటో నగర్, గుంటూరు, ఏపి. **1సి. శ్రీ పెనుముచ్చు శ్రీ అవినాష్,** తండ్రి: వెంకట నారాయణ రావు, డోర్ నెం. 1-30, కునికనపాడు, శ్రీ ఆంజనేయ స్వామి గుడి దగ్గర, చెవిటికల్లు, ఎన్.టి.ఆర్ జిల్లా, ఏపి-521180. **సహ-ఋణగ్రహీత/హామీదారు: 2ఎ. శ్రీ అడ్డగడ సదానంద రావు,** తండ్రి: భూషయ్య, డోర్ నెం. 1, అడుసుమల్లి గ్రామం, ప్రకాశం జిల్లా, ఏపి-523169. **2బి. శ్రీమతి అడ్డగడ వెంకాయమ్మ,** భర్త: సదానంద రావు, డోర్ నెం. 1, అడుసుమల్లి గ్రామం, ప్రకాశం జిల్లా, ఏపి-523169.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి మెస్సర్స్ శ్రీ మణికంఠ టొబాకో కి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **అస్సెట్ రికవరీ బ్రాంచి (79170),** సెక్యూర్డ్ క్రెడిటార్, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) క్రింద **ది. 08-02-2018** తేదీన జారీ చేసిన డిమాండ్ నోటీసు ద్వారా అందులో పేర్కొన్న సమయంలోగా బకాయిలు చెల్లించాలని మిమ్మల్ని కోరడమైనది. మీరు ఆ నోటీసులో నిర్దేశించిన గడువులోగా దాన్ని పాటించడంలో విఫలం అయినందున అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6 / 8తో కలిపి **ది. 19-05-2018**న సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. ఈ-వేలం యొక్క తేదీ మరియు సమయం, ఆస్తి యొక్క రిజర్వ్ ధర మరియు ఈ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

అందువల్ల, మీరు అమ్మకపు నోటీసు ప్రచురణ తేదీకి ముందే బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని, తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ చేసిన వ్యయాలతో సహా చెల్లిస్తే, ఆస్తి అమ్మకం కోసం ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు చట్టంలోని సెక్షన్ 13(8) లో పేర్కొన్నట్లుగా మీరు మీ ఆస్తిని విముక్తి చేసుకోవచ్చు.

షెడ్యూల్ ఆస్తి
గుంటూరు జిల్లా, వీజీటీఎం-యూడీఏ, ఏటుకూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, డోర్ నెం. 316/సి, 316/డి మరియు 317/సి, ప్లాట్ నెం. 303 మరియు ప్లాట్ నెం. 304లలో ఉన్న 400.00 చదరపు గజాల విస్తీర్ణం గల నివాస ఖాళీ స్థలం శ్రీమతి అడ్డగడ వెంకాయమ్మ, భర్త: సదానంద రావు గారి పేరున కలదు. (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 20410/2006, ఎస్.ఆర్.ఓ., గుంటూరు). **నివాస ప్లాట్‌కి హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 291 & 292 (68.0 అడుగులు), **పడమర:** 40 అడుగుల వెడల్పు రోడ్డు (68.0 అడుగులు), **ఉత్తరం:** ప్లాట్ నెం. 305 (53.0 అడుగులు), **దక్షిణం:** ప్లాట్ నెం. 302 (53.0 అడుగులు).
2. గుంటూరు జిల్లా, వీజీటీఎం-యూడీఏ, ఏటుకూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, డోర్ నెం. 316/సి, 316/డి మరియు 317/సి, ప్లాట్ నెం. 318 మరియు ప్లాట్ నెం. 319లలో ఉన్న 337.00 చదరపు గజాల విస్తీర్ణం గల నివాస ఖాళీ స్థలం శ్రీ అడ్డగడ సదానంద రావు, తండ్రి: భూషయ్య గారి పేరున కలదు. (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 20407/2006, ఎస్.ఆర్.ఓ., గుంటూరు). **హద్దులు: తూర్పు:** 40 అడుగుల వెడల్పు రోడ్డు (68.0 అడుగులు), **పడమర:** ఇతరుల ఆస్తి (68.0 అడుగులు), **ఉత్తరం:** ప్లాట్ నెం. 317 (44.9 అడుగులు), **దక్షిణం:** ప్లాట్ నెం. 320 (44.3 అడుగులు).

తేది: 30-09-2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

అదాని స్మార్ట్ మీటర్లు, భూ కేటాయింపులపై విచారణ జరపాలి

- ప్రభుత్వానికి ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



రాష్ట్రంలో అదానీ గ్రూపుతో గత ప్రభుత్వాలు చేసుకున్న పలు కీలక ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల అంశంపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఇంధన శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. ఆ వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. ముందున్న ప్రభుత్వం ఎంచుకున్న అదాని స్మార్ట్ మీటర్ల కారణంగా రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులు అధిక ఛార్జీలు భరించాల్సి వస్తోందని, ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండడం బాధాకరమని ఆయన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. విశాఖలోని మధురవాడలో డేటా సెంటర్ ఏర్పాటు ముసుగులో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల విలువైన 270 ఎకరాల కొండ పోరంబోకు భూమిని చట్టవిరుద్ధంగా అదాని గ్రూపునకు కట్టబెట్టిందని తెలిపారు. తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఎపిఎండిసి మధ్యప్రదేశ్‌లోని సులియారీ బొగ్గు గని మైనింగ్ లీజును తీసుకుని కేంద్ర ప్రభుత్వ ప్రమేయంతో ఆ మైనింగ్ పనిని 2021-22లో అదానికి అప్పగించిందని శర్మ తెలిపారు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై పడిన అదనపు ఆర్థిక భారంపై నిష్పాక్షికమైన దర్యాప్తు చేయించాలని కోరారు.

అదానికి అప్పగించిన మైనింగ్ పనిని రద్దు చేసి ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అప్పగించాలని సూచించారు. 2014 నుంచి రాష్ట్రంలో వివిధ ప్రభుత్వాలు అదాని కంపెనీలకు భూములను, ఇతర వనరులను ఉదారంగా కేటాయించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా విషయాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదాని గ్రూప్‌తో జరిగిన అన్ని ఒప్పందాలపై, ముఖ్యంగా స్మార్ట్ మీటర్ల విషయంలో వినియోగదారులపై పడుతున్న అదనపు భారంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, ప్రజాప్రయోజనాలను కాపాడాలని శర్మ తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

తుపాను సహాయక చర్యలపై లోకేష్ సమీక్ష

ప్రజాశక్తి- అమరావతి / నల్లజర్ల

మొంథా తుపాను తీవ్రతపై ఇక్కడి ఆర్‌టిజిఎస్ కేంద్రం నుంచి రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పర్యవేక్షించారు. మంగళవారం అర్ధరాత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో ఆయన మాట్లాడి, సహాయక చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులతో మాటామంతీ

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం గండేపల్లి గ్రామ పరిధిలోని ఎర్ర కాలువ ముంపు ప్రాంత రైతులతో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సెల్‌ఫోన్లో మాట్లాడారు. మంగళవారం స్థానిక ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు గండేపల్లి ఎర్ర కాలువ ప్రాంతంలో పర్యటించారు. ఈ నేపథ్యంలోనే మంత్రి లోకేష్ ఎంఎల్‌ఎకు ఫోన్ చేశారు. తాను ఎర్ర కాలువ ప్రాంతంలో ఉన్నట్లు ఎంఎల్‌ఎ వివరించారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఎతో ఉన్న రైతులతో మంత్రి లోకేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ రైతు మాట్లాడుతూ 2018లో కాలువకు గండ్లు పడ్డాయని, నేటికీ వీటికి మరమ్మతులు చేపట్టలేదని వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాలను దృష్టిలో పెట్టుకుని గండ్లు పడిన చోట ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు తీసుకోవాలని, తద్వారా పంటలను కాపాడుకోవాలని రైతులకు ఆయన సూచించారు. పది వేల మందిని పునరావాస కేంద్రానికి తరలించినట్లు ఎంఎల్‌ఎ మద్దిపాటి వివరించారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మొంథా తుపాను నేపథ్యంలో వాల్తేరు రైల్వే డివిజన్ మార్గాల్లో నడిచే పలు రైళ్లను మూడు రోజులపాటు అధికారులు రద్దు చేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 28న విశాఖ నుంచి బయలుదేరాల్సిన 12727 విశాఖపట్నం - హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్, 22203 విశాఖపట్నం - సికింద్రాబాద్ దురంతో ఎక్స్‌ప్రెస్, 20811 విశాఖపట్నం - నాందేడ్ ఎక్స్‌ప్రెస్, 12739 విశాఖపట్నం - సికింద్రాబాద్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్, 20805 విశాఖపట్నం - న్యూ ఢిల్లీ ఎపి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 17220 విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, 18519 విశాఖపట్నం ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, 12861 విశాఖపట్నం - మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, 18515 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ (రాయగడ నుండి), 11020 భువనేశ్వర్ - ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (భువనేశ్వర్ నుండి), 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (లింగంపల్లి నుండి), 18046 హైదరాబాద్ - శాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (హైదరాబాద్ నుండి), 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (సికింద్రాబాద్ నుండి), 12704 సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (సికింద్రాబాద్ నుండి), 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ (గుంటూరు నుండి), 07165 హైదరాబాద్-భువనేశ్వర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (హైదరాబాద్ నుండి), 17480 తిరుపతి - పూరీ ఎక్స్‌ప్రెస్ (తిరుపతి నుండి), 18522 కడప - విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్ (కడప నుండి) రద్దయ్యాయి. 29న 17220 విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, 18516 కిరండూల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్, 07166 భువనేశ్వర్ - హైదరాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 30న 18520 లోకమాన్య తిలక్ టెర్మినల్ - విశాఖపట్నం ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, 11019 సిఎస్‌టి ముంబై - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 17479 పూరీ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు తెలిపారు.

ఆంధ్ర-బరోడా మ్యాచ్ డ్రా

- నాలుగో రోజు ఆట వర్షార్పణం

విజయనగరం: ఆంధ్ర, బరోడా జట్ల మధ్య విజయనగరం వేదికగా జరగాల్సిన రంజీట్రోఫీ మ్యాచ్ నాల్గో, చివరిరోజు ఆట వర్షం కారణం రద్దయ్యింది. దాదాపు మూడురోజుల ఆట వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. మంగళవారం చివరిరోజు ఆటకు వర్షం అడ్డంకిగా నిలవడంతో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు ఒక్కో పాయింట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో బరోడా 363పరుగులకు ఆలౌట్ కాగా.. ఆంధ్ర జట్టు 2వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసిన అనంతరం మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా నిలిచింది.

పాండిచ్చేరి క్రికెట్ స్టేడియంలో జరిగిన రంజీట్రోఫీ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇరుజట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్ డ్రా అయినా.. ఫాలోఆన్ ఆడుతూ నాల్గో, చివరిరోజు పాండిచ్చేరి జట్టు 5వికెట్ల నష్టానికి 97పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో పాండిచ్చేరి 126పరుగులకే ఆలౌట్ కాగా.. హైదరాబాద్ జట్టు 435పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఈడెన్ గార్డెన్స్ వేదికగా గుజరాత్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో బెంగాల్ జట్టు 141పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టీమిండియా పేసర్ మహ్మద్ షమీ(5/38) బౌలింగ్‌లో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ మూడు వికెట్లతో రాణించిన షమీ.. రెండో ఇన్నింగ్స్‌లోనూ బెంగాల్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు.

నకమురాపై గుకేశ్ గెలుపు

సెయింట్ లూయిస్(అమెరికా): 'చెస్ ఛాంపియన్స్ షోడౌన్ 2025'లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ సత్తా చాటాడు. ఇటీవల తనపై విజయం సాధించి అతి చేసిన అమెరికా గ్రాండ్‌మాస్టర్ హికరు నకమురాపై విజయం సాధించాడు. నకమురా వ్యూహాలను చిత్తు చేస్తూ.. గుకేశ్ నాలుగు పాయింట్లు సాధించాడు. మ్యాచ్ గెలుపొందిన తర్వాత.. గుకేశ్ హుందాగా ప్రవర్తించాడు. నకమురా మాదిరిగా అతడి రాజును ప్రేక్షకుల మీదకు విసరలేదు. సింపుల్‌గా షేక్ హ్యాండ్ ఇచ్చి.. విజేత లక్షణం చాటాడు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది. నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌తో మ్యాచ్‌లో ఓడిన గుకేశ్ తర్వాతి పోరులో నకమురాకు చెక్ పెట్టాడు. అక్టోబర్ తొలి వారంలో చెక్‌మేట్ టోర్నమెంట్‌లో తనను ఓడించిన తర్వాత కింగ్‌ను జనాల్లోకి విసిరి హద్దుమీరిన నకమురాకు ప్రశాంత వదనంతో బదులిచ్చాడు. గోవా వేదికగా అక్టోబర్ 30 నుంచి ప్రారంభం కానున్న చెస్ వరల్డ్ కప్‌లో గుకేశ్ భారత బృందానికి సారథ్యం వహిస్తున్నాడు. చివరిసారిగా గోవాలో అతడు 2019లో కేటగిరీ 'ఏ' చెస్ పోటీల్లో పాల్గొని 10వ స్థానంలో నిలిచాడు.

భౌతిక స్వాధీనత నోటీసు

ICICI Bank | శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తి దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/ భౌతిక స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	మాత గాయత్రి ఆయిల్స్, వంకాయల శ్రీనివాసరావు, వంకాయల లక్ష్మీ శిరీష, వంకాయల కాశీవిశ్వనాథం మరియు వంకాయల శ్రీధర్ కుమార్/ ప్రొప్రైటర్. వంకాయల శ్రీనివాసరావు ద్వారా ప్రాతినిధ్యం, 14 1 35 1 పి ఎస్ రోడ్డు నరసరావుపేట గుంటూరు-522601/ '067905005781, 067955000057 & 067955000032.	ఆస్తి 5 : ఎస్.ఆర్.ఓ., డి.ఆర్.ఓ. నరసరావుపేట మున్సిపల్ పాత వార్డు నం.1, కొత్త వార్డు నం.3, టి.ఎస్.నం.656 ఖాళీ సైట్ పరిధి 94.44 డో.నం.3-1-3 పోతూరి శివాలయం వీధి బ్లాక్ నం.1/8 గ.లు. సైట్. హద్దులు: తూర్పు : ఆర్.శ్యామలాదేవి మరియు ఇతరులు 39.0 అ.లు., దక్షిణం : గల్లి బజారు 20.0 అ.లు., పడమర : సిహెచ్. వెంకటేశ్వర్లు ఇల్లు మరియు సొంత గోడ 46.0 అ.లు., ఉత్తరం: బజారు 20 అ.లు. సైట్ పరిధి 94.44 చ.గ.లు. కు సమానమైన 78.96 చ.మీ.లు. ఖాళీ సైట్ / భౌతిక స్వాధీనతా తేది : 25 అక్టోబరు 2025	August 10,2023 Rs. 5,72,96,242/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 29 అక్టోబరు, 2025, ప్రదేశం : గుంటూరు **అధీకృత సెక్రెటరీ ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున**

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖా కార్యాలయం :** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజుల లోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకోవడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి జరుపవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/ లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	శ్రీలక్ష్మీ ఏజెన్సీస్, అమరనాథ్ కామినేని మరియు కె.వైదేహి/ ప్రొప్రైటర్. అమరనాథ్ కామినేని ద్వారా ప్రాతినిధ్యం, నం.2/17/23/11, ప్రకాశ్ నగర్, మెయిన్ రోడ్డు ఇండియాన్ గ్యాస్ గుంటూరు-522601 / 067905018338	లోన్ డాక్యుమెంట్/ ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం కవర్ చేయబడిన ఆ ఆస్తి ఎస్.ఆర్.ఓ డిఆర్ఓ నరసరావుపేట, నెకరికల్లు మండలం, రూపెనగుంట్ల గ్రామం డో.నం.244/120 స్థలం విస్తీర్ణం ఎ.లు. 0.85 సెంట్లు. హద్దులు (స్థలం కొలిచే ఏరియా ఎ.లు. 0.85 సెంట్లు. కు సమానమైన 0.343 హెక్టార్లు. హద్దులు : ఉత్తరం : పలనాడు నుండి హై వే రోడ్డు, దక్షిణం : ఇర్రిగేషన్ కెనాల్, తూర్పు: నాగోతు బాల సౌరయ్య స్థలం, పడమర : గుంటూరు సొసైటీ దయాశీ స్థలం/ లాంఛనప్రాయ స్వాధీనత తేది : 25 అక్టోబరు, 2025	June 24,2025 Rs. 40,31,679.43/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8 మరియు 9 క్రింద నిబంధనల ప్రకారం ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరిన తర్వాత తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 29 అక్టోబరు, 2025 **అధీకృత సెక్రెటరీ**
ప్రదేశం : గుంటూరు **ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున**

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL: VISAKHAPATNAM
O.A. No. 773/2025

Between:
The Karnataka Bank Ltd. Rep by its Manager, Main Branch, Vijayawada-1 ... Applicant
And
M/s. Ushodaya Offset Printers rep. by its Managing Partner, Smt Thota Vijaya Lakshmi and eight others ... Defendants

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

D1. M/s. Ushodaya Offset Printers, rep. its Managing Partner Thota Vijaya Lakshmi, W/o. Srinivasa Rao, aged about 37 years, Dr. No. 26-3-105, NRP Road, Opp: Post Office, Gandhinagar, Vijayawada-520 003, NTR Dist., Andhra Pradesh.
D2. Thota Vijaya Lakshmi, W/o. Srinivasa Rao, aged about 37 years, Dr. No. 26-3-105, NRP Road, Opp: Post Office, Gandhinagar, Vijayawada-520 003, NTR Dist., Andhra Pradesh.
D3. Udayagiri Bhagyasri ,wife of Mahesh, aged about 32 years, Dr.No.4-113, Bavinenivari St., Near Nagendraswamy Temple, Penamaluru-521 139, Andhra Pradesh.
D4. Issaku Dhanumjeswari, wife of Balaji, aged about 42 years. Dr.No.4-28/4-9-11, Nandipati, Jeevaratnam St., Tenarpet, Chittinagar, Vijayawada - 520 001, NTR Dist., Andhra Pradesh.
D5. Surakattula Anuradha, wife of Nagu, aged about 37 years, Dr. No. 5-6-3-7/2, Pothina Rajagopalarao St., Vijayawada-520 001, NTR Dist., Andhra Pradesh.
D7.Udayagiri Mahesh, son of Babuji, aged about 37 years, Dr.No.4-113, Bhavani St., Near Nagendraaswamy Temple, Vijayawada - 520 001, NTR Dist., Andhra Pradesh.
D8. Surakattula Nagu, son of Krishna, aged about 44 years, Dr. No.5-6-3-7/2, Pothina Rajagopalarao St., Vijayawada - 520 001, NTR Dist., Andhra Pradesh.
Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of debts due to banks and Financial institutions Act, 1993 against you for recovery of loan amount together with current and future interest and other relief's. You are hereby summoned to appear and file written statement before this Tribunal on **13.11.2025 at 10.30 a.m**. or at such time immediately thereafter accordingly to the convenience of Tribunal to answered the claim.
2. A copy of the application is enclosed herewith. The copies of the annexure are also enclosed. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents you may file the same with a list along with the written statement.
4. you should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal in person or by a pleader/Advocate duly instructed.
5. Take notice that in-default of, your appearance on the day mentioned herein before the proceedings will be heard and determine in your absence.
Given under my hand and seal of the Tribunal on this the **6th day of October 2025** at Visakhapatnam.

Signature of the officer
Authorised to issue summons

Chola Enter a better life

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం : "చోలా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
శాఖా కార్యాలయం : డో.నం.59-14-2ఎ, 1వ అంతస్తు, శాంతి ప్లాజా, గాయత్రి నగర్, విజయవాడ-520008.
సంప్రదించాల్సిన నెం.: శ్రీ. తియగరాజన్, మహమ్మద్ రహీస్ , మొబైల్ నం.- 8124000030 / 6374845616

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.
దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టినట్లు సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ తాకట్టు పెట్టిన వారు (లు)కి నోటీసు ఇవ్వబడింది, **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి లాంఛనప్రాయంగా స్వాధీనం తీసుకున్న దాన్ని ఇకపై **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా** ఇక్కడ సూచించబడుతుంది. తాకట్టు ఆస్తులు **"ఏది ఉంటే అదే" "ఉన్నది ఉన్నట్లుగా"** మరియు **"ఎక్కడ ఉన్నాయో అక్కడే"** పద్ధతిలో ఇ-వేలం ద్వారా విక్రయించబడతాయి.
బహిరంగ ఈ-వేలం ను మేము వెబ్‌సైట్ **https://bankauctions.in/** ద్వారా నిర్వహించబోతున్నామని దీని ద్వారా సాధారణ ప్రజలకు తెలియజేయడం జరిగింది.

క్ర సం.	అకౌంట్ నం. మరియు రుణగ్రహీత, సహ రుణగ్రహీత, తనఖాదారుల పేరు	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం మరియు తేది	ఆస్తి/ఆస్తుల వివరణ	రిజర్వు ధర / బయానా మొత్తం / బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం
1	**Loan Account No. HE01GUN00000025449** 1) శ్రీనివాసరావు జొన్న, 2. ఉషారాణి జొన్న, ఇరువురి నివాసం : 9-262-1, సోమసుందర్ పాలెం, తెనాలి, గుంటూరు-522202. 3. ఎస్ఎస్ఆర్ కూల్‌డ్రింక్స్ అండ్ జనరల్ స్టోర్స్, 9-265, రాజనగర్, సోమసుందర్‌పాలెం, తెనాలి, గుంటూరు, ఎపి-522202.	11-03-2025 & Rs.35,38,732/- as on 11-03-2025	**శ్రీమతి. జొన్న ఉషారాణి (సహ దరఖాస్తుదారు) కి చెందిన ఆస్తి :** గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్, జిల్లా, కాటేవరం హామ్లెట్, సోమసుంద్రపాలెం గ్రామ పంచాయతీ ప్రాంతం, కాటేవరం గ్రామం వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.364/1, బయట ఎ.లు. 0-81 సెంట్లు. సోమసుందరపాలెం గ్రామం యొక్క డో.నం.5-21 వద్ద సైట్ పరిధి 140 చ.గ.లు. హద్దులు : **సరిహద్దులు : ఉత్తరం :** పి.డబ్ల్యూ.డి. ఛానల్ రోడ్డు, **తూర్పు :** కొప్పు నాగరాజు సైట్, **దక్షిణం :** నడింపల్లి సుబ్బారావు సైట్, **పడమర :** బండ్రెడ్డి రామారావు సైట్. (లాంఛనప్రాయ స్వాధీనత)	Rs.48,00,000/- Rs.4,80,000/- Rs.50,000/-
2	**Loan Account No. HE01CRA00000018369** 1) సువర్చల యేమినేని, 2. సాంబయ్య యేమినేని, 3. కోటేశ్వరరావు యేమినేని, 4. యేమినేని వెంకటేశ్వరమ్మ, అందరి నివాసం : డో.నం.7-361, కర్లపాలెం, గుంటూరు-522111. 5. ఈవన్ టెప్స్ ఇండియా, డో.నం.17-12, తోటవారిపాలెం, చీరాల, ప్రకాశం, ఎపి-523166.	11-03-2025 & Rs. 40,49,736/- as on 11/03/2025	**యేమినేని వెంకటేశ్వరమ్మ (సహ దరఖాస్తుదారు) కు చెందిన ఆస్తి :** గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, బాపట్ల ఉప జిల్లా, కర్లపాలెం గ్రామ పంచాయతీ ప్రాంతం, కర్లపాలెం గ్రామ డో.నం.7-361, కర్లపాలెం గ్రామం వద్ద ఉన్న స్థలం మరియు భవనం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.580/6, బయట ఎ.లు. 1.05 సెంట్లు. అంశం నం.1 : 5339.25 చ.లిం.లు., ఖాళీ సైట్ హద్దులు : తూర్పు : 2వ అంశం సైట్ 58 లిం.లు., దక్షిణం : కంకిపాటి నాగరాజు సైట్ 94 లిం.లు., పడమర : పంచాయతీ బజారు 55 లిం.లు., ఉత్తరం: షేక్ మస్తానమ్మ దాబా సైట్ 95 లిం.లు. పరిధి 5339.25 చ.లిం.లు.= 254-1 చ.గ.లు.తో కాంపౌండ్ గోడ 200 చ.అ.లు. అంశం నం.2 : 6448 చ.లిం.లు. ఖాళీ సైట్ **హద్దులు : తూర్పు :** కర్లపాలెం రామారావు మరియు ఇతరుల తడి భూమి 37 లిం.లు., **దక్షిణం :** కంకిపాటి నాగరాజు తండ్రి. కంకిపాటి సుబ్బరాజు ఇంటి సైట్ 110 లిం.లు., **పడమర :** అంశం నం.1 సైట్ 51.5 లిం.లు., **ఉత్తరం :** షేక్ మస్తానమ్మ, భర్త. షేక్ బడే సాహెబ్ ఇంటి సైట్ 101 లిం.లు., విస్తీర్ణం 4668 చ.లిం.లు.= 229-9 చ.గ.లు. పై రెండు అంశముల మొత్తం పరిధి ఎ.లు. 0-10 సెంట్లు. లేదా 484 చ.గ.లు. (లాంఛనప్రాయ స్వాధీనత)	Rs.47,00,000/- Rs.4,70,000/- Rs.50,000/-

ఇ వేలం తేది మరియు సమయం : 21.11.2025, ఉ.11.00గం.ల నుండి మ.1.00గం.ల వరకు (ఒక్కొక్కటి 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
ఇఎమ్‌డి సమర్పణ చివరి తేది : 20.11.2025 (సా.5.30గం.ల వరకు) తనిఖీ తేది : 17.11.2025 మరియు 18.11.2025 (ఉ.10.00గం.ల నుండి మ. 1.00గం.ల వరకు)

1.ఆసక్తిగల పాల్గొనేవారు / బిడ్డర్లు అందరూ వెబ్‌సైట్ **https://bankauctions.in & www.cholamandalam.com/news/auction-notices** ను సందర్శించవలసిందిగా అభ్యర్థించబడ్డారు. ఇ-వేలం వివరాలు, సహాయం, ప్రక్రియ మరియు ఆన్‌లైన్ శిక్షణ కోసం, కాబోయే బిడ్డర్లు సంప్రదించవచ్చు సంప్రదించాల్సిన వ్యక్తి : శ్రీ. మహమ్మద్ రహీస్- ఫోన్ నం.8124000030/ 6374845616, మెస్సెర్స్.4 క్లోజర్.; రేఖ, ఫోన్ నెం.8142000062, ఇ మెయిల్ **ChollaAuctionLAP@chola.murugappa.com.**
2. నిబంధనలు మరియు షరతులపై మరిన్ని వివరాల కోసం ఇ-వేలంలో పాల్గొనడానికి **https://bankauctions.in & www.cholamandalam.com/news/auction-notices** ని దయచేసి సందర్శించండి.

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) కింద ఇది చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు కూడా

తేది : 29.10.2025, ప్రదేశం : గుంటూరు జిల్లా **సం/- అధీకృత అధికా, చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

కెజిబివిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

● ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి -గుర్ల

గార్ల మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో మంగళవారం సాయంత్రం విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగింది. సెకెండ్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినుల గదిలో ఒక్కసారిగా మంటలు వచ్చి ఫ్యాన్లు, డార్మిటరీలో పరుపులు కాలిపోవడంతో విద్యార్థులు వెంటనే నీళ్ల జల్లారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎక్కువై పోవడంతో ఐదుగురు వై శ్రావణి , జె.సుజాత, ఇ.వెంకటలక్ష్మి, జి.కృపా సంధ్య, కె.దీక్షిత అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంత 108 వాహనంలో విజయనగరం, నెల్లిమర్ల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుత వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తుపాను నేపథ్యంలో రెండు రోజులుగా భారీ వర్షాలు ఉండడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పాఠశాల ఎస్ఓ జానకి తెలిపారు. చీపురుపల్లి సిఐ శంకర రావు, గుర్ల ఎస్ఐ నారాయణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.కెజిబివి విద్యార్థులు క్షేమంగా ఉన్నారని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు.డార్మెటరీలో పరుపులు అంటుకొని వచ్చిన పొగతో ఐదుగురు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురి అయ్యారని తెలిపారు. వెంటనే వారిని నెల్లిమర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. ఈ సంఘటనపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరా తీశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కట్టెలపొయ్యి కష్టాలు తీరేదెన్నడో..!

● మధ్యాహ్న భోజన కార్మికుల తిప్పలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కట్టెల పొయ్యిలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగతో ఓవైపు.. కట్టెలు దొరక్క మరోవైపు నానాతిప్పలు పడుతున్నారు. బొమ్మనహాల్ మండల కేంద్రంతోపాటు పొన్నూరు, గోవిందవాడ, శ్రీధర్‌ఘట్ట, బొమ్మనహాల్, కల్లుహోళ, దేవగిరి, చంద్రగిరి, లింగదహాల్, గోనేహాల్, నేమకల్లు, ఉద్దేహాల్, తదితర జిల్లా పరిషత్ హైస్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఆయా పాఠశాలల్లో 300 నుంచి 500 మంది దాకా విద్యార్థులు విద్యాభ్యాసం పొందుతున్నారు. వారందరికీ మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిపై తయారు చేయడం నిర్వాహకులకు కష్టంగా మారింది. ప్రభుత్వం మాత్రం గ్యాస్ సిలిండర్లు, పొయ్యిలు సరఫరా చేస్తామని చెబుతోంది తప్ప.. ఆచరణలో మాత్రం శూన్యమని నిర్వాహకులు అంటున్నారు. గ్యాస్‌పొయ్యిలు లేకపోవడంతో కట్టెల పొయ్యిలో వంట చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టెల పొయ్యిల కారణంగా అనారోగ్య బారిన కూడా పడుతున్నామని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ సిలిండర్లు, పొయ్యిలు సరఫరా చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఒంటిమిట్టలో వంద వసతి గదులు

● ముగిసిన టిటిడి పాలకమండలి సమావేశం

ప్రజాశక్తి - తిరుమల: మంగళవారం తిరుమలలో టిటిడి పాలక మండలి సమావేశం టిటిడి ఛైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల బుక్ లెట్‌ను ఛైర్మన్ ఆవిష్కరించారు. సిఎం అదేశాల ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో ఐదు వేల ఆలయాలు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. దేశంలోని అన్ని టిటిడి ఆలయాల్లో అన్నప్రసాదాల వితరణకు ఆమోదం తెలిపారు. రూ. 37 కోట్లతో ఒంటిమిట్టలో వంద గదులతో వసతి సముదాయం నిర్మాణానికి ఆమోదం తెలిపారు. మరో మూడు కోట్లతో ఒంటిమిట్టలో పవిత్రవనం నిర్మాణం ఆమోదం తెలిపారు. టిటిడి గోశాల నిర్వహణపై ప్రత్యేక నిపుణుల కమిటీ ఏర్పాటు చేసేందుకు, తిరుమలలో టిటిడి గదుల బాడుగలు క్రమబద్ధీకరణకు కమిటీ ఏర్పాటుకు అమోదం తెలిపారు. కాణిపాకంలో 25 కోట్లతో టిటిడి అతిథి గృహం, కళ్యాణమండపాలు నిర్మించాలని నిర్ణయించారు. వైకుంఠద్వార దర్శనాలపై నిపుణుల కమిటీ ఏర్పాటుకు బోర్డు చేయాలని నిర్ణయించారు. వైకుంఠద్వార దర్శనాలు గతంలో లాగే 10 రోజులు పాటు నిర్వహిస్తామని, టోకన్లు జారీ విధానంలో అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తామని తెలిపారు. సాధ్యమైనంత ఎక్కువమంది భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటామని నిర్ణయించారు. తెలంగాణ కరీంనగర్‌లో రూ..30 కోట్లతో ఆలయ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. టిటిడి ప్రొక్యూర్‌మెంట్ సెల్‌లో అవకతవకలు జరిగినట్టు గుర్తించామని, ఎసిబితో విచారణ చేయించాలని నిర్ణయించారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

● మహిళ మృతి

ప్రజాశక్తి - అవుకు

అవుకు నుండి తాడిపత్రికి వెళ్లే రహదారిలో అవుకు రిజర్వాయర్ మలుపు వద్ద బనగానపల్లె డిపోకు చెందిన ఆర్‌టిసి అద్దె బస్సును లారీ ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మరో 17 మందికి గాయాలయ్యాయి. వివరాలు.. అవుకు మండలం శివవరం గ్రామానికి చెందిన చాకలి లక్ష్మీదేవి తాడిపత్రిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో తన కోడలు ప్రసవానికి వెళ్లినట్లు సమాచారం తెలియడంతో ఆర్‌టిసి బస్సులో బయల్దేరారు. ఆర్‌టిసి బస్సు అవుకు రిజర్వాయర్ మలుపు వద్దకు చేరుకోగానే తాడిపత్రి నుండి అవుకు వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. బస్సులో ముందుభాగంలో కూర్చున్న లక్ష్మీదేవి (45)కి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే లక్ష్మీదేవి చెల్లెలు, మనవడితోపాటు మరో 15 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో అవుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నలుగురిని మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాగావళి , జంఝావతి నదుల్లో పెరిగిన నీటిమట్టం

కొమరాడ : తుఫాన్ కారణంగా మండలంలోని నాగావళి, జంఝావతి నదుల్లో వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. దీంతో జంఝావతి ప్రాజెక్టు వద్ద రబ్బర్ డ్యాంలో పూర్తిగా కిందకు దించేసి వరద నీటిని దిగువ ప్రాంతానికి అధికారులు విడిచిపెడుతున్నారు. వరద ప్రవాహం ఏ సమయంలోనైనా ఉధృతంగా మారితే ప్రాజెక్టు డెమో దెబ్బతినే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో రబ్బర్ డ్యామును కిందకు దించేసినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలుపుతున్నారు. అలాగే నాగావళి నది ప్రవాహం పెద్దగా పెరగకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

కొనసాగుతున్న ఏనుగుల దాడులు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలంలో గతకొద్ది నెలలుగా వ్యవసాయ పంటలపై ఏనుగుల దాడులు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీలో రైతులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డిలకు చెందిన వరి పంటను తొక్కుకుంటూ వెళ్లి ధ్వంసం చేశాయి. ఎంతో కష్టనష్టాలు పడి పండించిన పంటలపై ఏనుగులు దాడి చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. నష్టపోయిన రైతులకు చెందిన పంటలను అటవీ శాఖ సిబ్బంది పరిశీలించి నష్టపరిహారం అందేలా చేస్తామని చెప్పారు.

ఒడిషా, రాజస్థాన్‌లోనూ భారీ వర్షాలు

భువనేశ్వర్ : మొంథా తుపాను ప్రభావంతో ఒడిషా, రాజస్తాన్‌లోనూ మంగళవారం భారీ వర్షాలు కురిసాయి. ముఖ్యంగా ఒడిషాలోని తీర, దక్షిణ భాగానికి చెందిన 15 జిల్లాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డం, ఇళ్ల ధ్వంసమవ్వడం, చెట్లు కూలడం వంటి ఘటనలతో సాధారణ జనజీవనం స్తంభించింది. మల్కాన్‌గిరి, కొరాపుట్, గజపతి, గంజాం, కంధమాల్, కలహండి, నబరంగ్‌పూర్ జిల్లాలో భారీ వర్షాలు కురిసాయి. గజపతి జిల్లాలో అనక గ్రామ పంచాయతీ పరిధిలోని రహదాదిపై కొండచరియలు విరిగపడడంతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఇదే జిల్లాలో కాశీనగర్ బ్లాక్‌లోని పర్టోడ పంచాయతీ వద్ద లింగ-బరభ రహదారిపైనా కొండచరియలు విరిగిపడ్డాయి.

తుపాను ప్రభావంతో రాజస్తాన్‌లోని బుండి జిల్లాలో నైన్వా వద్ద 24 గంటల వ్యవధిలో 130 మీమీ వర్షపాతం నమోదయింది. ఉదయపూర్, కొటా జిల్లాలోనూ భారీ వర్షాలు కురిసాయి.

కేరళలో ఎనిమిది జిల్లాలకు ఎల్లో అలెర్టు

తుపాను ప్రభావంతో కేరళలోని ఎనిమిది జిల్లాలో బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతవరణ శాఖ హెచ్చరించింది. తిరువనంతపురం, కొల్లాం, పథనంథిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నాకుళం, త్రిస్సూర్ జిల్లాలకు ఎల్లో అలెర్టు జారీ చేసింది.

ఎన్‌డిఎంఎ హెచ్చరికలు

మొంథా తుపాను నేపథ్యంలో మొబైల్ ఫోన్లకు నేరుగా రియల్ టైమ్ హెచ్చరికలను జారీ చేయడాన్ని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిషా వ్యాప్తంగా మంగళవారం ఇలాంటి హెచ్చరికలను జారీ చేసింది.

భారీవర్షాల కారణంగా రహదారులపై విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న సహాయక సిబ్బంది

రైల్వే మంత్రి సమీక్ష

మొంథా తుపాను నేపథ్యంలో రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. తుపాను హెచ్చరికలను అంచనా వేస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారుల్ని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలోవార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, అవసరమైన సామాగ్రి, యంత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

లొంగిపోయిన చంద్రన్న, బండి ప్రకాశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాదరావు ఎలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ ఎలియాస్ శంకరన్న ఎలియాస్ ప్రభాత్ తెలంగాణ డిజిపి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివధర్‌రెడ్డి మాట్లాడుతూ..మావోయిస్టు పార్టీలో ఉన్నవారు వెంటనే జనజీవన స్రవంతిలో కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని కోరారు. జన జీవన స్రవంతిలోకి వచ్చిన వచ్చే మావోయిస్టు నేతలకు పూర్తి రక్షణ కల్పిస్తామని భరోసా కల్పించారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడం, దీర్ఘకాలిక మోకాళ్ల వ్యాధి, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, పార్టీలో ఏర్పడిన సిద్ధాంతపరమైన భేదాభిప్రాయాలు, అంతర్గత విభేదాలు వంటి కారణాలతో చంద్రన్న, ప్రకాశ్ జన జీవన స్రవంతిలో చేరారని తెలిపారు.

లొంగుబాటు కాదు : చంద్రన్న

"మాది లొంగుబాటుకాదు.. అభివృద్ధిలో కలిసి పనిచేయడానికే జనజీవన స్రవంతిలో కలిశాం.. ఇప్పటివరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పోరాటం చేశాం.. భవిష్యత్తులో కూడా అలాగే చేస్తాం.. మా సిద్ధాంతం ఓడిపోలేదు.. ప్రజల మధ్య ఉండి సేవ, పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాం.. ఆయుధాలను పార్టీకే ఇచ్చి జనంలోకి వచ్చాం" అని చంద్రన్న చెప్పారు. ప్రస్తుతం సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవోజి ఎన్నికయ్యారని విలేకరుల అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్న చంద్రన్న.. మావోయిస్టు పార్టీలో 45 ఏళ్ల వివిధ స్థాయిల్లో పనిచేశారు.

6న ఏలూరులో 'సోషలిజం ఆవశ్యకత'పై సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నవంబర్ 6న ప్రపంచ పరిణామాలు - సోషలిజం ఆవశ్యకత అంశంపై ఏలూరులో జరిగే రాష్ట్ర సదస్సుకు సిఐటియు ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు ముఖ్యవక్తగా హాజరై ప్రసంగిస్తారని సిఐటియు ఏలూరు నగర కమిటీ తెలిపింది. ఈ మేరకు సంఘం నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైఎస్.కనకారావు, మంచెళ్ల ఇస్సాకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఐటియు అఖిలభారత మహాసభలు డిసెంబర్ 28 నుండి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో తొలిసారి జరగబోతున్నాయని చెప్పారు. ఈ మహాసభ సందర్భంగా ఉద్యోగ, కార్మిక, కర్షకులకు సోషలిజం ఏ విధంగా ప్రత్యామ్నాయ విధానాలు చూపుతుందో తెలియజెప్పేందుకు రాష్ట్ర సదస్సును ఏలూరులో నిర్వహిస్తున్నామని తెలిపారు.

సహాయక చర్యల కోసం గర్భిణి ఎదురుచూపు

● కలెక్టర్ చొరవతో కదిలిన వైద్య సిబ్బంది

● ఆస్పత్రికి తరలింపు... మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి

ప్రజాశక్తి-మెంటాడ, గజపతినగరం

నిండు గర్భిణీ ..పురిటి నొప్పులతో బాధపడుతుంటే...సహాయం కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూశారు...నదిని దాటే సాహసం చేయలేక .. రవాణా సౌకర్యం లేక..కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అంతలోనే ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్త సురక్షితంగా గజపతినగరం ఆసుపత్రికి అంబులెన్స్‌లో చేర్చగా ఆపరేషన్ చేసి డెలివరీ చేశారు. ఆ తల్లి పండంటి మగబిడ్డకు జన్మనివ్వడం తో కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు.

మెంటాడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన గర్భిణీ మీసాల పార్వతికి వైద్యులు నవంబర్ 20 డెలివరీ తేదీగా ఇచ్చారు. అయితే ఆమెకు మంగళవారం నొప్పులు ప్రారంభమయ్యాయి. చంపావతి నదికి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రికి తరలించేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. నదిని దాటి వెళ్లే సాహసం చేయలేదు. గ్రామానికి 108 వాహనం వెళ్లే పరిస్థితి లేదు. సహాయక చర్యలు కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులకు వైద్యసిబ్బంది అండగా నిలిచారు. ఆండ్ర వరకు గ్రామస్తుల సహకారంతో తీసుకు రాగా. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడి నుండి 108 వాహనం లో వైద్య సిబ్బంది గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో చేర్చి సిజేరియన్ చేశారు. పార్వతి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. సరైన సమయంలో సరైన విధంగా స్పందించి సుఖంతం చేసినందుకు వైద్య సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

పత్తికి పురుగు బెడద

● బర్మ, ఎర్ర పురుగుతో అన్నదాతల ఆందోళన

ప్రజాశక్తి-శింగనమల

పత్తి పంట సాగు చేసిన రైతులు పురుగు బెడదతో భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి పంటలో బర్మ, ఎర్ర పురుగు విజృంభిస్తోంది. పత్తి పంట మొదటి దశ కోతకు వచ్చింది. ఈనేపథ్యంలో వారంరోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు ఈదురు గాలులు, వాతావరణం మేఘావృతం అవుతున్న విషయం తెలిసిందే. దీంతో పత్తిలో బర్మ, పచ్చ పురుగు, పచ్చదోమ, జీడ పురుగులు వంటికి ఆశిస్తున్నాయి. వీటి నివారణకు పలు రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని అన్నదాతలు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 486 హెక్టార్లల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఒక్కో ఎకరాలో పత్తి పంటను సాగు చేయాలంటే సుమారు రూ.30వేలదాకా ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. పంట చేతికి వచ్చిందనుకున్న సమయంలో ఒక్కసారిగా వర్షాలకు పంటలు దెబ్బతినడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని మదనపడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పత్తి పంటను ఆశించే పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కార్పొరేట్ రంగంలో నిశ్శబ్ద విపత్తు

● విరామం లేని పని గంటలు

● ఒత్తిడి, అలసటతో ఉద్యోగులు సతమతం

● మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న వైనం

న్యూఢిల్లీ : భారత కార్పొరేట్ రంగం ఇప్పుడు ఓ నిశ్శబ్ద విపత్తును ఎదుర్కొంటోంది. విపరీతమైన ఒత్తిడి, ఎంత చేసినా తరగని పని కారణంగా ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా అలసటకు గురవుతున్నారు. ఇదో వృత్తిపరమైన సిండ్రోమ్ అని సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థే చెబుతోంది. ఉద్యోగులకు విధి నిర్వహణ వ్యసనంగా మారిపోతోంది. వారు అందులోనే కూరుకుపోయి బయటికి రాలేకపోతున్నారు. పని ప్రదేశంలో తక్షణమే వ్యవస్థాగతమైన సంస్కరణలు చేపట్టని పక్షంలో పరిస్థితి దారుణంగా తయారవుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరించారు.

రెడ్ జోన్‌లో ఉద్యోగులు

ఆవిష్కరణలకు, ఆర్థిక వృద్ధికి ఎంతగానో దోహదపడుతున్న మన కార్పొరేట్ రంగంలో ఇప్పుడు అలసట, ఆందోళన, ఉత్ప్రేరకాలపై మౌనంగా ఆధారపడడం కన్పిస్తున్నాయి. కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఆందోళనకర స్థాయిలో ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని, వారు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ముంబయిలోని సమర్పణ్ మెంటల్ హెల్త్ సంస్థకు చెందిన కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ భక్తి జోషి ఆందోళన వ్యక్తం చేశారు. విరామం లేకుండా పని చేయడం, వృత్తిపరమైన పోటీ కారణంగా ఉద్యోగులు 'రెడ్ జోన్'లోకి వెళ్లిపోతున్నారని ఆమె తెలిపారు.

మాదక ద్రవ్యాలకు బానిసలై...

మన దేశంలో పనిచేసే వయసున్న వారిలో సుమారు 60 శాతం మంది దీర్ఘకాలిక అలసట, అధిక పనిగంటలు, ఉద్యోగ అభద్రత వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. విరామం అనేదే లేకుండా నిరంతరం పనిచేస్తుంటే తమలో వృత్తిపరమైన నైపుణ్యం తగ్గుతోందేమోనన్న అభిప్రాయం కూడా వారిలో కలుగుతోంది. ఐటీ, ఫైనాన్స్, కన్సల్టింగ్, మార్కెటింగ్ వంటి రంగాలలో ఉన్న వారు రోజుకు 14 గంటల వరకూ పని చేస్తుంటారు. ఆ ఒత్తిడిని తట్టుకోవడానికి వారు ఆల్కహాల్, నికోటిస్, నిద్ర మాత్రలకు అలవాటు పడుతున్నారు. ఎగ్జిక్యూటివ్‌లు గతంలో అప్పుడప్పుడూ మాదక ద్రవ్యాలు తీసుకునే వారు. కానీ ఇప్పుడది సర్వసాధారణమై పోయింది. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి నుంచి దూరం కావడానికి మద్యం, సిగరెట్లు, ఉత్ప్రేరకాలు...చివరికి ఓవర్-ది-కౌంటర్ మందులు కూడా తీసుకుంటున్నారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 2019లో ఇచ్చిన ఓ నివేదిక ప్రకారం దేశంలోని పురుషుల్లో మద్యపానం 27.3 శాతం ఉండగా మహిళల్లో 1.6 శాతంగా ఉంది. అయితే ఇది పెరుగుతోంది. ముఖ్యంగా పట్టణాల్లో పని చేస్తున్న వృత్తి నిపుణుల్లో మరింత ఎక్కువవుతోంది.

నిశ్శబ్ద సంక్షోభం

కార్పొరేట్ రంగంలో సమావేశాలు జరిగేటప్పుడు మద్యం సేవించడం షరా మామూలుగా మారింది. ఉద్యోగులు, అధికారుల మధ్య జరిగే చర్చల సందర్భంగా భావోద్వేగాలకు సంబంధించిన వ్యక్తిగత అంశాల ప్రస్తావనే ఉండదు. ఎన్ఐఎంహెచ్ఎఎన్ఎస్ నివేదిక ప్రకారం దేశంలోని పెద్దల్లో సుమారు 10.6 శాతం మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. వీరిలో 70 నుంచి 92 శాతం మందికి తగిన చికిత్స అందడం లేదు. కోవిడ్-19 తర్వాత నిశ్శబ్ద సంక్షోభం మరింత తీవ్రమైంది. ఇంటి నుంచే పని చేసే అవకాశం దక్కిన ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. కార్యాలయ, వ్యక్తిగత స్పేస్ మధ్య సరిహద్దులు చెరిగిపోయాయి. ఫలితంగా పనిగంటలు బాగా పెరిగాయి. దానితో పాటే భావోద్వేగ ఒత్తిడి కూడా పెరిగింది. మహిళా ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది.

సచివాలయమా? వాహనాల పార్కింగ్ స్థలమా?

ప్రజాశక్తి-వాల్మీకపురం

అన్నమయ్య జిల్లా వాల్మీకపురం మండలంలోని విఠలం సచివాలయంలో ఉద్యోగులు ఏకంగా ద్విచక్రవాహనాలను సచివాలయం లోపల పార్కింగ్ చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు సచివాలయాలను ఏర్పాటు చేశారని ప్రశ్నిస్తున్నారు. వివిధ పనులపై సచివాలయాలకు వచ్చే వారికి కనీసం కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు కూడా లేకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండకు, వానకు వాహనాలు దెబ్బతినకుండా సచివాలయం లోపల వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రజలకు వచ్చేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. సచివాలయం లోపల ఎందుకు పార్కింగ్ చేస్తున్నారని అడిగితే మేమంతా.. మా ఇష్టం అని బెదిరిస్తున్నారని, ఉద్యోగులను ఎవరైనా ప్రశ్నిస్తే విధులకు ఆటంకం కలిగిస్తున్నారని కేసులు పెడుతామని బెదిరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఏదైనా పని మీద వెళ్తే గంటలు తరబడి వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ!

● అమెరికా అధ్యక్షులు ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష పదవికి మూడోసారి కూడా తాను పోటీ చేస్తానని ఆ దేశ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. ని, 2028లో ఉపాధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలో తాను పోటీ చేసే వీలే లేదన్నారు. చట్ట ప్రకారం ఒకే వ్యక్తి రెండు పర్యాయాలు మించి అధ్యక్ష పదవి చేపట్టే వీలు లేనందున ఆయన ఈ దఫా ఉపాధ్యక్ష పదవికి పోటీ చేయవచ్చునని కథనాలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ ఈ మేరకు స్పష్టతనిచ్చారు. జపాన్ పర్యటనకు బయలుదేరి వెళ్లే ముందు ట్రంప్ సోమవారం ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడారు. మరో రిపబ్లికన్ కింద ఉపాధ్యక్షుడిగా పనిచేసే ఆలోచన లేదని చెప్పారు. ఆ ఆలోచన 'చాలా అందమైనది' అని వ్యాఖ్యానించారు. ప్రజలు దానిని అంగీకరించబోరని తెలిపారు. 'ఉపాధ్యక్ష పదవికి నేను పోటీ పడవచ్చు. కానీ ఆ పని చేయను. అది సరి కాదు' అని అన్నారు. 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి అమెరికా అధ్యక్ష పదవిని రెండు పర్యాయాలకు మించి చేపట్టే అవకాశం లేదు. అయితే మూడోసారి ఆ పదవిని నిర్వహించాలని 79 సంవత్సరాల ట్రంప్ ఆలోచిస్తున్నారు. అందుకోసం న్యాయ పోరాటానికీ సిద్ధమేనని ఆయన సంకేతం ఇచ్చారు. దీనిపై విలేకరులు ప్రశ్నించగా 'నేను దానిని తోసిపుచ్చుతున్నానా!' అని ఎదురు ప్రశ్న వేశారు. అయితే ప్రస్తుతం ఆ విషయం గురించి నిజంగా ఆలోచించడం లేదని చెప్పారు. 2028లో తన రిపబ్లికన్ వారసులను గురించి మాట్లాడుతూ ఉపాధ్యక్షులు వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో సమర్థులని కితాబు ఇచ్చారు. ఒక గ్రూపుగా ఏర్పడితే వారిని ఎవరూ ఆపలేరని ట్రంప్ అన్నారు.

అరుదైన ఖనిజాల సరఫరాపై అమెరికా, జపాన్ మధ్య ఒప్పందం

టోక్యో : అత్యంత అరుదైన ఖనిజాలు, రేర్ ఎర్త్స్ సరఫరాలకు సంబంధించి అమెరికా, జపాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఆసియా పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం టోక్యోలో జపాన్ నూతన ప్రధాని సానే తకైచీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రేర్ ఎర్త్స్, కీలక ఖనిజాల సరఫరాకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశారు. తకైచీపై ట్రంప్ ప్రశంసలు కురిపిస్తూ ఇదో పెద్ద ఒప్పందమని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాలు గతంలో కంటే బలోపేతం అవుతాయని చెప్పారు. మరోవైపు ప్రపంచ దేశాల మధ్య తలెత్తుతున్న ఘర్షణలను పరిష్కరించడంలో ట్రంప్ చూపుతున్న చొరవను తకైచీ కొనియాడారు. నోబెల్ శాంతి బహుమతికి ఆయనను నామినేట్ చేస్తానని అన్నారు.

నిరసనల సెగ

ట్రంప్ పర్యటనను నిరసిస్తూ జపాన్‌లో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. టోక్యోలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్ల వద్దకు చేరుకొని ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ప్రపంచంలోని నిరంకుశులు మాకు అవసరం లేదు', ట్రంప్, నెతన్యాహూలకు మేము వ్యతిరేకం' అనే నినాదాలతో షింబాషీ స్టేషన్ పరిసరాలు మార్మోగిపోయాయి. టోక్యోలోని మినాటో వార్డ్‌లో షింబాషీ స్టేషన్ ప్రధానమైన రవాణా హబ్. దేశంలోని అతి పురాతన రైల్వే స్టేషన్లలో అది ఒకటి. ట్రంప్ సృష్టిస్తున్న ప్రపంచాన్ని మేము తిరస్కరిస్తున్నామంటూ రాసి ఉన్న ఓ బ్యానర్‌ను నిరసనకారులు ప్రదర్శించారు. సైనిక బడ్జెట్‌ను పెంచుకోవాలన్న నూతన ప్రధాని నిర్ణయాన్ని పలువురు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిర్ణయం వెనుక ట్రంప్ ఒత్తిడి ఉన్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ నుంచి ఆయుధాలను కొనుగోలు చేయవద్దని డిమాండ్ చేశారు.

కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ వేధింపులు

● కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కమర్షియల్ టాక్స్ జాయింట్ కలెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి నాలుగవ తరగతి ఉద్యోగులను ఇష్టానుసారం దూషిస్తూ వేధిస్తున్నారంటూ కమర్షియల్ టాక్స్ ఉద్యోగులు మంగళవారం స్థానిక కట్టమంచి రోడ్డులోని కమర్షియల్ టాక్స్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. వీరి పోరాటానికి ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు జేఏసీ నాయకులు కేవీ రాఘవులు, ఏపీ ఉద్యోగుల సంఘం నాయకులు శివయ్య, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం నాయకులు వినాయక కమర్షియల్ టాక్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలియజేశారు. కమర్షియల్ టాక్స్ ఉద్యోగుల సంఘం నాయకులు పూర్ణ, ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు రాఘవులు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ వీరేంద్రనాథరెడ్డి ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ బూతులు తిడుతున్నాడని, కులం పేరుతో కూడా దూషించడం జరిగిందన్నారు. భరత్, లవ కుమార్ అనే నాలుగో తరగతి ఉద్యోగులపై అనోచితంగా ప్రవర్తిస్తూ కులం పేరుతో దూషించడంతోపాటు దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉద్యోగుల సంఘం నాయకులు కమర్షియల్ టాక్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఢిల్లీలో విమానాశ్రయంలో దగ్ధమైన బస్సు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులను చేరవేసే బస్సు అగ్నికి ఆహుతయ్యింది. 3వ నెంబర్ టర్మినల్‌లో ఎయిర్ ఇండియా విమానానికి కొన్ని మీటర్ల దూరంలో పార్క్ చేసిన ఈ బస్సులో మధ్యాహ్న సమయంలో మంటలు వ్యాపించాయి. అయితే ఆ సమయంలో బస్సులో ఎవరూ లేరు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లు అయ్యింది. ఎఆర్ఎఫ్ఎఫ్ నిపుణుల బృందం బస్సు మంటల్ని అదుపు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టులో కార్యక్రమాలు యథావిధిగా సాగుతున్నట్లు చెప్పారు. అయితే ఈ ప్రమాదంపై ఎస్ఎటిఎస్ దర్యాప్తు ప్రారంభించింది.

ప్రశాంత్ కిశోర్‌కు రెండు చోట్ల ఓటు : ఇసి నోటీసులు

పాట్నా : జన్ సురాజ్ పార్టీ (జెఎస్‌పి) వ్యవస్థాపకులు ప్రశాంత్‌కిషోర్ రెండు రాష్ట్రాల్లో ఓటు కలిగియున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపింది. బీహార్‌లోని కర్గహార్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ, పశ్చిమబెంగాల్‌లోని భవానీనగర్ అసెంబ్లీ స్థానంలో ప్రశాంత్ కిషోర్ ఓటరుగా ఉన్నట్లు ఇసి తెలిపింది. కర్గహార్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆయనకు ఈ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఇద్దరు ఎమ్మెల్యేలు సహా 27 మందిపై ఆర్‌జెడి వేటు

పాట్నా : బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ పలువురు నేతలపై రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) వేటు వేసింది. మహాగట్బంధన్ ప్రకటించిన అభ్యర్థులకు, పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేలు సహా 27 మందిని ఆర్‌జెడి బహిష్కరించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఆ నేతలను ఆరేళ్ల పాటు బహిష్కరించడంతో పాటు, పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి కూడా సస్పెండ్ చేసినట్లు పార్టీ రాష్ట్ర యూనిట్ చీఫ్ మంగని లాల్ మండల్ పేర్కొన్నారు. సరన్ జిల్లాలోని పర్సా నియోజకవర్గ ఎమ్మెల్యే చోటెలాల్ రాయ్, మరో ఎమ్మెల్యే మొహమ్మద్ కమ్రాన్, పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రీతూ జైస్వాల్ సస్పెండైనవారిలో ఉన్నారు. కాగా జెడి(యు) తన సిట్టింగ్ ఎమ్మెల్యే, ఇద్దరు మాజీ మంత్రులు సహా 16 మంది నేతలను బహిష్కరించిన సంగతి తెలిసిందే.

భారత్ విషయంలో ట్రంప్ తప్పిదాలు

- మాజీ మంత్రి రైమాండో విమర్శ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ అవలంబిస్తున్న విదేశీ వాణిజ్య విధానంపై వాణిజ్య శాఖ మాజీ మంత్రి గినా రైమాండో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ సహా కీలకమైన అంతర్జాతీయ భాగస్వాముల విషయంలో ట్రంప్ పెద్దపెద్ద తప్పిదాలు చేస్తున్నారని హెచ్చరించారు. కెన్నెడీ స్కూలుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అమెరికాను ట్రంప్ ఏకాకిని చేశారని, దీంతో అంతర్జాతీయ వ్యవహారాలలో తమ ప్రభావం బలహీనపడిందని చెప్పారు. 'భారత్ విషయంలో మనం చాలా పెద్ద తప్పు చేస్తున్నాము. ట్రంప్ ప్రభుత్వం మన భాగస్వాములందరినీ వదులుకుంటోంది. అమెరికా ఫస్ట్ అనేది ఒకటి. అమెరికా అలోన్ అనేది వినాశకర విధానం' అని తెలిపారు. అమెరికా అవలంబిస్తున్న ప్రస్తుత విధానాలు కీలక ఆర్థిక, వ్యూహాత్మక భాగస్వామ్యాలను దూరం చేస్తోందని విమర్శించారు. యూరప్‌తో పటిష్టమైన వాణిజ్య సంబంధాలు కలిగి ఉండాలని ఆమె ఆకాంక్షించారు. యూరప్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియా దేశాలతో చైనా సత్సంబంధాలు కొనసాగిస్తోందని రైమాండో గుర్తు చేశారు. కాగా జో బైడెన్ ప్రభుత్వంలో ఆమె వాణిజ్య మంత్రిగా పనిచేశారు.

కెన్యాలో కూలిన పర్యాటక విమానం

- 12 మంది మృతి

నైరోబి : కెన్యాలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన విమాన ప్రమాదంలో 12 మంది మృతి చెందారు. ప్రముఖ రిజర్వ్ ఫారెస్టు మాసాయి మారాలోని దయాని నుంచి కిచ్వా టెంబోకు వెళ్తున్న 5వై-సిసిఎ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన పర్యాటక విమానం కౌంటీ క్వాలేకు సమీపంలో కూలిపోయింది. ఈ విషయాన్ని కెన్యా సివిల్ ఏవియేషన్ అథారిటీ (కెసిఎఎ) ఒక ప్రకటనలో వెల్లడించింది. విమానంలో ఉన్న మొత్తం 12 మంది మరణించినట్లు తెలిపింది. ప్రమాదానికి కారణంతో పాటు ఇతర విషయాలపై దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించింది. ఈ విమానం కెన్యా, మొంబాసా దేశాల్లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల మధ్య సర్వీసులు నిర్వహించే ఒక విమానయాన సంస్థదని తెలిపింది.

6.1 తీవ్రతతో టర్కీలో భూకంపం

అంకారా : టర్కీలో భూకంపం సంభవించింది. 6.1తీవ్రతతో భూమి కంపించినట్లు అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం రాత్రి ప్రకంపనలు చోటు చేసుకున్నాయని అన్నారు. పశ్చిమ టర్కీలోని బలికేసర్ ప్రావిన్స్‌లోని సిందిర్గి పట్టణంలో కేంద్రీకృతమైనట్లు విపత్తు మరియు అత్యవసర నిర్వహణ సంస్థ (ఎఎఫ్ఎడి) తెలిపింది. 5.99 కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది.

ప్రతి ఇంటికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

- సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యంగా మహాగట్బంధన్ మేనిఫెస్టో
- మహిళలకు రూ.2,500 సహాయం

మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఆర్‌జెడి అధినేత తేజస్వీ యాదవ్, పవన్ ఖేరా (కాంగ్రెస్), ముఖేష్ సాహ్ని (విఐపి), దీపాంకర్ భట్టాచార్య, (సిపిఐ-ఎంఎల్), అవదేశ్ కుమార్ (సిపిఎం)

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తూ ప్రతిపక్షాల ఐక్య వేదిక మహాగట్బంధన్ తన ఎన్నికల ప్రణాళిక (మేనిఫెస్టో)లో దార్శనిక అంశాలను పొందుపర్చింది. ప్రతి ఇంటికీ ఒక ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) పునరుద్ధరణ, వక్ఫ్ సవరణ చట్టం అమలును రాష్ట్రంలో నిలిపివేత తదితర 25 అంశాలతో ఈ మేనిఫెస్టోను రూపొందించారు. మంగళవారం పాట్నాలో జరిగిన కార్యక్రమంలో 32 పేజీల మేనిఫెస్టోను మహాగట్బంధన్ నాయకులు విడుదల చేశారు. ప్రతి ఇంటికి కనీసం ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని, అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వ ఉద్యోగులుగా పదోన్నతి కల్పిస్తామని తెలిపారు. వితంతువులు, సీనియర్ సిటిజన్లకు రూ.1,500 నెలవారీ పెన్షన్, వికలాంగులకు రూ.3,000 నెలవారీ సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీల దోపిడీని అరికట్టడానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పేద కుటుంబాలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఊరట కల్పిస్తూ పాత పెన్షన్ పథకాన్ని (ఒపిఎస్) పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 136 బ్లాకుల్లో కొత్త కళాశాలలు నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. రైతులు పండించే అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని తెలిపారు. ఉద్యోగార్థులకు, విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఫీజు మినహాయింపు ఇస్తామని, దళితులు, ఆదివాసీలు, అత్యంత వెనుకబడిన తరగతులకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అమల్జేస్తామని మహాగట్బంధన్ తన మేనిఫెస్టోలో భరోసానిచ్చింది. అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోపు ప్రతి ఇంట్లో కనీసం ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చట్టబద్ధమైన కృషి చేస్తామని తెలిపారు. అలాగే వక్ఫ్ సవరణ చట్టాన్ని బీహార్‌లో అమల్జేయబోమని ప్రకటించారు.

మహాగట్బంధన్ సారథిగా ఆర్‌జెడి అధ్యక్షులు తేజస్వి యాదవ్‌ను ఇప్పటికే తమ వేదిక పక్షాన ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించి అధికార పక్షానికి సవాలు విసిరిన ప్రతిపక్షాల వేదిక ఇప్పుడు మేనిఫెస్టోను సైతం అందరికంటే ముందుగా విడుదల చేసి ఎన్నికల కదనరంగాన ముందజలో నిలిచింది. కాగా అధికార జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎ తన మ్యానిఫెస్టోను ఈ నెల 30న విడుదల చేసేవీలుంది. ఈ కార్యక్రమంలో ఆర్జెడి అధ్యక్షులు తేజస్వి యాదవ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా, వికాస్ షీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) నాయకులు, మహాగట్బంధన్ ఉపముఖ్యమంత్రి అభ్యర్థి ముఖేష్ సాహ్ని, సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు అవధేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిగా కుప్పకూలిన శాంతిభద్రతలు : తేజస్వీయాదవ్

ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో బీహార్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని, జెడియు, బిజెపి ప్రజలను కష్టాల సుడిగుండంలోకి నెట్టేశాయని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. మేనిఫెస్టో విడుదల సందర్భంగానూ, సరన్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లోనూ ఆయన ప్రసంగించారు. కష్టాల సుడిగుండంలో చిక్కుకున్న ప్రజలు ఒడ్డుకు చేరాలంటే శాసనసభ ఎన్నికల్లో మహాఘట్బంధన్‌ను గెలిపించడం ఒక్కటే మార్గమని ఆయన పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పునరుద్ధరణకు, ఉద్యోగాల కల్పన కోసం ప్రతిపక్ష ఐక్య వేదిక అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. సరన్ ప్రాంతంలో హత్యలు, దోపిడీలు, అపహరణలు నిత్యకృత్యంగా మారిపోయాయని, రాష్ట్రంలో నేరాలు పెరిగిపోతున్నా.. ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు చీమకుట్టినట్టు కూడా లేదని తేజస్వీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులను పరామర్శించేందుకు కూడా ఆయనకు తీరిక లేకుండాపోయిందన్నారు.

ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి ముప్పు

- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శ

తిరువనంతపురం : కేరళ మరియు ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను చేపట్టాలనే భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) నిర్ణయాన్ని కేరళ సిఎం పినరయి విజయన్ తీవ్రంగా విమర్శించారు. ఈ చర్య "ప్రజాస్వామ్యానికి ముప్పు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసిఐ ప్రకటనను విమర్శిస్తూ మంగళవారం విజయన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ చర్య ఇసిపై సందేహాలను లేవనెత్తిందని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు.

ప్రస్తుత ఓటర్ జాబితాలకు బదులుగా 2002 నుండి 2004 వరకు ఉన్న ఓటర్ల జాబితాల ఆధారంగా సవరణ చేయడానికి ఇసిఐ సన్నాహాలు చేస్తోందని, ఇది 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం మరియు 1960 ఓటర్ల జాబితా నిబంధనలను ఉల్లంఘించడమేనని ఉద్ఘాటించారు. ప్రస్తుత ఓటరు జాబితా ఆధారంగా నవీకరణ చేయాలని చట్టాలు స్పష్టంగా సూచిస్తున్నాయని అన్నారు. కేరళలో స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్నందున ఓటర్లజాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అసాధ్యమని రాష్ట్ర ఎన్నికల అధికారి ఇప్పటికే ఐసిఐకి తెలియజేసినట్లు విజయన్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి హెచ్చరించినప్పటికీ.. ఈ దశలో ఎస్ఐఆర్ చేపట్టడం, ఈ చర్య వెనుక ఇసి ఉద్దేశ్యంపై అనుమానాలను లేవనెత్తుతోందని అన్నారు. 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి మరియు పశ్చిమ బెంగాల్ సహా 12 రాష్ట్రాలు, యుటిల్లో నవంబర్ మరియు ఫిబ్రవరి ఎస్ఐఆర్ రెండవ దశ చేపట్టనున్నట్లు ఇసిఐ సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

జైపూర్‌లో బస్సు దగ్ధం.. ఇద్దరు మృతి

- ఉసురుతీసిన హై-టెన్షన్ విద్యుత్ తీగలు

జైపూర్ : దేశవ్యాప్తంగా బస్సులు తగలబడుతున్న ఘటనలు కొనసాగుతున్నాయి. కర్నూలు ఘటన మరవకముందే రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఒక బస్సు తగలబడింది. వలస కార్మికులతో వెళుతున్న ఈ బస్సుపై హై-టెన్షన్ విద్యుత్ తీగలు తెగిపడటంతో మంటలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నగరంలోని సవాయి మాన్ సింగ్ ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం తెలుసుకొని ప్రమాదస్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. 25 మందిని రక్షించారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..

ఉత్తరప్రదేశ్‌లోని బరేలీకి చెందిన కొంత మంది వలస కార్మికులు రాజస్తాన్‌లోని తోడిలోని ఇసుకబట్టీలో పని చేయడానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను తండ్రి, కుమార్తెలు నసీం(50), సహినం(20)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడినవారిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ ప్రమాదంలో బస్సుపై భాగంలో ఉంచిన కార్మికుల వస్తువులతో పాటు, బస్సు వెనుక ఉన్న ద్విచక్రవాహనం కూడా దగ్ధమయ్యాయి. కాగా, ఈ హై-టెన్షన్ విద్యుత్ తీగలు గురించి కొన్ని రోజుల క్రితమే స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మరమ్మతులు చేయాలని కోరారు. కానీ వారు స్పందించలేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఈ సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ నెల 15న రాజస్తాన్‌లోని జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్‌కు వెళుతున్న ఒక ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగి 20 మంది సజీవదహనమైన సంగతి విదితమే.

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయొచ్చు

- హైకోర్టు



ప్రజాశక్తి-అమరావతి

సర్వీసు రూల్ లేకపోయినా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేపట్టవచ్చునని హైకోర్టు వెల్లడించింది. ఆ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ తర్వాత సర్వీస్ రూల్స్ రూపొందిస్తే, అవి పూర్వ తేదీ నుంచి అమలు చేయరాదని తెలిపింది. గ్రామ సచివాలయాల్లో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (విహెచ్ఎ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి, ఉద్యోగ అర్హతలను వెనక్కి తీసుకోవడం చెల్లదని పేర్కొంది. నోటిఫికేషన్ జారీ అయ్యాక మధ్యలో ఆ రూల్స్‌ను మార్పు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాతపరీక్షకు హాజరైన అభ్యర్థుల మెరిట్ లిస్ట్ ఇప్పటికీ ప్రచురించకపోతే తిరిగి తాజా జాబితా పబ్లిష్ చేయాలని ఆదేశించింది. ఫలితాలను చట్ట ప్రకారం ప్రాసెస్ చేయాలని తెలిపింది. ఇప్పటికే ఎంపికైన అభ్యర్థుల మెరిట్ కంటే పిటిషనర్లు సాధించిన మెరిట్ ఎక్కువగా ఉంటే, సీనియారిటీ మొత్తం మెరిట్ ఆధారంగా నిర్ణయించాలని పేర్కొంది. ఇప్పుడు భర్తీ అయిన పిటిషనర్లు కేవలం నోషనల్ సీనియారిటీని మాత్రమే కోరగలరని చెప్పింది. తీర్పు వెలువడిన 12 వారాల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ తీర్పు చెప్పారు.

నాలుగు వేల గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం 2019 జులైలో నోటిఫికేషన్ ఇచ్చి 2,217 పోస్టులను మాత్రమే భర్తీ చేసింది. మిగిలిన 1,783 పోస్టుల భర్తీకి 2020 జనవరిలో మరో నోటిఫికేషన్ ఇచ్చింది. 2019 నోటిఫికేషన్‌లోని అర్హతలను మార్పు చేసింది. అప్పటికే హార్టికల్చర్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో చేస్తున్న తాము బిఎస్‌సి (వ్యవసాయం) చదివామని, తమను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరడంతో వీరికి కూడా అవకాశం కల్పిస్తూ 2020 మేలో ప్రభుత్వం మెమో జారీ చేసింది. ఇదే సమయంలో 2020 జూన్‌లో ఎపి హార్టికల్చర్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌ను ప్రభుత్వం తెచ్చింది. సర్వీసు రూల్స్ అమల్లోకి రావడంతో 2020 సెప్టెంబర్ 20న రాష్ట్రం 30.1.2020న జారీ చేసిన సవరణను, 2020 మేలో జారీ చేసిన మెమోను ఉపసంహరించింది. ఆ సవరణ, మెమోలో నిర్దేశించిన అర్హతలు సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకుంది. 25.9.2020న మిగిలిన 1,783 పోస్టుల భర్తీకి రాతపరీక్ష నిర్వహించింది. జనవరి 30న జారీ చేసిన సవరణను, అలాగే మేలో జారీ చేసిన మెమోను ప్రభుత్వం ఉపసంహరించుకోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు తీర్పు వెలువరించింది.

జలమార్గాల అభివృద్ధికి ఒప్పందం

- మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియాతో ఎపి ఇన్ వాటర్ వేస్ అథారిటీ కుదుర్చుకున్న ఒప్పందం వల్ల రాష్ట్రంలో అంతర్గత జల మార్గాల అభివృద్ధికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. ముంబయిలో జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్-2025లో భాగంగా మంగళవారం ఈ ఒప్పందం జరిగినట్లు మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అంతర్గత జలమార్గాల అభివృద్ధితో సరుకు రవాణా వ్యయం భారీగా తగ్గనుందని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.150 కోట్లకుపైగా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు సముఖత వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం వెస్సెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (విటిఎంఎస్), నావిగేషనల్ ఎయిడ్‌లను అందించాల్సి ఉండగా, రివర్ క్రూయిజ్ టూరిజం విటిఎంఎస్‌కు ఆన్‌షోర్ సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం భూమిని కేటాయించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, విశాఖ పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

కావేరి ట్రావెల్ బస్సు డ్రైవర్‌కు 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

బస్సు ప్రమాద సంఘటనలో కావేరీ ట్రావెల్ డ్రైవర్ మిరియాల లక్ష్మయ్యకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ మేరకు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున చెట్లమల్లాపురం గ్రామ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై జరిగిన బస్ ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. ఈ కేసు విచారణ అధికారి పత్తికొండ డిఎస్‌పి వెంకట్రామయ్య క్షుణ్ణంగా విచారించారు. ఈ సంఘటనలో నిందితుడైన డ్రైవర్ లక్ష్మయ్యను మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

వసతి గృహ విద్యార్థుల సంరక్షణపై దృష్టి

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను నుంచి బిసి వసతి గృహాలు, ఎంజెపి స్కూళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల సంరక్షణపై దృష్టి సారించాలని అధికారులను బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత ఆదేశించారు. తుపాను తీవ్రంగా ఉండే ప్రాంతాల్లోని విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, ఎంజెపి పాఠశాలల కార్యదర్శి మాధవీలతతో ఆమె మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుపాను నేపథ్యంలో బిసి హాస్టళ్ల విద్యార్థుల రక్షణకు తీసుకున్న చర్యల గురించి జిల్లాల వారీ మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వార్డెన్లు, ఎబిసిడబ్ల్యుఒలు, ప్రిన్సిపల్స్ 24 గంటలూ వసతి గృహాలు, పాఠశాలల్లోనే ఉండటంతోపాటు, రాత్రి వేళల్లో విద్యార్థులతో కలిసి నిద్రపోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే అందించాలని సూచించారు. విద్యుత్ కోతలు ఉండే అవకాశం ఉందని, ఇన్వెర్టర్లను పొదుపుగా వాడుకోవాలని, టార్చిలైట్లు, క్యాండిల్స్, అగ్గిపెట్టెలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. వసతి గృహాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లించాలని సూచించారు.

రబీ సీజన్‌లో ఎరువుల రాయితీకి కేంద్ర మంత్రివర్గ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రబీ సీజన్ (అక్టోబర్ 2025 - మార్చి 2026) కోసం ఫాస్పరస్, పొటాషియం (పి అండ్ కె) ఎరువులపై పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్ బిసి) రేట్లను నిర్ణయించడానికి ఎరువులశాఖ చేసిన ప్రతిపాదనలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇందుకోసం రూ.37,952.29 కోట్లు కేటాయించింది. నైట్రోజన్‌పై కిలోకు రూ.43.02, ఫాస్పర్ట్ పై కిలోకు రూ. 47.96, పొటాష్ పై కిలోకు రూ. 2.38, సల్ఫర్ పై కిలోకు రూ 2.87 రాయితీ వర్తింపజేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. డై అల్యూమినియం ఫాస్ఫేట్ (డిఎపి), మోనో అల్యూమినియం ఫాస్ఫేట్ (ఎంఎపి), మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ (ఎంఒపి), ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ (టిఎస్ పి), 3 గ్రేడ్స్ ఆఫ్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్ పి), పొటాష్ డెరైవ్డ్ మొలాసెస్ (పిడిఎం), అల్యూమినియం సల్ఫేట్ (ఎఎస్) వంటి దాదాపు 28 ఎన్‌పికెఎస్ కాంప్లెక్స్ ఫర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలకు పోషకాధిరత రాయితీ అమలు చేయాలని నిర్ణయించింది.

రీకోడ్ కేరళ సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్

10 లక్షల మందికి ఎఐ టెక్నాలజీలో శిక్షణ

- 2030 నాటికి దేశ ఐటి మార్కెట్‌లో 10 శాతం వాటా
- దార్శనిక లక్ష్యాలతో కేరళ రీకోడ్ సదస్సు

తిరువనంతపురం : కేరళను ఐటి రంగంలో పరుగులు పెట్టించేందుకు అక్కడి వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం వినూత్న కార్యాక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో కనీసం పది లక్షల మందికి ఎఐలో శిక్షణ ఇవ్వడం సహా ఆధునాతన సాంకేతికత అంశాల్లో రాష్ట్ర పురోగతి5కి సమాలోచనల నిమిత్తం 'రీకోడ్ కేరళ - 2025' పేరిట మంగళవారం నాడు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక నాణ్యత, ఇంటర్నెట్ కనెక్టివిటీ, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వినూత్న డిజిటల్ పర్యావరణ వ్యవస్థను సృష్టించే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి దేశ ఐటి మార్కెట్‌లో కేరళ వాటా 10 శాతం (50 బిలియన్ డాలర్లు) సాధించే విధంగా లక్ష్యాలు నిర్దేశించుకున్నట్లు తెలిపారు. అలాగే ఐటి సైన్స్ రంగాల్లో కనీసం 5 లక్షల ఉన్నత స్థాయి ఉద్యోగాలు సృష్టించడం, 120 గ్లోబల్ సామర్థ్య కేంద్రాల ఏర్పాటు, కనీసం 10 లక్షల మందికి ఎఐ వంటి అత్యాధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి అవసరమైన కార్యాచరణను ఈ సదస్సులో రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు.

పుత్తూరులో జంతుప్రదర్శనశాల ప్రారంభం

త్రిశూర్ : వన్య ప్రాణులు సహజ సిద్ధంగా ఎలాంటి వాతావరణంలో నివసిస్తాయో అదే తరహాలో ప్రత్యేక డిజైనింగ్‌తో నెలకొల్పిన దేశంలోనే తొలి డిజైనర్ జూలాజికల్ పార్కును కేరళలో ప్రారంభించారు. పంజరాలు, క్లోజ్డ్ సర్క్యూట్స్‌లో బంధించకుండా ప్రకృతి సిద్ధంగా వన్య ప్రాణులు ఎలా సంచరిస్తాయో..అలాంటి వాతావరణాన్ని సృష్టించి నెలకొల్పిన ఈ ప్రత్యేక డిజైనింగ్ పార్కును త్రిశూర్‌లోని పుత్తూరులో అభివృద్ధి చేశారు. రూ.378.92 కోట్లతో నిర్మించిన ఈ పార్కును మంగళవారం నాడు ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రజలకు అంకితం చేశారు. 140 ఏళ్ల కిందట నెలకొల్పిన త్రిశూర్ జంతు ప్రదర్శనశాలను పుత్తూరులో 336 ఎకరాల సువిశాల ప్రాంతంలో పునరాభివృద్ధి చేశారు. వన్య ప్రాణుల జీవవైవిధ్యాన్ని పరిరక్షించేలా ప్రత్యేక వ్యవస్థలు, సదుపాయాలతో పార్కును తీర్చిదిద్దారు.

బీహార్‌లో నిరుద్యోగం, పేదరికంపైనే చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల వేడిలో ఉంది. అయితే అక్కడ నిరుద్యోగం, తీవ్ర పేదరికం చర్చనీయాంశాలుగా మారాయి. 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వాలు ఉన్నప్పటికీ నిరుద్యోగం, పేదరికాన్ని పరిష్కరించకపోవడమే ఎన్‌డిఎ ప్రధాన వైఫల్యమని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. 15-29 సంవత్సరాల వయసు గలవారిలో నిరుద్యోగిత రేటు 23.2 శాతం ఉంది. ఇది జాతీయ సగటు 15.9 శాతం కంటే ఎక్కువ. పనికోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారి సంఖ్యలో యుపి తరువాత బీహార్ రెండో స్థానంలో ఉంది. బీహార్ జనాభాలో 54.27 శాతం మంది వ్యవసాయం సహా ప్రాథమిక రంగంలో ఉపాధి పొందుతున్నారు. అయితే, రాష్ట్ర జిడిపిలో ప్రాథమిక రంగం వాటా కేవలం 19.9 శాతం ఉంది. ఉద్యోగుల్లో 8.5 శాతం మంది మాత్రమే శాశ్వత ఉద్యోగాల్లో ఉన్నారు. ఉపాధి భాగస్వామ్య రేటు 43.6 శాతంగా ఉంది. ఇది జాతీయ సగటు 56 శాతం కంటే చాలా తక్కువగా ఉంది. మహిళల ఉపాధి భాగస్వామ్య రేటు కేవలం 15.6 శాతంగా ఉంది.

తీవ్ర పేదరికం బీహార్ ఎదుర్కొంటున్న మరో సంక్షోభం. జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.1.07 లక్షలు కాగా, బీహార్‌లో కేవలం రూ.32,174గా ఉంది. 2021 గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో 33.76 శాతం మంది తీవ్ర పేదరికాన్ని అనుభవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక కుటుంబం సగటు నెలవారీ ఖర్చు రూ.3,788 కాగా, పట్టణ ప్రాంతాల్లో ఇది రూ.5,165గా ఉంది. ఈ గణాంకాలు ఎన్‌డిఎ ప్రభుత్వ వైఫల్యాన్ని తెలియజేస్తున్నాయి.

ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణతో ఎన్నికల సంఘం 68.66 లక్షల ఓట్లను ఓటర్ల జాబితా నుండి తొలగించింది. మైనార్టీలు ఎక్కువగా ఉన్న సీమాంచల్ జిల్లాల్లో ఎక్కువ మందిని తొలగించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 27 వేల ఓట్లు తొలగించారు. తొలగించిన ఓట్ల సంఖ్య 2020 అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు మూడో వంతు నియోజకవర్గాల్లో గెలిచిన అభ్యర్థుల మెజారిటీ కంటే ఎక్కువగా ఉన్నాయి. రీ-వెరిఫికేషన్‌తో దళితులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు ఎక్కువగా తొలగించబడ్డారని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. అత్యధిక ఓట్లు గోపాల్‌గంజ్, కిషన్‌గంజ్, పూర్నియా, మధుబని, భాగల్‌పూర్ జిల్లాల్లో తొలగించారు. ఈ జిల్లాలు నేపాల్, బెంగాల్ సరిహద్దులో ఉన్నాయి. అంతేకాకుండా పెద్ద సంఖ్యలో ముస్లిం జనాభాను కలిగి ఉన్నాయి. గోపాల్‌గంజ్‌లో 18.07 లక్షల (12.13 శాతం) ఓట్లు తొలగించారు. ఇక్కడ ముస్లిం ఓటర్లు 17 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు. బీహార్‌లోని ఏకైక ముస్లిం మెజారిటీ జిల్లా (68 శాతం ముస్లిములు) కిషన్‌గంజ్‌లో 9.69 శాతం ఓట్లు తొలగించారు. 39 శాతం ముస్లిం ఓటర్లు ఉన్న పూర్నియాలో 8.41 శాతం ఓట్లు తొలగించారు.

చలికి గజ...గజ

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే' అని ప్రధానోపాధ్యాయుడు కొండలరావు తెలిపారు. వర్షాకాలంలో ఈ ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని వార్డెన్ ప్రవీణ్ తేజ చెప్పారు.

ఆరుబయటే భోజనాలు

డుంబ్రిగుడ మండలం కించుమండ, కిల్లోగూడ, సొవ్వా, గుంటసీమ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనశాలలు లేక ఆరుబయట భోజనాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో తడుస్తూ ప్లేట్లలో భోజనాలు తీసుకొని వసతి గదుల వద్దకు వెళ్లి తింటున్నామని పలువురు విద్యార్థులు తెలిపారు. అరకులోయలోని ఆదిమ జాతి గిరిజన గురుకుల (పివిటిజి) వసతి గృహంలో 661 మంది ఆదిమ జాతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 56 మరుగుదొడ్లలో సగం నిరుపయోగంగా ఉన్నాయి. ఒక బ్లాక్‌లోని మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేదు. మరో బ్లాక్‌లోని మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లు సరిపోక ఆరుబయట మలవిసర్జనకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. బెడ్లు ఉన్నప్పటికీ ఏర్పాటు చేయడానికి రూము సరిపోక ఒక్కొక్క మంచంపై ఇద్దరు నిద్రిస్తున్నారు. సరిపడా డార్మెటరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. తరగతి గదులు వర్షానికి కారుతున్నాయి. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. 'మరుగుదొడ్ల నిర్వహణకు డబ్బులు ఇవ్వడం లేదు. కొన్నే పని చేస్తున్నాయి. మాకు నెలవారీ చెల్లించే రూ.6 వేలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు' అని మరుగుదొడ్ల నిర్వాహకురాలు లక్ష్మి తెలిపారు.

అలంకారప్రాయంగా సోలార్ వాటర్ హీటర్లు

గిరిజన వసతి గృహాల్లో ఆరేళ్లుగా సోలార్ వాటర్ హీటర్లు పనిచేయడం లేదు. ఆశ్రమ విద్యార్థుల స్నానాల కోసం వేడి నీళ్లు అందించడానికి వీటిని 2013-14లో సుమారు కోటిన్నర వ్యయంతో ఏర్పాటు చేశారు. మొత్తంగా పాడేరు ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లు అమర్చేందుకు అవకాశం ఉన్న 87 ఆశ్రమ పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో పెట్టారు. ఇవి మూడేళ్ల ముచ్చటగానే మారాయి. 2019 నాటికి పూర్తిగా మూలకు చేరాయి. నిర్వహణ లోపమే ఈ సోలార్ హీటర్ల వైఫల్యానికి కారణంగా తెలుస్తోంది. అవి అందుబాటులోలేక విద్యార్థులు గజగజ వణికించే చలిలో శీతాకాలం చన్నీళ్ల స్నానాలు చేసేందుకు వెనుకాడుతున్నారు. చర్మవ్యాధులకు గురవుతున్నారు. 'చన్నీళ్ల స్నానం చేయలేకపోతున్నాం. ఉదయాన్నే స్టడీ అవర్స్‌కు తరగతిలోకి వెళ్లడానికి వేకువ జామున స్నానాలు చేయాలి. ట్యాంకులో వాటర్ చాలా చల్లగా ఉంటోంది. రోజు విడిచి రోజు మధ్యాహ్నం, సాయంత్రం పూట స్నానాలు చేస్తున్నాం' అని లోచలిపుట్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థి చెప్పారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

హాస్టళ్లలో సమస్యలను పరిశీలిస్తున్నాం. ఇప్పటికే సగానికిపైగా సందర్శించాను. సక్రమ నిర్వహణకు అవసరమైన సూచనలు చేశాం. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. పరిష్కారానికి చర్యలు చేపడతాం.

-పిబికె.పరిమళ, టిడబ్ల్యు డిడి, పాడేరు ఐటిడిఎ, అల్లూరి జిల్లా

మీకోసం

వెండి సామగ్రి, ఆభరణాలు ఉంచేచోట కర్పూరం బిళ్లలను ఉంచితే అవి నల్లబడకుండా ఉంటాయి.

జీవన సౌరభం

మనం చేసే పనులవల్లే, గొప్పవాళ్లమవుతాం, పుట్టుకతో కాదు.

నేనెప్పుడూ

భూగోళంతో బొంగరం ఆట
ఆడుకుంటాను నేనెప్పుడూ
నక్షత్రాలతో రంగవల్లులను
గీసుకుంటాను నేనెప్పుడూ
నీటి తుంపరలతో ఇంద్రధనస్సులను
పేర్చుతుంటాను నేనెప్పుడూ
కాగితాలతో కత్తి పడవలను
చేసుకుంటాను నేనెప్పుడు
టావెల్ చుట్టి సూపర్ మాన్ లా
ఎగురుతుంటాను నేనెప్పుడూ
జామ చెట్టుకు మామిడి చెట్టుకు
కాపలా దొంగను నేనెప్పుడు
టక్కరికొంగ చేపలు తింటే
చాక్లెట్ తింటా నేనెప్పుడూ
కోతి బావలూ కొబ్బరి తింటే
బిస్కెట్ తింటా నేనెప్పుడూ
కొండముచ్చులను కొట్టి తరుముతూ
కొమ్మలు ఊగుతా నేనెప్పుడూ
చెంబుడు నీళ్లను చెట్టుకు పోసి
పెంచుతుంటాను నేనెప్పుడూ
అంకుల్ ఆంటీలు చుట్టుముట్టితే
చిలుకలా పలుకుత నేనెప్పుడూ
పలక బలపం పెన్ను పేపరు
పట్టుకు తిరుగుత నేనెప్పుడూ
బడికి వెళ్ళమని అమ్మకోరితే
శ్రద్ధగ చదువుత నేనెప్పుడూ

– చింతల శ్రీనివాస గుప్త,
నిజామాబాద్,
94400 37125.

నేను గీసిన బొమ్మ

కె.ఝాన్సీలక్ష్మి,
8వ తరగతి, జెడ్‌పిహెచ్ స్కూల్,
వడ్డేశ్వరం, గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చితి మంటల వెలుగుల్లో జీవితపాఠాలు నేర్చుకుంటోంది..

కొన్ని ప్రయాణాలు ఎంపికచేసుకున్నవి కావు. అవసరాలు వాటిని నిర్దేశిస్తాయి. పశ్చిమబెంగాల్ బిరుభమ్‌కి చెందిన తుంపాదాస్ జీవితం అందుకు ఉదాహరణ. నర్సుగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వర్తించే ఆమె అనుకోని పరిస్థితుల్లో కాటికాపరి పని చేయాల్సి వచ్చింది. ఈ పనిచేయడానికి పురుషులే వెనుకాడే పరిస్థితులు ఉంటాయి. కానీ ఆమె దశాబ్దకాలంగా ఈ పనిలో నిమగ్నమైంది. ఇప్పటివరకు 5000కి పైగా శవాలకి దహనసంస్కారాలు నిర్వర్తించింది. 'ఈ పని చేస్తున్నప్పుడు నీకు భయం లేదా? అని ఎవరైనా ప్రశ్నిస్తే.. 'ప్రస్తుత సమాజంలో ప్రాణమున్న మనుషులని చూస్తేనే భయమేస్తోంది. మృతదేహాలని చూస్తే కాదు' అని సమాధానమిస్తోంది. ఇంత లోతైన జవాబు వెనుక, ఆమె జీవితంలో చూసిన, ఎదురైన పరిస్థితులే కారణం.

బిర్భుమ్‌లోని పురందర్‌పూర్ స్మశానవాటికలో ఉదయం 8 గంటలకి తుంపా దినచర్య ప్రారంభమవుతుంది. రాత్రి పొద్దుపోయేదాకా ఆమె అక్కడే ఉంటుంది. తండ్రి మరణించిన తరువాత వారసత్వంగా వచ్చిన ఈ పనిని తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె ఎంపికచేసుకుంది. 2014లో తుంపా తండ్రి చనిపోయాడు. అప్పటికే ఆమె నర్సింగ్ బాధ్యతల్లో ఉంది. తండ్రి మరణం ఆ కుటుంబానికి పెద్ద లోటు. తండ్రి కూతుళ్లు ఇద్దరు

సంపాదిస్తే గాని ఇల్లు గడవని పరిస్థితి. ఈ స్థితిలో తుంపా తన నర్సింగ్ జాబ్‌నే కొనసాగించవచ్చు. కానీ తండ్రి తరువాత ఆ ఉద్యోగం తమ కమ్యూనిటీలో ఎవరో ఒకరు చేయాలి. అయితే ఎవరో అపరిచితులు తండ్రి స్థానంలో పనిచేయడం తుంపాకి నచ్చలేదు. అందుకే అప్పటివరకు తమ కమ్యూనిటీలో పురుషులు మాత్రమే చేసిన ఈ పని చేసేందుకు ముందుకు వచ్చింది.

ఎన్నో అవమానాలు.. నిందలు..

స్మశానంలో చితి కాలుతున్నప్పుడు వచ్చే విపరీతమైన వేడి, దట్టమైన పొగ, అంతులేని దు:ఖాన్ని చూసి మొదట్లో తుంపాకి చాలా కష్టంగా అనిపించేది. కానీ కుటుంబాన్ని ఆదుకోవాలంటే అవన్నీ భరించాల్సిందే అని సర్దిచెప్పుకుంది. అయితే ఈ బాధల కంటే సమాజం నుండి ఆమెకి ఎదురైన అవమానాలు, నిందలే ఎక్కువ. 'మహిళవి అయ్యుండి ఈపని చేస్తావా?' అని బంధువులు రాబందుల్లా పీక్కుతిన్నారు. తనపై పెద్ద కళంకం పడిందని కుటుంబసభ్యులు భయపడిపోయారు. అయితే పెద్ద పెద్ద దుంగలు స్వయంగా ఎత్తుకుని రావడం, చితి పేర్చడం, శవం కాలే వరకు దాదాపు 3 గంటలు చితి పక్కనే ఉండడం విధిగా చేస్తున్న ఆమె సమర్థత ఆ తరువాత కాలంలో తనపై నిందలు వేసిన వారితోనే గౌరవమర్యాదలు పొందేలా చేసింది.

సత్కర్ కర్మిగా..

కాటికాపరి పనినే పశ్చిమబెంగాల్‌లో సత్కర్ కర్మిగా పిలుస్తారు. 2019 నుండి తుంపా పనిచేసే స్మశాన వాటికలో క్రిమేషన్ మిషన్‌ని ఉపయోగిస్తున్నారు. ఈ పనిని కూడా తుంపా ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తోంది. మృతుల వివరాలని పట్టికలో నమోదుచేయడం, క్రిమేషన్ మిషన్ చెక్ చేయడం, చేతులకి, ముఖానికి మాస్క్ పెట్టుకొని శవాన్ని పంపించడం, క్రిమేషన్ తరువాత శవం తాలూకు బూడిదని బంధువులకి అప్పగించడంతో ఆమె ఒక దశ పని పూర్తవుతుంది. ఆ తరువాత మరో క్రిమేషన్ కోసం అక్కడంతా శుభ్రం చేయడంతో రెండో దశ మొదలవుతుంది. ఇలా రోజంతా ఒకదాని తరువాత ఒకటి వచ్చే శవాల కోసం ఆమె కష్టపడుతుంది.

తన ప్రయాణం గురించి తుంపా ఏం చెబుతుందంటే.. 'ఈ పని మొదలుపెట్టినప్పుడు శవాలు తీసుకొచ్చిన బంధువులతో స్మశానంలో బారులు తీరిన క్యూలు ఉండేవి. అప్పుడు చాలా భయమేసేది. ఎన్నో నిద్రలేని రాత్రుళ్లు గడిపాను. నా చుట్టూ ఘాటైన పొగ ఉండేది. చితి పేర్చి శవం కాల్చడానికి 3 గంటలు టైం పట్టేది. దీంతో క్యూలైన్లో జనాలు అసలు తగ్గేవారు కాదు. విశ్రాంతి తీసుకోకుండా అర్ధరాత్రి వరకూ అలా పనిచేసుకుంటూ ఉండేదాన్ని' అని చెప్పారు. క్రిమేషన్ మిషన్ గురించి కూడా ఆమె మాట్లాడారు. 'ఇప్పుడు పని చాలా సులువు అయింది. 45 నిమిషాల్లోనే అంతా అయిపోతోంది. అయితే ఈ యంత్రాలు భావోద్వేగాలని మాత్రం మార్చలేవు. చాలామంది ఇది చాలా సున్నితమైన పని.. మహిళలు దీనికి పనికిరారు అని ముద్రవేశారు. కానీ ఇక్కడికి వచ్చిన పురుషుల్లో చాలామంది క్రిమేషన్ జరుగుతున్నప్పుడు వణికిపోవడం నేను చూశాను' అని చెబుతున్న తుంపా ఈ పని ఎంచుకున్నందుకు ఎవరూ తనని పెళ్లిచేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇటీవలె ఓ పెళ్లి సంబంధం వచ్చింది. అయితే తను చేస్తున్న పని తెలిసి వారు పెళ్లికి నిరాకరించారు. ఇది తుంపాని చాలా బాధించింది. అయితే అదే సందర్భంలో ఆమెని మరింత శక్తిమంతురాలిగా తయారుచేసింది.

స్మశాన వాటికలో తుంపా చేస్తున్న పనిని ఈ పరిస్థితులు ఏవీ మార్చలేవు. తను చేస్తున్న పని గురించి తుంపా ఏం చెబుతుందంటే.. 'నేటి సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య ఎటువంటి తేడా లేదు. ప్రతి ఒక్కరూ సమానమే. అయితే వారు నిర్వర్తించవలసిన పాత్రలే మారుతుంటాయి. ఇది అందరూ గ్రహించాలి. అప్పుడే ప్రతి పని పట్ల గౌరవం కలుగుతుంది' అని ఆమె ముగించింది. చితి మంటల వెలుగులో భయం కంటే ధైర్యాన్ని చూసిన తుంపా భవిష్యత్తు ప్రయాణం ప్రకాశవంతంగా వెలగాలని ఆశిద్దాం.

ట్రిపుల్ ఆర్ కాంబో రిపీట్

జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ట్రిపుల్ ఆర్' మూవీ సష్టించిన మాయాజాలం అంతా ఇంతాకాదు. ఇప్పుడు అదే జోడీని మరోసారి తెరపైకి తెచ్చేందుకు దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం 'జైలర్ 2'లో బిజీగా ఉన్న ఆయన త్వరలో తారక్-చెర్రీ కాంబోలో ఓ మాస్ మల్టీస్టారర్ ప్లాన్ చేస్తున్నారు. ఇద్దరు హీరోలు కూడా కథ విన్న తర్వాత పాజిటివ్‌గా స్పందించారని సమాచారం. దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ మల్టీస్టారర్‌లో వచ్చిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'. ఈ సినిమా వచ్చి మూడేళ్లవుతున్నా చరణ్-తారక్ జోడీ తెరపై సృష్టించిన మ్యాజిక్ ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో మార్మోగుతూనే ఉంది. రాజమౌళి సృష్టించిన ఆ విజువల్ వండర్‌లో ఇద్దరు హీరోల నటన, స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ కనెక్ట్ అన్నీ కలిపి ఇండియన్ సినిమా రేంజ్‌ని పెంచేశాయి. చెర్రీ చేసిన రామరాజు పాత్ర, తారక్ చేసిన భీమ్ పాత్రల మధ్య ఉన్న స్నేహం, ఘర్షణ, త్యాగం ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసాయి.

ముఖ్యంగా 'నాటు నాటు' పాటతో తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ అవార్డు అందుకోవడం చరిత్ర సృష్టించింది. ఇలాంటి అద్భుతమైన కాంబినేషన్ మళ్లీ స్క్రీన్‌పై కనిపిస్తే ఎలా ఉంటుందో అనేది అభిమానుల్లో చర్చగా మారింది. ఆ ఊహకు మరింత బలం చేకూరుస్తూ తమిళ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఈ ఇద్దరు స్టార్ హీరోలతో ఓ భారీ మల్టీస్టారర్ ప్లాన్ చేస్తున్నారని టాలీవుడ్‌లో హాట్ టాపిక్ నడుస్తోంది. 'జైలర్'తో రజనీకాంత్ అభిమానులను అలరించిన నెల్సన్, ఇప్పుడు దాని సీక్వెల్ 'జైలర్ 2' పనుల్లో బిజీగా ఉన్నారు. రజనీకాంత్‌తో పాటు మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ వంటి సౌత్ లెజెండ్స్‌తో ఆ సినిమాలో చేసిన మల్టీస్టార్ మ్యాజిక్ ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. తాజాగా రజనీకాంత్, కమల్‌హాసన్ కాంబినేషన్‌లో నెల్సన్ మరో భారీ చిత్రానికి ప్లాన్ చేసినట్లుగా సమాచారం. అదే సమయంలో తారక్, చెర్రీ కాంబోను కూడా తన లిస్టులో పెట్టుకున్నాడని తమిళ సినీ ఇండస్ట్రీలో కూడా చర్చలు నడుస్తున్నాయి.

'ఓజీ 2' పనుల్లో సుజీత్

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో రూపొందిన 'ఓజీ' మూవీకి సీక్వెల్‌గా 'ఓజీ 2' ఒరానుంది. ప్రస్తుతం నాని సినిమాతో బిజీగా ఉన్నప్పటికీ సుజీత్ 'ఓజీ 2' ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించినట్లుగా సమాచారం. 'ఓజీ'కి పనిచేసిన అదే టీమ్ మళ్లీ ఈ సీక్వెల్‌లో కూడా పనిచేయనుంది. ఈసారి డీవీవీ దానయ్య కాకుండా, వెంకట్ బోయినపల్లి నిర్మాతగా మారే అవకాశం ఉందని సమాచారం. పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ప్రాజెక్ట్ అధికారికంగా ప్రారంభం కానుంది.

పవీష్ నారాయణ్‌కు జోడీగా నాగదుర్గ

తెలుగు రాష్ట్రాల్లో యూట్యూబ్ ఫోక్ సాంగ్స్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న కూచిపూడి డ్యాన్సర్, తెలంగాణ జానపద నృత్య కళాకారిణి నాగదుర్గకు సినిమా ఛాన్స్ దక్కింది. ప్రముఖ తమిళ నటుడు ధనుష్ మేనల్లుడైన పవీష్ నారాయణ్ నటిస్తున్న కొత్త సినిమాలో ఆమె కథానాయిక. మగేష్ రాజేంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగులో ఇప్పటికే 'కలివి వనం' అనే సినిమాలో నాగదుర్గ నటించింది. ఈ సినిమాతో ఆమెకి పెద్దగా గుర్తింపు రాలేదు. మరోవైపు నాగదుర్గ చేసిన ఫోక్ సాంగ్స్‌లో యూట్యూబ్‌లో విపరీతమైన ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల వచ్చిన 'దారి పొంటోత్తుండు' అనే పాట ఏకంగా 100 మిలియన్ల వ్యూస్‌ను దాటి రికార్డు సృష్టించింది. ఈ పాటతోనే తమిళంలో అవకాశం దక్కినట్లుగా సమాచారం. ఈ కొత్త సినిమా షుటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

'ఫౌజీ'లో జూనియర్ ప్రభాస్‌గా దర్శన్

ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమా 'ఫౌజీ'.దర్శకుడు హను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తోంది. చైత్ర జె ఆచార్ కథానాయిక.నటుడు సుధీర్‌బాబు రెండో కుమారుడు దర్శన్ ఈ సినిమాతో ఎంట్రీ ఇస్తున్నారు. దర్శన్ కథానాయకుడు మహేష్‌బాబు మేనల్లుడు కూడా. మహేష్‌బాబు నిర్మిస్తున్న గూఢచారి-2లో కూడా దర్శన్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారని సమాచారం. సుధీర్‌బాబు ఇప్పటికే తన పెద్ద కుమారుడు చరిత్ మానస్‌ను వెండితెరకు పరిచయం చేశారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మోసగాళ్లకు మోసగాడు' కూడా ఓ చిన్న పాత్రలో చరిత్ నటించాడు. గతంలో తను పలు సినిమాల్లో మెరిశాడు. భలే మగాడివోయ్ సినిమాలో జూనియర్ నానిగా కనిపించారు. మహేష్‌బాబు తనయుడు గౌతమ్ కూడా 1 నేనొక్కడినే' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యారు. ఇప్పుడు సుధీర్‌బాబు రెండో కుమారుడు దర్శన్ ఏకంగా ప్రభాస్ పాన్ ఇండియా చిత్రంతో ఎంట్రీ ఇవ్వనున్నాడు.

మార్చి 19న 'డెకాయిట్' విడుదల

కథానాయకుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డెకాయిట్'. ఇప్పటికే సినిమా విడుదల తేదీలు ప్రకటించిన వాయిదాలు పడుతూ వస్తోంది. గతంలో ఈ ప్రాజెక్ట్ నుంచి కోలీవుడ్ భామ శృతిహాసన్ అనూహ్యంగా తప్పుకున్నారు. ఇది కూడా సినిమా ఆలస్యానికి కారణమైంది. ఆ తర్వాత సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ కథానాయికగా చేస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. అనివార్య కారణాలతో వాయిదాపడటంతో వచ్చే ఏడాది ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. అడివి శేష్ నటించిన 'క్షణం', గూఢచారితో సహ పలు తెలుగు సినిమాలకు కెమెరామెన్‌గా చేసిన షానీల్ డియో ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ గ్లింప్స్ సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండింగ్‌లో ఉన్నాయి.

కుర్రాళ్ల సత్తాకు పరీక్ష

- బుమ్రా, వరణ్ చక్రర్తి ఇన్..
- నేడు ఆస్ట్రేలియాతో తొలి టి20
- మధ్యాహ్నం 1.45ని.లకు

కాన్‌బెర్రా: వన్డే సిరీస్‌ను చేజార్చుకున్న టీమిండియా.. ఇక టి20 సిరీస్‌పై దృష్టి సారించింది. వన్డేల సిరీస్‌లో సిడ్నీ వేదికగా జరిగిన మూడో, చివరి వన్డేలో ఆతిథ్య జట్టుకు చెక్ పెట్టిన టీమిండియా.. అదే ఊపుతో టి20 సిరీస్‌కు సిద్ధమైంది. ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి టి20 కాన్‌బెర్రా వేదికగా జరుగుతోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కి తోడు యువ క్రికెటర్లతో కూడిన భారతజట్టు ఈ సిరీస్‌ను చేజిక్కించుకోవాలని చూస్తోంది. సూర్యకుమార్ యాదవ్ మంగళ వారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఆసీస్ పిచ్‌లపై పవర్ ప్లే ఓవర్లు కీలకంగా మారుతాయని,బుమ్రా చేరికతో బౌలింగ్ విభాగం పటిష్టంగా ఉందని పేర్కొన్నాడు. ఆసీస్‌తో మ్యాచ్‌లు తమకు ఒక సవాలుతో కూడుకున్నవని, వన్డే, టి20 ప్రపంచకప్‌లలో ఆ జట్టు ఎలా ఆడిందో చూశామన్నాడు. చివరి వన్డేలో గాయపడ్డ ఆల్ రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి ఫిట్‌నెస్ సాధించాడని తెలిపాడు. 2026 టి20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ సిరీస్‌కు సిద్ధమయ్యామని, దక్షిణాఫ్రికా పిచ్‌లు పేసర్లకు అనుకూలం కాబట్టి ఆసీస్‌తో మ్యాచ్‌లు ఆడనున్నామన్నాడు. ఒక పేసర్, ఒక స్పిన్నర్‌తోపాటు ముగ్గురు ఆల్‌రౌండర్లకు తుదిజట్టులో చోటు దక్కడం ఖాయమన్నాడు. మరోవైపు ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను చేజిక్కించు కున్న ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. మూడు వన్డేల సిరీస్‌ను 1-2తో చేజిక్కించుకున్న ఆసీస్ జట్టు సొంతగడ్డపై ఈ ఫార్మాట్‌లోనూ పటిష్ట భారత్‌కు చెక్ పెట్టాలని చూస్తోంది. టీమిండియా, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటి వరకు 32 టి20ల్లో తలపడగా.. అందులో 20 మ్యాచుల్లో భారత జట్టు, 11 మ్యాచుల్లో ఆసీస్ జట్టు గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.

షెడ్యూల్...

29(బుధ)	:	తొలి టి20 (కాన్‌బెర్రా)
31(శుక్ర)	:	రెండో టి20(మెల్‌బోర్న్)
నవం.2(ఆది)	:	మూడో టి20(హోబర్ట్)
6(గురు)	:	నాల్గో టి20(గోల్డ్‌కోస్ట్)
8(శని)	:	ఐదో టి20(బ్రిస్బేన్)

అభిషేక్‌కు కళ్లెం వేస్తాం: మిచెల్ మార్ష్

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మకు కళ్లెం వేస్తామని ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ పేర్కొన్నాడు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 'అభిషేక్ శర్మ అద్భుతమైన నైపుణ్యమున్న ఆటగాడని, మేం అతణ్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా మన్నాడు. ప్రపంచంలోని అత్యుత్తమ ఆట గాళ్లతో తలపడి మనల్ని మనం పరీక్షించు కోవాలి' అని మిచెల్ మార్ష్ అన్నాడు. అభిషేక్ ఐసిసి టి20 బ్యాటర్ల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 23 ఇన్నింగ్స్‌ల్లో 36.91 యావరేజ్‌తో 849 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకాలు, అయిదు అర్ధశతకాలున్నాయి.

జట్లు(అంచనా)..

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), సంజు(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, గిల్, తిలక్ వర్మ, దూబే, అక్షర్ పటేల్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్, రింకు సింగ్/సుందర్.

ఆస్ట్రేలియా: మార్ష్(కెప్టెన్), ఇంగ్లిస్(వికెట్ కీపర్), హెడ్, షార్ట్, టిమ్ డేవిడ్, స్టొయినీస్, ఓవెన్, బార్ట్‌లెట్, హేజిల్‌వుడ్, ఫిలిప్పే, ఎల్లిస్/డ్వార్షిస్.

సత్తా చాటిన భరత్ హుడా

పట్నా పైరెట్స్‌పై తెలుగు టైటాన్స్ గెలుపు
ఫైనల్ బెర్త్‌కు నేడు పుణేరి పల్టన్స్‌తో ఢీ

న్యూఢిల్లీ: తెలుగు టైటాన్స్ రైడర్ భరత్ హుడా నిర్ణయాత్మక మ్యాచ్‌లో సత్తా చాటాడు. మంగళవారం జరిగిన ఎలిమినేటర్-3లో పట్నా పైరెట్స్‌పై తెలుగు టైటాన్స్ సంచలన విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 46-39పాయింట్ల తేడాతో పట్నాను చిత్తు చేసింది. టైటాన్స్ జట్టులో భరత్ హుడా(23పాయింట్లు), కెప్టెన్ విజయ్ మాలిక్(5), అజిత్ పవార్(3)రాణించగా.. డిఫెన్స్‌లో అజిత్, అంకిత్, శుభమ్ రాణించారు. ఇక పట్నా రైడర్ అయాన్(22) ఒంటరి పోరాటానికి తోడు డిఫెండర్ నవ్‌దీప్(5) మాత్రమే రాణించారు. పట్నా కెప్టెన్ అంకిత్ నిరాశపరిచారు. బుధవారం జరిగే క్వాలిఫయర్-2లో ఫైనల్ బెర్త్ కోసం తెలుగు టైటాన్స్ జట్టు పుణేరి పల్టన్స్‌తో తలపడనుంది. శుక్రవారం ఫైనల్ జరగనుంది. దబాంగ్ ఢిల్లీ టై బ్రేకర్‌లో పుణేరి పల్టన్స్‌ను చిత్తుచేసి ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే.

ఫైనల్ బెర్త్ ఎవరిదో..?

నేడు ఇంగ్లండ్ × దక్షిణాఫ్రికా అమీ తుమీ
ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

గౌహతి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. లీగ్ దశలో 2, 3 స్థానాల్లో ఉన్న ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి సెమీఫైనల్ మ్యాచ్ ఆస్ట్రేలియా, ఇండియా జట్ల మధ్య గురువారం రెండో సెమీస్ జరగనుంది. ఆసీస్, ఇంగ్లండ్ జట్లకు ఇక్కడే ఓడిస్తే మినహా.. కొత్త విజేతను చూడలేం. అన్ని విభాగాల్లో దుర్భేద్యంగా ఉన్న ఈ రెండు జట్లకు టీమిండియా, సఫారీ జట్లు మట్టికరిపించాలంటే సర్వశక్తులు ఒడ్డాల్సిందే.

ఆస్ట్రేలియా ఏడుసార్లు, ఇంగ్లండ్ మహిళలజట్టు నాలుగుసార్లు ఛాంపియన్‌గా నిలిచింది. న్యూజిలాండ్ జట్టు ఒకసారి విశ్వవిజేతగా నిలిచింది. ఈ సీజన్‌లో కివీస్‌జట్టు కనీసం సెమీస్‌కు కూడా చేరలేదు. పదమూడో సీజన్‌లోనూ అలీసా హేలీ సారథ్యంలోని ఆసీస్ జట్టు అజేయంగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లి తొమ్మిదోసారి విజేతగా నిలవాలనే కసితో ఉంది. మరోవైపు చివరి లీగ్ మ్యాచ్‌లో ఓటమి మినహా ఛాంపియన్ ఆటతో ఇంగ్లండ్ సెమీస్ బెర్తు దక్కించుకుంది.

దక్షిణాఫ్రికా మహిళలు ఆరంభ పోరులో ఇంగ్లండ్ చేతిలో 69 పరుగులకే ఆలౌటయ్యారు. అయినా సఫారీ జట్టు కెప్టెన్ లారా వొల్వార్డ్ ఊహించని విధంగా జట్టును సెమీస్ చేర్చింది. మిడిలార్డర్లలో చోలే ట్రయాన్, మరినే కాప్.. ఫినిషర్ డీక్లెర్క్ విధ్వంసం సృష్టిస్తున్నారు. స్పిన్నర్ మ్లాబా జోరుతో వరుసగా ఐదు విజయాలతో నాకౌట్ పోరుకు అర్హత సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68